తిరుపతి - చిత్తూరు
తెలుగు జాతీయ దినపత్రిక వార్త
30 ఏళ్ల ప్రస్థానం · 30 వార్త వార్షికోత్సవం · 1996 - 2026

## కుప్పం డిపోకు త్వరలో ఎలక్ట్రిక్ బస్సులు

### ఆర్టీసీ వైస్ చైర్మన్ పిఎస్ మునిరత్నం



కుప్పం ఏప్రిల్ 13 ప్రభాతవార్త

సీఎం చంద్రబాబు నాయుడు ఆదేశాలతో కుప్పం ఆర్టీసీ డిపోకు నూతనంగా ఎలక్ట్రిక్ బస్సులను తీసుకురావడం జరుగుతుందని ఆర్టీసీ వైస్ చైర్మన్ పి ఎస్ మునిరత్నం పేర్కొన్నారు . సోమవారం జిల్లా ప్రజా రవాణా అధికారి రాముతో కలిసి ఆయన కుప్పం ఆర్టీసీ డిపోను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్వరలోనే 75 కోట్ల రూపాయలతో కుప్పంలో అత్యాధునిక బస్ స్టేషన్ నిర్మాణంకు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. అదేవిధంగా కుప్పం సమీపంలోని గుట్టపల్లి వద్ద ఆధునాతన ఆర్టీసీ డిపోను సైతం నిర్మించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. కడ ఆధ్వర్యంలో అధునాతన మరుగుదొడ్లను సైతం ప్రయాణికుల సౌకర్యార్థం నిర్మించనున్నట్లు తెలిపారు. సీఎం చంద్రబాబు నాయుడు మహిళలకు ఇచ్చిన హామీ మేరకు ఉచిత బస్సు ప్రయాణాన్ని అమలు చేస్తున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో డిపో మేనేజర్ టికె స్వామి పాల్గొన్నారు .

## స్టేడియం పరిసరాలు పరిశుభ్రంగా ఉంచండి

### కమిషనర్ ఎన్. మౌర్య







తిరుపతి, ఏప్రిల్ 13 ప్రభాతవార్త

నగరపాలక సంస్థ పరిధిలోని గొల్లవాణిగుంటలోని క్రికెట్ స్టేడియం పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని కమిషనర్ ఎన్.మౌర్య అధికారులను ఆదేశించారు. గొల్లవాణిగుంటలో ఏర్పాటు చేసిన క్రికెట్ స్టేడియం, పరిసరాలను సోమవారం మధ్యాహ్నం ఇంజినీరింగ్, ఆరోగ్య శాఖ విభాగాల అధికారులతో కలసి కమిషనర్ పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ స్టేడియం పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని తెలిపారు. క్రికెట్ స్టేడియం ఎదురుగా ఉన్న రోడ్డు డివైడర్ల మధ్యలో మొక్కలు ఏర్పాటు చేసి అందంగా ఏర్పాటు చేయాలని తెలిపారు. కమిషనర్ వెంట మునిసిపల్ ఇంజనీర్ తులసి కుమార్, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, డి.ఈ.రమణ, హార్టికల్చర్ ఆఫీసర్ హరికృష్ణ, శానిటరీ సూపర్ వైజర్ సుమతి, తదితరులు ఉన్నారు.

## ప్రతి పిహెచ్‌సికి ఇంటర్నెట్

### - జిల్లా కలెక్టరు సుమిత్‌కుమార్



సంజీవని ప్రాజెక్టుపై పిహెచ్‌సి సిబ్బందితో సమావేశమైన జిల్లా కలెక్టరు

చిత్తూరురూరల్,ఏప్రిల్ 13 ప్రభాతవార్త:

జిల్లా కలెక్టరు నిధులతో ఒక్కొక్క పిహెచ్‌సికి రూ. 25వేలతో ఇంటర్నెట్ కేటాయించడం జరుగుతుందని జిల్లా కలెక్టరు సుమిత్‌కుమార్ తెలిపారు. సోమవారం సాయంత్రం జిల్లా కలెక్టరు సమావేశ మందిరంలో చిత్తూరు, పూతలపట్టు నియోజకవర్గ పిహెచ్‌సి స్టాఫ్‌నర్సులకు సంజీవని ప్రాజెక్టుపై సమావేశం నిర్వహించారు. ప్రతి పిహెచ్‌సికి వారం లోపల ఇంటర్నెట్ కేటాయించడం జరుగుతుందని, తద్వారా అభా ఐడి క్రియేషన్ సులభం అవుతుందన్నారు. అన్ని రకాల రిపోర్ట్సు, పేషంట్స్ రిజిస్ట్రేషన్ ఆప్‌డేట్ చేయాలని, ఓపికి వచ్చిన ప్రతి పేషెంట్‌ను తప్పనిసరిగా నమోదు చేయాలని, సాయంత్రం నాలుగు తర్వాత వచ్చే పేషెంట్లను కూడా తప్పనిసరిగా నమోదు చేయాలన్నారు. పిహెచ్‌షినందు నాలుగు లాగిన్స్, పిసిసి స్టాఫ్‌నర్స్, డాక్టర్, ఎల్‌టి ఫార్మసిస్టు తప్పనిసరిగా అందరూ ఓపి పేషెంట్స్‌కు 100శాతం చేయాలని ఆదేశించారు. సంజీవని ప్రాజెక్టు ఇంప్లిమెంటేషన్ కొరికు వీవంతు సహకారం అందించాలని, తద్వారా సులభంగా పేషెంట్స్‌కకు చికిత్స ఇవ్వడం జరుగుతుందన్నారు. అందరూ కలసి పనిచేస్తే డిజిటల్ డేటా ఎంట్రీ విత్ అభా ఐడితో భవిష్యత్తు పున:పరిశీలనకు తోడ్పడుతుందన్నారు. ప్రజలకు దీర్ఘకాలిక వ్యాధుల గురించి అవగాహన కల్పించాలని, ప్రతి ఒక్కరి కృషితో అందరికీ ఆరోగ్యం దిశగా పయనిద్దామని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డిఎంహెచ్‌ఓ డా. నాగశశిభూషణ్‌రెడ్డి, డిఎస్‌ఓ డా.గిరి, చిత్తూరు, పూతలపట్టు కన్సల్టెన్సీ పిహెచ్‌సి స్టాప్‌నర్సులు, సంబంధిత సిబ్బంది పాల్గొన్నారు.







## రైల్వే బ్రిడ్జి మూత.. రేణిగుంట వాసులకు గుండె కోత....

### అధికారుల నిర్వాకంతో సంత గేటు బ్రిడ్జి వద్ద స్తంభించిన ట్రాఫిక్

రేణిగుంట ఏప్రిల్ 13 ప్రభాతవార్త

రేణిగుంట తిరుపతి ప్రధాన మార్గంలోని పాత చెక్‌పోస్ట్ వద్ద ఉన్న రైల్వే అండర్ బ్రిడ్జిని మరమ్మత్తుల దృష్ట్యా రైల్వే అధికారులు సోమవారం మూసివేశారు. నెలరోజుల పాటు బ్రిడ్జి పనులు జరుగుతాయని ఆ తరువాత బ్రిడ్జిని తెరుస్తామని తెలపడంతో రేణిగుంట వాసులు తీవ్ర అసంతృప్తికి గురయ్యారు. ఎలాంటి ప్రత్యామ్నాయ మార్గం ఏర్పాటు చేయకుండా రైల్వే అధికారులు తీసుకున్న ఏకపక్ష నిర్ణయం పై రేణిగుంట వాసులు, మండల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రజా ప్రభుత్వాలు ప్రజల సంక్షేమం కోసం పనిచేయాలి తప్ప ప్రజలను ఇబ్బంది పెట్టకూడదని పలువురు అభిప్రాయపడుతున్నారు. చిన్న బ్రిడ్జి కడితేనే రైల్వే అధికారులు కాంట్రాక్టర్ల ద్వారా సర్వీస్ రోడ్డు ఏర్పాటు చేసిన తర్వాతనే పనులు ప్రారంభిస్తారని అయితే రేణిగుంటలో బ్రిడ్జి మూత రైల్వే అధికారులు ఏకపక్షంగా చేశారంటూ ప్రజలు అంటున్నారు. చుట్టుపక్కల గ్రామ ప్రజలు రేణిగుంటకు చేరుకోవాలన్న రేణిగుంట ప్రజలు శ్రీకాళహస్తి మార్గం వైపు వెళ్లాలన్న దాదాపు పది కిలోమీటర్లు చుట్టూ తిరిగి ప్రయాణించాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. ప్రత్యామ్నాయ మార్గం ఏర్పాటు చేయకుండా ఎందుకు బ్రిడ్జిని మూసివేసారంటూ ప్రశ్నించని వారు లేరు. ప్రజాస్వామ్య దేశంలో ఉన్నామా లేక నియంతల పాలనలో ఉన్నామా అని ప్రజలు ఆగ్రహంతో ఉన్నారు. రైల్వే అధికారుల చర్యలపై సర్వత్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కొండనాలుకకు మందు వేస్తే ఉన్న నాలుక ఊడింది అన్న సందాన మారింది రేణిగుంట పట్టణంలో ట్రాఫిక్ పరిస్థితి. గేటు మూసి వేయడం వల్ల సంత గేటు వద్ద, తిరుచానూరు సమీపంలో వార్త దినపత్రిక క్రాస్ వద్ద, కరకంబాడి అండర్ బ్రిడ్జి, రైల్వే గేట్ లో వద్ద ట్రాఫిక్ స్తంభించి వాహనదారులు తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ట్రాఫిక్ ను క్రమబద్ధీకరించడానికి రేణిగుంట అర్బన్ పోలీసులు, రేణిగుంట రూరల్ పోలీసులు, తిరుచానూరు పోలీసులు, చివరకు తిరుపతి ట్రాఫిక్ పోలీసులు పడుతున్న ఇబ్బందులు అంతా ఇంతా కాదు. ముఖ్యంగా సంత గేటు వద్ద రైలు వస్తున్న సమయంలో గేటు వేస్తున్నప్పుడు గేటు తెరిచేలోపు లెక్కకు మించిన వాహనాలు గేటుకు అటువైపు ఇటువైపు నిలిచిపోతున్నాయి. దీంతో ట్రాఫిక్ కు మాత్రమే కాదు జనజీవనాన్ని కూడా ఇబ్బంది కలుగుతుంది. ఈ బ్రిడ్జి మరమ్మత్తుల కారణంగా రేణిగుంట వాసులకు ఇతర ప్రాంతాలకు కనెక్టివిటీ కట్ అయిందని చెప్పడం ఎంత మాత్రం అతిశయోక్తి కాదు. బ్రిడ్జి పనులు జరిగేటప్పుడు ఐదు కాణా బ్రిడ్జి (ఐదు కన్నుల బ్రిడ్జి) కింద తాత్కాలిక రోడ్డును ఏర్పాటు చేస్తే ట్రాఫిక్ సమస్య ఉన్నదని పలువురు విజ్ఞులు భావిస్తున్నారు. పెద్దపెద్ద వాహనాలను దారి మళ్ళించి ఆటోలు, కార్లు, టెంపోలు, ద్విచక్ర వాహనాలు, సుమోలు లాంటి చిన్న వాహనాలు రాకపోకలు సాగించడానికి పెద్ద వాహనాలు రాకుండా పైన యాంగ్లర్లు ఏర్పాటు చేస్తే బాగుంటుందన్న అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి.

అయితే బ్రిడ్జి నిర్మాణం జరిగేటప్పుడు ఏదైనా వాహనం బ్రిడ్జిని ఢీకొంటే పరిస్థితి ఏమిటని ఓ రైల్వే అధికారి ప్రశ్నించడం అందరిని ఆశ్చర్యానికి గురిచేస్తుంది. బ్రిడ్జి పైన దాదాపు 150 కిలోమీటర్ల వేగంతో రైళ్ల ప్రయాణిస్తాయి కదా! అప్పుడు బ్రిడ్జికి ఏమి కాదా అంటూ ప్రశ్నించని వాళ్ళు లేకపోలేదు.???? ఇది ఇలా ఉండగా సాయంత్రం బలోరా వాహనం సొంత గేటు అవతలి వైపు అండర్ బ్రిడ్జి కింద ఇరుక్కోవడంతో ట్రాఫిక్ భారీగా స్తంభించిపోయింది. ట్రాఫిక్ ను క్రమబద్ధీకరించడానికి పోలీసులు చాలా కష్టపడాల్సి వచ్చింది. ఔరా ఇదేనండి రైల్వే అధికారుల నిర్వాకం అంటూ ప్రజలు ముక్కుపై వేలు వేసుకున్నారు...

## పార్టీశ్రేణులకు దిశానిర్దేశం చేయనున్న లోకేష్

### -నేడు సాయంత్రం తిరుపతికి రాక

### -రేపు క్రీడాసముదాయాలు ప్రారంభం



తిరుపతి.ఏప్రిల్ 13ప్రభాతవార్తప్రతినిధి:

టిడిపి యువనేత,రాష్ట్రమంత్రి నారాలోకేశ్ పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేసి, పార్టీ సీనియర్ నేతలను సముదాయించేందుకు మంగళవారం సాయంత్రం తిరుపతికి వస్తున్నారు. రెండురోజుల జిల్లా పర్యటనలో మంత్రి హోదాలో తొలిసారిగా తిరుపతికి విచ్చేస్తుండటంతో అటు పార్టీ శ్రేణులు, ఇటు అధికారులు అన్ని ఏర్పాట్లు చేపడుతున్నారు. నేటి సాయంత్రం 7గంటలకు తిరుపతికి వస్తున్న లోకేశ్ రాత్రికి తిరుపతి రూరల్ రామానాయుడు కల్యాణమండపంలో బసచేస్తారు. బుధవారం ఉదయం తిరుపతి నగరపాలకసంస్థ ఆధ్వర్యంలో శాప్స్ నిధులతో అభివృద్ధిచేసిన తారకరామా క్రీడా మైదానం, ఇతర మైదానం సముదాయాలను ఆయన ప్రారంభిస్తారు.అనంతరం చంద్రగిరిలో నూతనంగా నిర్మించిన క్రీడామైదానంను ప్రారంభోత్సవం చేస్తారు. తిరిగి తిరుపతికి చేరుకుని పార్టీ శ్రేణులతో, సీనియర్లతో, కార్యకర్తలతో ఆత్మీయ సమీక్షా సమావేశం నిర్వహిస్తారు. కార్యకర్తలకు పార్టీ పరంగా చేయాల్సిన కార్యక్రమాల వివరాలను నిర్ధేశం చేస్తారని తెలుస్తోంది. మంత్రి రాకతో జిల్లా కలెక్టర్ డాక్టర్ సలిజామల వెంకటేశ్వర్, జిల్లా ఎస్పీ లంకెల సుబ్బరాయుడు, నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య, తదితరులు ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు.

## ఎస్ఎస్ఏ ఏపీసీపై వేటు!





తిరుపతి విద్య, ఏప్రిల్ 13 ప్రభాత వార్త

సమాజంలో గౌరవప్రదమైన హోదాలో ఉండి, తోటి మహిళా ఉద్యోగినిపై కన్నేసిన ఓ ఉన్నతాధికారి ఉదంతం తిరుపతిలో కలకలం రేపింది. సమగ్ర శిక్ష (ఎస్ఎస్) విభాగంలో అడిషనల్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ (ఏపీసీ)గా పనిచేస్తున్న గౌరీశంకర్ రావు,తన కార్యాలయంలోని మహిళా ఉద్యోగినిని లైంగికంగా వేధిస్తున్నారనే ఆరోపణలు రావడంతో జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ ఆయనపై కఠిన చర్యలు తీసుకున్నారు. గౌరీశంకర్ రావును తక్షణమే ప్రభుత్వం నుంచి సరెండర్ చేస్తూ కలెక్టర్ నివేదిక పంపారు. కేవలం సరెండర్ చేయడమే కాకుండా,ఆయనపై కఠినమైన శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వానికి సిఫారసు చేశారు. బాధితురాలు ఎదుర్కొన్న వేధింపుల తీవ్రతను పరిగణనలోకి తీసుకున్న కలెక్టర్, ఈ వ్యవహారాన్ని అత్యంత సీరియస్‌గా పరిగణించారు. బాధితురాలి కథనం ప్రకారం.. గౌరీశంకర్ రావు కొంతకాలంగా ఆమెను ఆఫీసులో లైంగికంగా వేధిస్తున్నారు. వేధింపులు భరించలేక ఆమె నేరుగా అధికారి ఇంటికే వెళ్లి పద్ధతి మార్చుకోవాలని హెచ్చరించారు. అయినప్పటికీ ఆయనలో మార్పు రాకపోగా, కక్ష సాధింపు ధోరణితో వేధింపుల తీవ్రతను మరింత పెంచారు. దీంతో చేసేది లేక బాధితురాలు డీఈవో కేవీఎన్ కుమార్ కు ఫిర్యాదు చేయడంతో ఈ వ్యవహారం వెలుగులోకి వచ్చింది. బాధితురాలి ఫిర్యాదుపై కలెక్టర్ ఆదేశాల మేరకు విచారణ నిర్వహించగా, ఆరోపణలు వాస్తవమేనని తేలింది. ఆదివారం రాత్రి అందిన విచారణ నివేదికల ఆధారంగా కలెక్టర్ వెంకటేశ్వర్ తక్షణమే స్పందించారు. ఏపీసీ బాధ్యతల నుంచి ఆయన్ని తప్పించి, ఆ స్థానంలో ఇన్‌ఛార్జ్ ఏపీసీగా డీఈవోను నియమించారు. ఈ ఘటనపై మహిళా సంఘాలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. ఈ ఘటనపై ఉమెన్ ప్రొటెక్షన్ కమిటీ ద్వారా మరిన్ని వివరాలు సేకరించి సమగ్ర విచారణ జరిపిస్తామని కలెక్టర్ స్పష్టం చేశారు.

## అర్జీదారుల సమస్యలపై సకాలంలో పరిష్కారం

### జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్

. తిరుపతి కలెక్టరేట్, ఏప్రిల్ 13 ప్రభాతవార్త :



ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పి జి ఆర్ ఎస్) కార్యక్రమంలో వచ్చిన అర్జీలకు నాణ్యమైన పరిష్కారం చూపాలని జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం ఉదయం జిల్లా కలెక్టరేట్ నందు ఏర్పాటు చేసిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పి జి ఆర్ ఎస్) లో జిల్లా జాయింట్ కలెక్టర్ అర్జీదారులకు గౌరవప్రదంగా కుర్చీ ఏర్పాటుతో, వివిధ ప్రాంతాల నుండి వచ్చిన అర్జీదారులకు త్రాగునీటి సౌకర్యం, మెడికల్ క్యాంప్, గ్రామాల నుండి వచ్చు అర్జీదారులకు టి సరఫరా తదితర సౌకర్యాలను కల్పించి వారి సమస్యలను సావధానంగా వింటూ అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా పీ జి ఆర్ ఎస్ లో వచ్చిన అర్జీలకు నాణ్యమైన పరిష్కారం చూపాలని అర్జీదారుల సమస్యలపై నిరక్ష్యం వహిం చరాదని తెలిపారు. పెండింగ్ బియాండ్ ఎస్ఎల్ఏ ఓపెనింగ్ లేకుండా అర్జిదారుడు సంతృప్తి చెందేలా అర్జీలకు పరిష్కారం చూపాలన్నారు. పీ జి ఆర్ ఎస్ లో వచ్చు అర్జీలపై నిరక్ష్యం వహిస్తే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలోజాయింట్ కలెక్టర్ ఆర్. గోవింద రావు, జిల్లా రెవెన్యూ అధికారి నరసింహులు, స్పెషల్ డిప్యూటీ కల్లెక్టర్లు శివశంకర్ నాయక్, రోజ్ మాండ్, అను రాధ, డిప్యూటీ కలెక్టర్ గీతాంజలి లతో కలసి ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు.



## వేడుకగా జీయర్లభాష్యకారుల ఉత్సవం

*తిరుమల,ఏప్రిల్ 13ప్రభాతవార్తప్రతినిధి:*

*భాష్యకారుల ఉత్సవం సోమవారం తిరుమల ఆలయంలో ప్రారంభమైంది. 19 రోజుల పాటు ఈ ఉత్సవం జరుగనుంది. ఏప్రిల్ 22న భాష్యకార్ల సాత్తుమొర నిర్వహిస్తారు. భగవద్ రామానుజులు విశిష్టాద్వైత సిద్ధాంతపరంగా మీమాంస గ్రంథానికి "శ్రీభాష్యం" పేరుతో వ్యాఖ్యానం చేశారు. భాష్యకారుల ఉత్సవాల మొదటిరోజున సోమవారం ఉదయం శ్రీవారి ఆలయంలో మొదటి గంట అనంతరం రామానుజులవారిని బంగారు తిరుచ్చిపై ఆలయ నాలుగు మాడవీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. జీయ్యంగార్లు దివ్యప్రబంధ గోష్టి చేపట్టారు. ఈ కార్యక్రమంలో పెద్దజీయర్‌స్వామి, చిన్నజీయర్‌స్వామి, ఆలయ డిప్యూటీ ఇఒ లోకనాథం, పారుపత్తేదార్ హిమత్‌గిరి, తిరుమల డిఎస్పీ విజయశేఖర్,జీయర్‌స్వాములు పాల్గొన్నారు.*

## పురుగుల మందు తాగి రైతు ఆత్మహత్య

### కూటమినేతల వేధింపులే కారణమంటు సూసైడ్ నోట్



మృతి చెందిన బాబు

గంగాధర నెల్లూరు, 13 ఏఫ్రిల్ ప్రభాతవార్త:

గంగాధర నెల్లూరు పంచాయతీ రామానాయుడు పల్లి దళిత వాడకు చెందిన టి.బాబు 59 సోమవారం ఉదయం తమ ఇంటి వద్ద పురుగుల మందు సేవించి ఆత్మహత్యకు పాల్పడ్డాడు తీవ్రవాంతులు చేసు కుంటూ ఉండడంతో చుట్టుపక్కల వారు గమనించి చికిత్స నిమిత్తం చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.అయితే పరిస్థితి విషమించడంతో వైద్యులు అతని ప్రాణాలను కాపాడలేకపోచారు వివరాల్లోకి వెళితే గ్రామంలో గత కొద్ది సంవత్సరాలుగా బాబుకు అదే గ్రామానికి చెందిన పొన్ను స్వామికి భూవివాదం జరిగింది. దీంతో పొన్నుస్వామికి అండడా కూటమి ప్రభుత్వానికి చెందిన ముగ్గురు నేతలు తనను బెదిరించి తీవ్ర మనస్థాపానిని గురి చేశారని వీరి ప్రోత్భలంతో పోలీసు యంత్రాంగం కూడా గతంలో నన్ను వేదించే వారని తాను రాసుకున్న మరణ వాంగ్మూలంలో కనబరిచాడు.అయితే పోలీసుల కథనం మేరకు టి బాబు అనే వ్యక్తిని గత సంవత్సర కాలంగా పోలీస్ స్టేషన్‌కు పిలిపించలేదని కుటుంబ కలహాలతోనే అతను ఆత్మహత్యచేసుకున్నట్లు విచారణలో తేలడమే కాకుండా మృతుని కుమారుడు ఫిర్యాదులో కూడా పేర్కొన్నాడని పోలీసులు తెలిపారు.ఈ మేరకు ఇన్స్పెక్టర్ రమేష్ కేసు నమోదు చేసి శవాన్ని పోస్టుమార్టు చేసి దర్యాప్తు ప్రారంభించారు అయితే మృతుడు టి బాబు అందరివాడుగా అందరి మన్ననలు పొందిన బాబు మరణ వార్త విని చుట్టుపక్కల గ్రామాలు విషాదంలో మునిగిపోయారు.

## కార్పొరేట్ విద్యాసంస్థల కాసుల దందా!

### నిబంధనలు తుంగలో ప్రైవేట్,కార్పొరేట్ కాలేజీలు

### పది ఫలితాలు రాక ముందే అడ్మిషన్ల దందా





తిరుపతి విద్య ఏప్రిల్ 13 ప్రభాత వార్త

జిల్లాలో పదవ తరగతి పరీక్షలు ముగిసి పది రోజులు కూడా గడవకముందే, ప్రశ్నాపత్రాల మూల్యాంకనం ఇంకా కొనసాగుతుండగానే కార్పొరేట్, ప్రైవేటు విద్యాసంస్థలు తమ అడ్మిషన్లు వేగవంతం చేశాయి. ఫలితాలు రావడానికి ఇంకా సమయం ఉండగానే ఇంటర్ ఫస్ట్ ఇయర్ అడ్మిషన్లను నిబంధనలకు విరుద్ధంగా దాదాపు పూర్తి చేయడం విద్యా వ్యవస్థపై తీవ్ర విమర్శలకు దారి తీస్తోంది.తల్లిదండ్రుల అనిశ్చితిని అవకాశంగా మార్చుకున్న ఈ సంస్థలు సీట్లు ఫుల్ అవుతాయి, లేటైతే చాన్స్ మిస్ అనే మాటలతో మభ్యపెట్టి లక్షల రూపాయల ఫీజులు ముందుగానే వసూలు చేస్తున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇంటర్ చదువుతో పాటు జేఈఈ, నీట్ కోచింగ్ పేరుతో ప్యాకేజీలు చూపించి, విద్యార్థుల భవిష్యత్తుపై భయాన్ని సృష్టించి అడ్మిషన్ల దందాను పూర్తి చేస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి.ఇంకా ఆశ్చర్యకరంగా,పది ఫలితాలు రాకముందే కొన్ని కాలేజీలు తరగతులు ప్రారంభించడం నిబంధనలకు పూర్తి విరుద్ధం.ఇది కేవలం అడ్మిషన్ రేస్ మాత్రమే కాదు.. ప్రభుత్వ జూనియర్ కళాశాలలను బలహీనపరచాలనే ఉద్దేశపూర్వక ప్రయత్నమా? అన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి.విద్యార్థుల భవిష్యత్తు కాదా.. కార్పొరేట్‌ల లాభాలేనా? అన్న ప్రశ్న తల్లిదండ్రుల్లో తీవ్రంగా వినిపిస్తోంది. అధికారులు చూస్తూనే ఉండడం ఈ దందాకు మరింత ఊతమిస్తున్నదన్న ఆరోపణలు వస్తున్నాయి.విద్యను సేవగా కాకుండా వ్యాపారంగా మార్చిన ఈ ధోరణిపై తక్షణమే కఠిన చర్యలు తీసుకోకపోతే, భవిష్యత్తులో ప్రభుత్వ విద్యా వ్యవస్థ పూర్తిగా దెబ్బతినే ప్రమాదం ఉందని విద్యావేత్తలు హెచ్చరిస్తున్నారు.

**పరీక్షల నుంచి బయటపడ్డారా.. మళ్లీ క్లాసుల బంధనా?**

పది పరీక్షల ఒత్తిడిని తట్టుకుని బయటపడిన విద్యార్థులు ఇంకా ఆ మానసిక భారం నుంచి కోలుకోకముందే, కార్పొరేట్ కాలేజీలు మళ్లీ తరగతుల పేరుతో వారిపై ఒత్తిడి పెంచుతున్నాయి. కనీసం విశ్రాంతి కూడా ఇవ్వకుండా ఇంటర్ ఫస్ట్ ఇయర్ క్లాసులకు హాజరు కావాలని బలవంతం చేయడం విద్యార్థుల్లో ఆగ్రహాన్ని రగిలిస్తోంది.ఇంకా ఎగ్జామ్స్ స్ట్రెస్ నుంచి బయటపడలేదు.. మళ్లీ క్లాసులా? అంటూ విద్యార్థులు ప్రశ్నిస్తున్నారు. శారీరకంగా, మానసికంగా అలసిపోయిన సమయంలోనే బ్రిడ్జ్ కోర్సు పేరుతో తరగతులు పెట్టి హాజరు తప్పనిసరి చేస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.ఇంకా దారుణం ఏమిటంటే, తల్లిదండ్రులను ముందుగానే బ్రెయిన్‌వాష్ చేసి ఇప్పుడు జాయిన్ కాకపోతే పిల్లలు వెనుకబడిపోతారు" అనే భయాన్ని నాటుతూ కార్పొరేట్ యాజమాన్యాలు ఒత్తిడి పెంచుతున్నాయి. విద్యార్థుల విశ్రాంతి, ఆరోగ్యాన్ని పూర్తిగా పక్కన పెట్టి సిలబస్ ముందుకు నెట్టే ప్రయత్నం జరుగుతోందని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.బ్రిడ్జ్ కోర్సా..లేక ఒత్తిడి కోర్సా? అన్న ప్రశ్న ఇప్పుడు బలంగా వినిపిస్తోంది. చదువు పేరుతో విద్యార్థులపై ఇంత దారుణమైన ఒత్తిడి పెంచడం ఎంతవరకు సమంజసం అన్నది పెద్ద చర్చగా మారింది.విద్యార్థులకు కనీస విరామం, మానసిక ఉపశమనం ఇవ్వకుండా ఇలా తరగతులు నడపడం వారి ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం చూపుతుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

**ఫలితాలకుముందే బహిరంగంగా తరగతులు అధికారుల మోనంపై మండిపాటు**

జిల్లాలోని పలు ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలు నిబంధనలను తుంగలో తొక్కుతూ సోమవారం నుంచే ఇంటర్ ఫస్ట్ ఇయర్ తరగతులను బహిరంగంగా ప్రారంభించాయి. పది ఫలితాలు ఇంకా విడుదల కాకపోయినా క్లాసులు మొదలుపెట్టడం స్పష్టమైన ఉల్లంఘన అయినప్పటికీ, ఎవరూ పట్టించుకోకపోవడం తీవ్ర విమర్శలకు దారి తీస్తోంది.ఎవరు ఆపుతారు? అన్న ధోరణితో కార్పొరేట్ కాలేజీలు రెచ్చిపోతుండగా, జిల్లా యంత్రాంగం మాత్రం చూస్తూ ఉండటమేంటి అన్న ప్రశ్న విద్యార్థి సంఘాల నుంచి గట్టిగా వినిపిస్తోంది. నిబంధనలు ఉన్నాయా.. లేక ఉన్నట్టేనా? అన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి.విద్యార్థి సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేస్తూ,నిబంధనలకు విరుద్ధంగా తరగతులు నడుపుతున్న కాలేజీలపై వెంటనే తనిఖీలు నిర్వహించి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నాయి. అనుమతులను రద్దు చేసి బాధ్యులపై చర్యలు తీసుకోకపోతే, ఆ కళాశాలల ఎదుట ఆందోళనలు చేపడతామని హెచ్చరించాయి. క్లాసులు కాదు.. కాసుల కోసమే ఈ హడావిడి! అన్న విమర్శలు ఇప్పుడు బలంగా వినిపిస్తున్నాయి. అధికారుల నిరక్ష్య కొనసాగితే మరింత పెరిగే ప్రమాదం ఉందని విద్యావేత్తలు హెచ్చరిస్తున్నారు.

## అందని హామీ.. దీక్ష కొనసాగింపు

చిట్వేలి, ఏప్రిల్ 13 ప్రభాతవార్త:



పార్టీకి పునాదులు కార్యకర్తలు.. అట్టి కార్యకర్తలకు విలువ లేనప్పుడు, ఇబ్బందులకు గురి చేసినప్పుడు ఫలితం దీక్ష కొనసాగింపే సరైన మార్గమని తెలుపుతూ పట్టు విడవకుండా రెండవ రోజున తిమ్మయ్య గారి పల్లి మండలం, చిల్లా వాండ్లపల్లి నివాసి, బూత్ ఇన్చార్జి రామిశెట్టి నరసింహులు దీక్షను కొనసాగించారు. సోమవారం బాధితునికి అండగా పెనగులూరు వాసి, టీడీపీ స్టేట్ ముస్లిం మైనారిటీ కార్యదర్శి షేక్ శామీర్ భాష సంఘీభావం తెలుపుతూ దీక్షికు పూనుకున్నారు. తాను మాట్లాడుతూ పార్టీ కోసం 20 ఏళ్లుగా పనిచేసిన కార్యకర్తకు అన్యాయం జరిగితే పర్యవసానం ఇలాగే ఉంటుందని పార్టీ పెద్దలు గుర్తించాలని కోరారు. కాగా ఇదంతా జరుగుతున్నా అదే గ్రామానికి సీఎం రిలీఫ్ ఫండ్ నగదు పంపిణీ కోసం వచ్చిన రైల్వే కోడూరు ఇన్చార్జి ముక్కా రూపనంద రెడ్డి సతీమణి ముక్కా వరలక్ష్మి దీక్ష చేపట్టిన బాధితున్ని పరామర్శించకపోవడం, కారణం తెలుసుకోకపోవడం పట్ల పలువురు టిడిపి నాయకులు తీవ్రంగా విమర్శిస్తున్నారు. ఇది పార్టీకి నిజంగా నష్టాన్ని చేకూరుస్తుందని మండల టిడిపి నాయకులు అభిప్రాయం వ్యక్తపరుస్తున్నారు. టిడిపి నాయకులు బాలు రామాంజనేయులు నాయుడు, లారీ సుబ్బరాయుడు,చిట్వేలి గ్రామ పార్టీ అధ్యక్షులు పగడాల వెంకటేశు, నంద్యాల ధనుంజయ, సుబ్బరాయుడు,బండారు శివ,తుంగా సుబ్బరాయుడు, కాటూరి నరసింహులు తదితరులు బాదిత నరసింహులకు పరామర్శించి దీక్షకు మద్దతు తెలిపారు.

# నాపై పెట్టిన తప్పుడు కేసులను నిష్పక్షపాతంగా విచారించండి

## - ఏపి మొదలియార్ సంఘ అధ్యక్షుడు బుల్లెట్ సురేష్

చిత్తూరురూరల్, ఏప్రిల్ 13ప్రభాతవార్త:




మా ఇంట్లో జరిగిన దొంగతనం, ఆదే విధంగా నాపై పెట్టిన తప్పుడు కేసులను నిష్పక్షపాతంగా విచారణ చేపట్టాలని అధికారులకు ఏపి మొదలియార్ సంఘ అధ్యక్షుడు బుల్లెట్ సురేష్ విజ్ఞప్తి చేసారు. సోమవారం న్యూ కయనికట్టువీధిలో తన కార్యాలయంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గతంలో తన ఆఫీసులో దేవి స్వీపర్‌గా ఆమె కుమారుడు జాన్సన్ ఆఫీసు బాయ్‌గా, కుమార్తె విన్నరసి న్యూబాలాజీ కాలనీలోని ఇంటిలో పనిమనిషిగా చాలా నమ్మకంగా పనిచేసేవారన్నారు. ఈ క్రమంలో 2023 జనవరి 10వ తేది నుంచి బాలాజీనగర్‌లోని ఇంటిలో బంగారునగలు ఒక్కొక్కటీ కనిపించకుండా పోవడంతో అనుమానంతో సిసి కెమెరాలను ఏర్పాటు చేసామన్నారు. అనంతరం సిసి కెమెరా ఆధారంగా విన్నరసి అనుమానస్పదంగా ఇంటిలో తిరగడం చూసి ప్రశ్నించగా నేరం ఒప్పుకోడంతో పాటు కొంత గడువు ఇస్తే తిరిగి ఇచ్చేస్తామని వేడుకోవడం జరిగిందన్నారు. అలాగే జాన్సన్ ఇంటినుంచి భోజనం నాకు తీసుకొచ్చే క్రమంలో నా భార్య మనోరమకు మాయమాటలు చెప్పి 768గ్రాముల బంగారు తీసుకున్నాడన్నాడు. ఈవిషయం తెలిసిన నాకుమారుడు బాలాజీ ప్రశ్నించగా వారం రోజులు గడువు ఇస్తే నగలను తిరిగి ఇవ్వగలనని ప్రాధేయపడ్డాడని, గడువు అనంతరం ప్రశ్నించగా పెడసరితనంగా జవాబు చెప్పాడని పేర్కొన్నారు. ఈ విషయమై పోలీస్‌స్టేషన్‌లో సైతం కేసు పెట్టడం జరిగిందన్నారు. ఈ క్రమంలో చిత్తూరు నగరం, బస్టాండ్ వద్ద కోట్ల విలువ కలిగిన థియోసాపికల్ సొసైటీ భూములపై వైకాపా నాయకుడు కన్నేసారన్నారు. సొసైటీ భూములను కబ్జా చేయడానికి మరికొందరితో కలిసి తప్పుడు డాక్యుమెంట్లు సృష్టించి విక్రయించడానికి ప్రయత్నాలు మొదలు పెట్టారన్నారు. 100 ఏళ్లకు పైగా చరిత్ర వున్న సొసైటీ ఆస్తులను తమ స్వార్థం కోసం కబ్జా చేయడానికి ప్రయత్నించడంతో నేను తీవ్రంగా వ్యతిరేకించడం జరిగిందన్నారు. ఈ సొసైటీ ఆస్తుల పరిరక్షణకు హైకోర్టులో కేసు కూడా వేసానని, ఆ వ్యవహారంలో నేను గట్టిగా నిలబడడంతో మా ఇంటిలో దొంగతనానికి పాల్పడ్డవారితో అసత్య ఆరోపణలు చేయించి నాపై ఎస్సీ/ఎస్టీ అట్రాసిటీ కేసును పెట్టించారన్నారు. అలాగే చిత్తూరు వైకాపానాయకుల తీరు నచ్చక గత రెండు సంత్సరాలుగా పార్టీ కార్యకలాపాలకు దూరంగా వున్నాననీ, నేనే పార్టీకి రాజీనామా చేయాలనుకొంటుండగా అధిష్టానం నిజానిజాలు తెలుసుకోకుండా పార్టీ నుండి సస్పెండ్ చేయడం జరిగిందన్నారు. థియోసాపికల్ భూముల వ్యవహారంలో నాపై ఎన్ని కేసులు పెట్టినా అధైర్యపడనని, న్యాయపోరాటం చేస్తానని పేర్కొన్నారు. ఉన్నతాధికారులు నాపై పెట్టిన తప్పుడు కేసులను నిష్పక్షపాతంగా విచారణ చేసి, ఈ కేసుల వెనుక వున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని బుల్లెట్ సురేష్ కోరారు. ఈ సమావేశంలో బుల్లెట్‌సురేష్‌తో పాటు సాయి బాలాజీ (అప్పు), మాజీ మున్సిపల్ చైర్మెన్ భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

## పేదల ఆరోగ్యం కోసమే సంజీవని ప్రాజెక్టు

### - పికెఎం ఉడా ఛైర్మన్ డాక్టర్ బిఆర్ సురేష్‌బాబు

కుప్పం, ఏప్రిల్ 13 ప్రభాతవార్త



పేద ప్రజల ఆరోగ్యం కోసమే కుప్పంలో సిఎం చంద్రబాబునాయుడు టాటా సంస్థ సహకారంతో సంజీవని ప్రాజెక్టు (డిఐఎన్‌సి)ని ప్రవేశపెట్టారని పికెఎం ఉడా ఛైర్మన్ డాక్టర్ బిఆర్ సురేష్‌బాబు పేర్కొన్నారు. సోమవారం మండలంలోని కొత్తిండ్లు గ్రామంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించి వారి ఆరోగ్య రికార్డులు డిజిటలైజ్ చేయడం జరుగుతుందన్నారు. ఎవరికైనా అత్యవసర వైద్యం అవసరం అయితే వారికి నిష్ణాతులైన వైద్య నిపుణులచే ఆరోగ్య చికిత్సలు అ ందించడం జరుగుతుందన్నారు. వీటితో పాటు 47 రకాల రక్త పరీక్షలు సైతం ప్రజలకు నిర్వహించి దీర్ఘకాలిక వ్యాధులకు చికిత్స అందించడం జరుగుతుందన్నారు. ఈ ప్రాజెక్టును త్వరలోనే సిఎం చంద్రబాబు చిత్తూరు జిల్లాలో ఆపై రాష్ట్రమంతా అమలు చేస్తారన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం వైద్య సిబ్బందిని సత్కరించారు. కార్యక్రమంలో ఆర్టీసీ వైస్‌ఛైర్మన్ పిఎస్‌మునిరత్నం, టిడిపి మండల అధ్యక్షుడు రాజగోపాల్, ఎపిఐఐసి డైరెక్టర్ ప్రేమ్‌కుమార్, ఏరియా ఆస్పత్రి వైస్‌ఛైర్మన్ భాగ్యలక్ష్మి త్రిలోక్, సీనియర్ నేత తోట షణ్ముగం, రెస్కో డైరెక్టర్ ఆర్ముగం, కార్పోరేషన్ డైరెక్టర్లు వేణుగోపాల్, శరవణ తదితరులు పాల్గొన్నారు.

## బడుగుమాకులపల్లి సంతకు స్థలం కేటాయించాలి

శాంతిపురం, ఏప్రిల్ 13 ప్రభాతవార్త



స్థానిక బడుగుమాకులపల్లి వారపు సంతకు స్థలం కేటాయించాలని తెదేపా నేతలు సోమవారం తహశీల్దార్ ప్రకాష్‌బాబు, ఎంపిడిఒ ఎపిఆర్ కుమార్‌కు వినతిపత్రాలు అందించారు. వారపుసంత కుప్పం - పలమనేరు జాతీయ రహదారి పక్కనే నిర్వహిస్తుండడంతో అటు ప్రజలు, ఇటు వ్యాపారులు, రైతులు కూడా ఇబ్బందులు పడాల్సి వస్తోందన్నారు. తీవ్ర ట్రాఫిక్ అ ంతరాయం సైతం కలుగుతోందన్నారు. అధికారులు స్పందించి సంత నిర్వహణకు స్థలంను కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో నేతలు రాజు, శివశంకర్, శివ, రామకృష్ణ, బాలకృష్ణనాయుడు, కృష్ణప్ప పాల్గొన్నారు.

## బాలికలు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

శాంతిపురం, ఏ ప్రిల్ 13 ప్రభాతవార్త



బాలికలు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని రూరల్ సిఐ మల్లేష్ యాదవ్ పేర్కొన్నారు. సోమవారం కడపల్లి కస్తూరిబా గురుకులంలో మీ భద్రత - మా బాధ్యత కార్యక్రమంను నిర్వహించారు. ఈసందర్భంగా సిఐ మాట్లాడుతూ బాలికలు, మహిళల సంరక్షణ చట్టాలు, ప్రభుత్వం తీసుకుంటున్న చర్యల గురించి వివరించారు. అలాగే ధైర్య స్పర్శ కార్యక్రమం, పోక్సో చట్టం, సైబర్ నేరాలు, మాదకద్రవ్యాల వినియోగం వాటితో కలిగే అనర్థాల గురించి వివరించారు. కార్యక్రమంలో ఎస్సై నరేష్, శక్తి టీమ్, మహిళా పోలీసులు, చిత్తూరు మహిళా స్పెషల్ పార్టీ పోలీసులు పాల్గొన్నారు.

## రైతులకు రాయితీతో మామిడి కవర్లు

కుప్పం, ఏప్రిల్ 13 ప్రభాతవార్త

మామిడి పంట అధిక దిగుబడి, కాయల నాణ్యతకు గాను ప్రభుత్వం ఉద్యానవన శాఖ ద్వారా రైతులకు యాభైశాతం రాయితీతో మామిడి కవర్లను అందిస్తోందని ఉద్యానవన అధికారిణి డింపుప్రియశ్రీ తెలిపారు. కవర్లను వాడితే ఊజి పురుగు ఉధృతి నుంచి పంటను కాపాడుకోవచ్చన్నారు. ఈ కవర్లను కోడిగుడ్డు సైజులో కాయలు వచ్చాక ఓసారి వేపనూనె లీటరు నీటిలో కలిపి స్ప్రే చేసిన అనంతరం గట్టిగా కట్టాలన్నారు. తద్వారా కాయలపై మచ్చలు ఏర్పడవన్నారు. పండు ఈగనుంచి కాయలను కాపాడుకోవచ్చన్నారు. కాయలకు మంచి రంగు వస్తుందన్నారు. కవర్లు కట్టిన కాయలకు మార్కెట్లో అధిక ధరలు లభిస్తాయన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## సూర్యఘట్ రూఫ్‌టాప్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే థామస్

గంగాధర నెల్లూరు,13 ఏప్రిల్ ప్రభాతవార్త:



కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన ప్రధాన మంత్రి సూర్య ఘర్ రూఫ్‌టాఫ్ పథకాన్ని సోమవారం గంగాధర నెల్లూరు దళిత వాడలో స్థానిక ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ తామస్ ప్రారంభించాడు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ మాట్లాడుతూ ఈ పథకం కింద కేంద్ర ప్రభుత్వం ఎస్సీ ఎస్టీలకు ఒక్కొక్కరికి రెండు కిలోవాట్లను ఉచితంగా అందిస్తున్నదని దీనిని అందరూ సద్వినియోగం చేసుకొని విద్యుత్ అంతరాయం నుండి బయటపడవచ్చని అన్నారు. అలాగే బిసి ఒసీలకు కూడా రాయిలీ ఇవ్వడమే కాకుండా బ్యాంకుల ద్వారా కూడా రుణాలను ఏర్పాటు చేసుకోవచ్చని వీటిని ఏర్పాటు చేసుకున్న వారు వారు వాడుకొని మిగిలిన విద్యుత్‌ను సంస్థకు అందించి అబ్దితో పాటు విద్యుత్ ఉత్పత్తిదారులుగా కూడా మారవచ్చునని తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖ అధికారులు ఎస్సి అమర బాబు డిఈ సురేష్ కుమార్ ఎడి శేషాద్రి రెడ్డి ఎఈ వరదరాజులు ఎల్ఐ వెంకటేష్ ఎల్ఎం హరినాథ్ నాయకులు కృష్ణమనాయుడు మోహన్ నాయుడు కోదండ రెడ్డి శ్రీధర్ యాదవ్ కృష్ణయ్య రాజేష్ గోపి ప్రకాష్‌లతో పాటు పలువురు విద్యుత్ సిబ్బంది కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఎంపిలను కలసిన కెఇసి వైస్‌ఛైర్మన్ డాక్టర్ సునీల్‌రాజ్

కుప్పం, ఏప్రిల్ 13 ప్రభాతవార్త



కుప్పం ఇంజనీరింగ్ కాలేజ్ వైస్‌ఛైర్మన్ డాక్టర్ సునీల్ రాజ్ ఈశాన్య రాష్ట్రాలైన మేఘాలయ ఎంపి సాలెంగ్ ఎ సంగ్మా, నాగాలాండ్ ఎంపి , పిసి సి అధ్యక్షుడు సుపోం గ్మెరెన్ జమీర్‌లను దేశ రాజధాని న్యూఢిల్లీలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా ఈశాన్య రాష్ట్రాల విద్యార్థులకు ఉన్న విద్యావకాశాల గురించి ఎంపిలతో ఆయన చర్చించారు. ఈసందర్భంగా ఎంపిలు మాట్లాడుతూ విద్యారంగంలో 25 ఏళ్ల ఘనమైన ప్రస్థానాన్ని పూర్తి చేసుకున్నందుకు కుప్పం ఇంజనీరింగ్ కాలేజ్‌ను అభినందించారు. అనంతరం డాక్టర్ సునీల్ రాజ్ ఎంపిలను ఘన ంగా సత్కరించారు.

## కమీషనర్‌చే కుప్పం పార్కు పనుల పరిశీలన

కుప్పం, ఏప్రిల్ 13 ప్రభాతవార్త



కుప్పం పట్టణ నడిబొడ్డున ఉన్న రాజావారి పార్కులో జరుగుతున్న అభివృద్ధి పనులను సోమవారం మున్సిపల్ కమీషనర్ శ్రీనివాసరావు పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ అభివృద్ధి పనుల్లో నాణ్యతలో రాజీ లేకుండా పనులు చేపట్టాలని కాంట్రాక్టు సంస్థ సివికె కన్‌స్ట్రక్షన్స్ వారికి సూచించారు. సుమారు 10కోట్ల వ్యయంతో చేపడుతున్న పార్కు అభివృద్ధి పనుల్లో నలభైశాతం దాకా పనులు పూర్తయ్యాయన్నారు. మిగతా పనులను జూన్ నెలలోపు పూర్తి చేయాలని సిఎం చంద్రబాబునాయుడు కుప్పం పర్యటనలో ప్రారంభించాలని కాంట్రాక్టర్‌కు సూచించారు.

## సప్పానికుంటలో తాగునీటి సమస్య పరిష్కారం

కుప్పం, ఏప్రిల్ 13 ప్రభాతవార్త



మండలంలోని మల్లానూరు పంచాయతీలో సిఎం చంద్రబాబునాయుడు ఆదేశాలతో స్థానిక నేతలు తాగునీటి సమస్యను పరిష్కరించారు. గ్రామంలో బోరు మోటారుకు నూతన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటుచేయించడంతో సమస్య పరిష్కారమై ంది. నూతన ట్రాన్స్‌ఫార్మర్‌ను టిడిపి మండల అధ్యక్షుడు రాజగోపాల్ పూజ చేసి ప్రారంభించారు. కార్యక్రమంలో కడ సభ్యుడు రామచంద్ర, జిల్లా అధికార ప్రతినిధి పిసి సాంబశివం, కార్పోరేషన్ డైరెక్టర్ శరవణ, నేతలు విభూషణ్, ప్రకాష్, రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# నాలుగు టన్నుల రేషన్ బియ్యం స్వాధీనం

## కుప్పం పోలీసుల మెరుపుదాడులు ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు

కుప్పం ఏప్రిల్ 13 ప్రభాతవార్త.




ఆంధ్ర ,తమిళనాడు ప్రాంతాల్లో నుంచి సేకరించిన రేషన్ బియ్యంను అక్రమంగా నిర్వహించిన ఓ ఇంటిపై కుప్పం డి.ఎస్.పి పార్థసారథి మెరుపు దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా సుమారు నాలుగు టన్నుల రేషన్ బియ్యాన్ని సీజ్ చేశారు. అలాగే ఓ టెం పో వాహనాన్ని సైతం స్వాధీనం చేసుకున్నట్లు డిఎస్పీ తెలిపారు. అనంతరం డిఎస్పి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ముందుగా అందిన సమాచారం మేరకు గుడుపల్లి మండలం గుత్తార్ల పల్లి సమీపంలో ఓ ఇంట్లోఅక్రమ రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఆయన తెలిపారు. సీఎం చంద్రబాబు నాయుడు సొంత నియోజకవర్గ కుప్పంలో ఇసుక, బియ్యం ,గ్రానైట్ అక్రమ రవాణాలకు ఎవరైనా పాల్పడితే శాఖా పరమైన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. ఇదివరకే పలుమార్లు ఈ విషయంగా హెచ్చరించడం జరిగిందన్నారు. ఎవరైనా చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. అక్రమ కార్యకలాపాలపై ఎవరైనా తమకు సమాచారం అందిస్తే వారి వివరాలను గోపంగా ఉంచుతామని ఆయన తెలిపారు .కార్యక్రమంలో రూరల్ సీఐ మల్లేష్ యాదవ్, సిబ్బంది పాల్గొన్నారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు పలమనేరు, కుప్పం,

## ప్రమాదాలకు నిజంగా మారిన జాతీయ రహదారి

శాంతిపురం, ఏప్రిల్ 13 ప్రభాతవార్త

మండల కేంద్రమైన శాంతిపురంలోని కుప్పం పలమనేర్ జాతీయ రహదారిలో ప్రతిరోజు ఏదో ఒకచోట ప్రమాదాలు జరుగుతునడంతో ప్రజలు భయాందోళన కు గురవుతున్నారు. ప్రతినిత్యం సాయంత్రం ఐదు నుండి రాత్రి 8 దాకా ఎక్కువ రద్దీగా ఉండడం రోడ్డు దాటాలంటే ప్రాణాలు అరచేత పట్టుకొని దాటవలసిన పరిస్థితి. ప్రతిరోజు గుండి శెట్టిపల్లి నుండి తుమ్మిసిరోడ్డు వరకు ఎక్కడో ఓ చోట రోడ్డు ప్రమాదం జరుగుతూనే ఉన్నాయి. ఈ విషయంపై అధికారులు స్పందించి బారికేడ్లు పెట్టాల ని ప్రజలు కోరుతున్నారు. ఇక శాంతిపురంలో అయితే కేజీఎఫ్ కూడలి వద్ద ఎస్బిఐ బ్యాంక్ సమీపంలో ప్రమాదాలు జరగడం పరిపాటిగా మారిపోయింది. ఎంతోమంది ప్రాణాలు పోగొట్టుకోవడం వారు ,కుటుంబాలు వీధిన పడుతున్నాయని ప్రజలు అంటున్నారు .ఈ విషయంపై సంబంధిత శాఖ అధికారులు, పోలీస్ అధికారులు స్పందించి ప్రజల ప్రాణాలను కాపాడాలని మండల ప్రజలు కోరుతున్నారు.

## చిరు వ్యాపారులకు అండగా నిలుస్తాం

### ప్రభుత్వ విప్ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్

కుప్పం, ఏప్రిల్ 13 ప్రభాతవార్త:



కుప్పం నియోజకవర్గంలో ఉన్న చిరు వ్యాపారులకు సీఎం చంద్రబాబు నాయుడు ఆదేశాలతో అండగా నిలుస్తామని ప్రభుత్వ విప్, కడ పీఏసీ ఛైర్మన్ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్ పేర్కొన్నారు. సోమవారం కుప్పం పట్టణంలో చిరు వ్యాపారులకు ఉచితంగా గొడుగులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఇప్పటికే గుర్తింపు పొందిన సుమారు 220 మంది చిరు వ్యాపారులకు బ్యాంకు రుణాలు పొందేలా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. చిరు వ్యాపారులకు గుర్తింపు కార్డులను సైతం మంజూరు చేసినట్లు తెలిపారు. మున్ముందు చిరు వ్యాపారుల సంక్షేమం కు మరిన్ని కార్యక్రమాలు చేపట్టడంతోపాటు చిరు వ్యాపారులు కూడా ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో ఆర్టిసి వైస్ చైర్మన్ పిఎస్ మునిరత్నం, పికేప యుడా చైర్మన్ డాక్టర్ బి.ఆర్ సురేష్ బాబు ,టిడిపి రాష్ట్ర కార్యదర్శి గోపీనాథ్, చిరు వ్యాపారుల సంఘం అధ్యక్షుడు మంజునాథ్, కడ సభ్యుడు రాజ్ కుమార్ , కౌన్సిలర్ జిమ్ దాము, జనసేన ఇన్‌ఛార్జ్ నరేష్,స్థానిక నేతలు పాల్గొన్నారు .

## బిసీల ఆత్మీయ సదస్సు వాయిదా

చిత్తూరురూరల్, ఏప్రిల్ 13 ప్రభాతవార్త:

ఈనెల 19వ తేది తిరుపతిలో జరపదలచిన బిసి ఆత్మీయ సదస్సు తాత్కాలికంగా వాయిదా వేసినట్లు జాతీయ బిసి సంక్షేమ సంఘ ప్రధాన కార్యదర్శి పి షణ్ముగం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 16,17, 18 తేదిలలో పార్లమెంటు ప్రత్యేక సమావేశం జరుగనున్నందున సమావేశాన్ని తాత్కాలికంగా వాయిదా వేయాలని ఆహ్వాన కమిటీ నిర్ణయించడం జరిగిందన్నారు. తదుపతి తేదిని అందరినీ సంప్రదించి తెలియజేస్తామని ప్రకటనలో తెలిపారు.

## ప్రభుత్వ ఆసుపత్రిలో గుర్తు తెలియని వ్యక్తి మృతి

పలమనేరు, ఏప్రిల్ 13, ప్రభాతవార్త:



పలమనేరు ప్రభుత్వ ఆసుపత్రిలో గుర్తు తెలియని వ్యక్తి (55) మృతి చెందాడు. రెండు రోజుల క్రితం అనారోగ్యంతో మాట్లాడలేని స్థితిలో ఆసుపత్రిలో చేరాడు. చికిత్స పొందుతూ సోమవారం ఉదయం మృతిచెందాడు. ఇతనికి సంబంధించిన వారు ఎవరూ రాక పోవడంతో అనాథ శవంగా పోలీసులు కేసు నమోదు చేశారు. బిస్కెట్ కలర్ గళ్ళ కాటన్ షర్టు, పాచి కలర్ సిల్క్ ప్యాంటు, బ్లాక్ కలర్ లెదర్‌బెల్టు ధరించి వున్నాడు, ఆచూకీ తెలిసిన వారు పలమనేరు అర్బన్ పిఎస్ సిఐ ఫోన్ నెం: 9440796733 లేదా ఎస్ఐ ఫోన్ నెం: 9440796734కు కాల్ చేయాలని కోరుతున్నారు.

## గంగజాతరకు సన్నాహాలు

### అమ్మవారి గుడిలో సంప్రోక్షణ

పలమనేరు, ఏప్రిల్ 13, ప్రభాతవార్త:



పలమనేరులో ప్రతిఏటా అత్యంత వైభవంగా జరిగే గంగజాతరకు సన్నాహాలు మొదలయ్యాయి. ఈ నెల 30 న గంగచాటు, మే14.15,16 తేదీల్లో గంగజాతర ఉంటుంది. జిల్లాలో ఎక్కడా లేని విధంగా పలమనేరులో గంగచాటు తర్వాత 15 రోజులకు జాతర ఉంటుంది. చాటు అనంతరం ప్రతిరోజూ అమ్మవారికి పొంగళ్ళు నైవేద్యాలు ఉంటాయి. పొట్టేళ్ళు మేకపోతులు, కోళ్ళు బలి ఇచ్చి మొక్కుబడులు తీర్చుకుంటారు. రాత్రిళ్ళలో వీధి నాటకాలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తారు. ఇందులో భాగంగా సోమవారం గంగమ్మగుడి సంప్రోక్షణ కార్యక్రమం చేపట్టారు. ఛైర్మన్ శ్రీధర్ ఆధ్వర్యంలో గంగమ్మగుడితో పాటు అమ్మవారి మూల విగ్రహం నీటితో శుద్ధి చేసి పూజలు నిర్వహించారు. ఈ నెల 26న గంగమ్మగుడిలో రాజకీయాలకు అతీతంగా గుడి పాలకవర్గం సమావేశం ఉంటుందని, గంగజాతర నిర్వహణ పై చర్చిస్తామని ఛైర్మన్ తెలిపారు.

## న్యాయవాదులకు రక్షణ చట్టం అవసరం

### రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యుడు విఆర్ రెడ్డి

పలమనేరు, ఏప్రిల్ 13 ప్రభాతవార్త:



న్యాయవాదులకు రక్షణ చట్టం అవసరమని రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యుడు విఆర్ రెడ్డి అన్నారు. సోమవారం పలమనేరు బార్ అసోసియేషన్‌కు విచ్చేసిన ఆయనను స్థానిక బార్ అసోసి యేషన్ సభ్యులు ఘనంగా సన్మానించారు. ఇటీవల జరిగిన రాష్ట్ర బార్ కౌన్సిల్ ఎన్నికల్లో ఆయన రెండో సారి సభ్యుడుగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండో సారి న్యాయవాదులకు సేవ చేసే అవకాశం రావడం సంతోషదాయకమన్నారు. న్యాయవాదుల సమస్యలపై రాజీ లేని పోరాటం చేస్తానని ఇళ్ళ పట్టాలు, ఇన్సూరెన్స్, వెల్‌ఫేర్ ఫండ్, రిటైర్‌మెంట్ బెన్‌ఫిట్, తదితర అంశాల పరిష్కారం, అడ్వకేట్ ప్రొటక్షన్‌యాక్ట్ తీసుకు రావడానికి తనవంతు కృషి చేస్తానని తెలిపారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఇర్షాద్ ఆలీఖాన్, మాజీ అధ్యక్షుడు ఎల్ భాస్కర్, ఉపాధ్యక్షుడు కృష్ణమూర్తి, కోశాధికారి మునిరాజులు, మాజీ ఉపాధ్యక్షుడు షేక్ షరీఫ్. చంద్రశేఖర్, సీనియర్ న్యాయవాదులు పరమశివప్ప, లక్ష్మీపతి, మోహన్‌రెడ్డి, రాజారెడ్డి, లక్ష్మణ్‌రెడ్డి, కృష్ణప్ప, అరీఫుల్లా ఖాన్, నారాయణరెడ్డి, ఇబ్రహీం, రంజిత్‌కుమార్, మహేశ్వరి, మాధవి తదితరులు పాల్గొన్నారు.

## సిఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత

శాంతిపురం, ఏప్రిల్ 13 ప్రభాతవార్త



మండలంలోని బండతిప్పన పల్లికి చెందిన చంద్రశేఖర్ అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఇతని వైద్య ఖర్చుల నిమిత్_ం ముఖ్యమంత్రి సహాయ నిధి కింద మంజూరైన 86వేల చెక్కును నాయకులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నేతలు మణి, కుమార్, జయరాజ్, ఎంఆర్ నారాయణ, మురళి, కలీం తదితరులు పాల్గొన్నారు.

# వెల్లువెత్తుతున్న ప్రజా ఫిర్యాదులు

## -పరిష్కార వేదికకు 42 వినతులు

తిరుపతి,ఏప్రిల్ 13ప్రభాతవార్త:



తిరుపతినగరంలో అనేక డివిజన్లలోసమస్యలపై ప్రజలు ఫిర్యాదులు చేస్తున్నారు. ప్రతివారం సోమవారం నగరపాలకసంస్థలో పిజిఆర్ఎస్‌కు భారీగా ఫిర్యాదులు వస్తున్నాయి. సోమవారం ఉదయం నగరపాలక సంస్థ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు 42 వినతులు వచ్చాయని కమిషనర్ ఎన్. మౌర్య తెలిపారు. డయల్ యువర్ కమిషనర్, ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 24 మంది కార్యాలయంకు నేరుగా వచ్చి వినతులు సమర్పించగా, 18 మంది ఫోన్ ద్వారా తమ సమస్యలు తెలిపారు. ఇందిరా మైదానం వద్ద టెంకాయల వ్యాపారం చేస్తూ వ్యర్థాలు అక్కడే వేయడంతో దుర్వాసన వస్తోందని, టిడిఆర్ బాండ్లు ఇప్పించాలని, గాజువీధిలోని మా ఇంటి గోడను పగలగొట్టి నిర్మాణాలు చేస్తున్నారు పరిష్కరించాలని, లక్ష్మీ పురం వద్ద విద్యుత్ తీగలమీద చెట్టు కొమ్మలు పడి ప్రమాదకరంగా ఉంది పరిస్కరించాలని, అక్కారం పల్లి వద్ద పారిశుద్ధం మెరుగ్గా చేపట్టాలని, లక్ష్మీ పురం కూడలి అన్నపూర్ణ హోటల్ వద్ద ట్రాఫిక్ ఇబ్బందులు పరిష్కరించాలని, హీరోహోండా షోరూం వద్ద రోడ్డు బాగుచేయాలని, శ్రీదేవి కాంప్లెక్స్ వద్ద చెట్లు ఎక్కువగా ఉండడంతో దోమలు ఎక్కువగా ఉన్నాయి పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ శారదా దేవి, డిప్యూటీ కమిషనర్ అమరయ్య, మునిసిపల్ ఇంజినీర్లు తులసి కుమార్, గోమతి, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, రెవిన్యూ అధికారులు సేతుమాదవ్, రవి, ఉద్యానవన శాఖాధికారి హరికృష్ణ, వెటర్నరీ ఆఫీసర్ గుణశేఖర్, డి.ఈ.లు, ఏసీపీ లు, శానిటరీ సూపర్ వైజర్లు, తదితరులు ఉన్నారు.

## మద్యం సేవించి వాహనం నడిపినందుకు జైలు

రేణిగుంట, ఏప్రిల్ 13 ప్రభాతవార్త

మద్యం సేవించి వాహనం నడిపినందుకు మునేంద్ర కు న్యాయమూర్తి 14 రోజుల సాధారణ జైలు శిక్ష పదివేల రూపాయల జరిమానా విధిస్తూ సంచలన తీర్పునిచ్చినట్లు గాజులమండ్యం పోలీసులు తెలిపారు.గాజులమండ్యం పోలీసుల కథనం మేరకు ఎన్నారై విద్యాసంస్థల వాహనం నడుపుతున్న మునేంద్ర (25)ను పోలీసులు బ్రీత్ అనలైజర్ పరికరంతో పరీక్షలు నిర్వహించగా మద్యం సేవించి వాహనం నడుపుతున్నట్టు నిర్ధారించారు. సోమవారం న్యాయమూర్తి మునేంద్ర కు 14 రోజుల సాధారణ జైలు శిక్ష పదివేల రూపాయల జరిమానా విధించినట్లు పోలీసులు తెలిపారు.

## కేఎల్ఎం సర్కిల్ వద్ద అవగాహన కల్పిస్తున్న హరీష

రేణిగుంట, ఏప్రిల్ 13 ప్రభాతవార్త



తిరుపతి జిల్లా ఎస్పీ సుబ్బ రాయుడు ఆదేశాల మేరకు రూరల్ సీఐ మంజునాథరెడ్డి సూ చనలతో గాజులమండ్యం ఎస్సై హరీష తమ సిబ్బందితో కేఎల్ ఎం సర్కిల్ వద్ద ప్రజలతో మమే కమై సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. అనవసరమైన ఫోన్ కాల్స్ కు ఎట్టి పరిస్థితిలో రెస్పాండ్ కావద్దన్నారు. ఎవరైనా ఓటిపి అడిగితే ఇవ్వకూడదని చెప్పారు. వాట్సాప్ లో లింకులను క్లిక్ చేయొద్దని తెలిపారు. కొంతమంది బ్యాంక్ సిబ్బంది అడిగినట్లు మొబైల్ ద్వారా ఆధార్ నంబర్, ఏటీఎం పిన్ నెంబర్ అడుగుతారని బ్యాంక్ అధికారులు అలాంటివి అడగరని ఎట్టి పరిస్థితిలో నంబర్లు ఇవ్వద్దని తెలిపారు.

## ఇన్చార్జి తహసీల్దార్‌గా శ్యాం ప్రసాద్



రేణిగుంట, ఏప్రిల్ 13 ప్రభాతవార్త

రేణిగుంట మండల ఇన్చార్జి తహసీల్దారుగా శ్యాం ప్రసాద్ సోమవారం మధ్యాహ్నం పదవి బాధ్యతలు చేపట్టారు. ఇంతవరకు తహసిల్దార్ గా విధులు నిర్వహించిన చంద్రశేఖర్ రెడ్డి కలెక్టర్ ఆఫీస్ కు బదిలీపై వెళ్లారు. ఆయన స్థానంలో రేణిగుంట తహసిల్దార్ కార్యాలయం నందు డిప్యూటీ తాసిల్దారుగా బాధ్యతలు నిర్వహిస్తున్న శ్యాంప్రసాద్ ఇంచార్జ్ తహసీల్దారుగా అదనపు బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన ప్రభాతవార్త ప్రతినిధితో మాట్లాడుతూ ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ వారి సమస్యలను పరిష్కరిస్తామన్నారు.

## అంబేద్కర్ బహుజన నాయకుడు.... తేజోవతి...

రేణిగుంట, ఏప్రిల్ 13 ప్రభాతవార్త



భారత రాజ్యాంగ నిర్మాత బి.ఆర్ అంబేద్కర్ బహుజన నాయకుడని రాష్ట్ర బీసీ సంక్షేమ డైరెక్టర్ తేజోవతి అన్నారు. రేణిగుంట మండలం ఎస్ఎన్ పురం అంబేద్కర్ విగ్రహం వద్ద సోమవారం సాయంత్రం ఆమె పలు మహిళా సంఘాల నేతలతో కలిసి స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని ముందస్తు అంబేద్కర్ జయంతి సందర్భంగా నిర్వహించారు. ఆ ప్రాంతాన్ని శుభ్రపరచి అంబేద్కర్ విగ్రహం చుట్టూ దీపాలు వెలిగించి తమ అభిమానాన్ని చాటుకుంటూ అంబేద్కర్ కు ఘనంగా నివాళులు అర్పించారు. అందరూ అంబేద్కర్ ను మార్గదర్శకంగా తీసుకొని ఆయన మార్గంలో పయనిస్తే దేశం శాంతి మయంగా మారుతుందని అన్నారు. కార్యక్రమంలో మండల ఓబీసీ నాయకులు, జయమ్మ, సుమతి, భారతి జ్యోతి, సెల్వి, ఉమా, రాజకుమార్, వాణి, తంగమ్మ, చంబర్తి, మోనిక, సుమ తదితరులు పాల్గొన్నారు.

## హామీలు గాలిలో.. పుస్తకాలు ఆలస్యంగా!

### 15 రోజులు విద్యార్థుల భవిష్యత్తుతో ఆటలాడిన ప్రభుత్వం



తిరుపతి విద్య ఏప్రిల్ 13 ప్రభాత వార్త

జిల్లా వ్యాప్తంగా ఇంటర్మీడియట్ తరగతులు ప్రారంభమై రెండు వారాలు గడిచినా పాఠ్యపుస్తకాలు అందించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైంది. మొదటి రోజే డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ కిట్ పేరుతో పుస్తకాలు అందిస్తామని గొప్పగా ప్రకటించిన అధికార యంత్రాంగం అమలులో మాత్రం పూర్తిగా చేతులెత్తేసింది.పుస్తకాలు లేకుండా విద్యార్థులు 15 రోజుల పాటు ఖాళీ చేతులతో తరగతులకు హాజరవుతూ కాలక్షేపం చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. చదువుకి కీలకమైన ఈ ప్రారంభ దశలోనే నిరక్ష ్యల్ల చూపడంతో విద్యార్థుల విద్యాభ్యాసం తీవ్రంగా దెబ్బతిన్నట్లు తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.విద్యార్థులు, తల్లిదండ్రుల నుంచి తీవ్ర విమర్శలు వెల్లువెత్తిన తరువాతే ప్రభుత్వం కదిలింది. అప్పటికీ ముందస్తు ప్రణాళిక లేకుండా చివరి నిమిషంలో పుస్తకాలను జిల్లాకు తరలించడం జరిగింది. బోర్డ్ ఆఫ్ ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ సహకారంతో పుస్తకాలు ఆర్ఐఓ కార్యాలయానికి చేరగా, ఇప్పుడు వాటిని జూనియర్ కళాశాలలకు పంపిణీ చేసే ప్రక్రియ ప్రారంభమైంది.బుధవారం నుంచి ఇంటర్ సెకండ్ ఇయర్ విద్యార్థులకు పుస్తకాలు అందుతాయని చెబుతున్నప్పటికీ, ఈ ఆలస్యానికి బాధ్యత ఎవరు తీసుకుంటారన్న ప్రశ్న మిగిలే ఉంది.ప్రకటనలు వేగంగా.. అమలు నత్తనడక! అన్న విమర్శలు ఇప్పుడు విద్యాశాఖపై గట్టిగా వినిపిస్తున్నాయి.ప్రారంభ దశలోనే పుస్తకాలు అందించి ఉండి ఉంటే విద్యార్థుల చదువుకు ఉపయోగపడేదని, ఇప్పుడు వచ్చిన పుస్తకాలు కేవలం ఆలస్యమైన పరిహారమేనని విద్యావేత్తలు అభిప్రాయపడుతున్నారు.

## అంబేద్కర్ సర్కిల్ వద్ద రక్తదాన శిబిరం

చిట్వేలి, ఏప్రిల్ 13 ప్రభాతవార్త: రాజ్యాంగ రూపకర్త డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ 135వ జయంతి సందర్భంగా అంబేద్కర్ సర్కిల్ వద్ద నేడు ఉదయం 8:00 గంటల నుంచి మధ్యాహ్నం 2;00 గంటల వరకు రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు కార్యక్రమ నిర్వాహకులు, సి హెచ్ ఎస్ బాధ్యుడు గాడి ఇంతియాజ్ తెలిపారు. ఈ రక్తదాన శిబిరాన్ని తలసేమియా బాధితుల సహాయార్థం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. యువత, ఔత్సాహకులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వారు కోరారు.

## పోషకాహార లోపం లేని భారత్ నిర్మాణమే ప్రధాన లక్ష్యం

కేవీబీ పురం,ఏప్రిల్ 13 ప్రభాతవార్త:




ఐసీడీఎస్ సీడీపీవో సౌభాగ్యమ్మ ఆదేశాల మేరకు కేవీబీ పురం మండల సూపర్‌వైజర్లు కె.రాజేశ్వరి, బి.కల్పలత ఆధ్వర్యంలో సోమవారం మండల కేంద్రం ఆదర్శ పాఠశాల కేవీబీపురం అంగన్‌వాడీకేంద్రంలో 8వ పోషణ్ పక్వాడ కార్యక్రమం నిర్వహించారు. పోషకాహార లోపం లేని భారత్ నిర్మాణమే ప్రధాన లక్ష్యమని పోషణ పక్వాడ కార్యక్రమం సందర్భంగా అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు మునస్వామి యాదవ్, ఎంపీడీవో మాలతి, తహసీల్దార్ తనూజ, ఎంఈవో రవికుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బలవర్ధకరమైన పోషకాహారం తీసుకోవడం ద్వారా ఆరోగ్యాన్ని మెరుగు పరచుకోవచ్చని పేర్కొన్నారు. ప్రజల్లో పోషకాహార అలవాట్లను పెంపొందించేందుకు ప్రభుత్వం పోషణ పక్వాడ కార్యక్రమాన్ని చేపట్టిందని సూచించారు. పిల్లల ఉజ్వల భవిష్యత్ కోసం తాతయ్య, నానమ్మ, అమ్మమ్మతో సమయం గడపనివ్వండని సంప్రదాయాలను తరాలకు అందించండని తెలియజేస్తూ ఆటలద్వారా స్క్రీన్ టైమ్‌ను తగ్గించగలమని ఇంటి లోపల ఆడే ఆటలు, ఆలోచన శక్తిని, శారీరక ఆరోగ్యం నైపుణ్యాలను మెరుగుపరుస్తాయని సూచించారు. వారి శ్రేయస్సు కోసం ఇప్పుడే చర్యలు తీసుకోవాలని తెలియజేశారు. జంక్ ఫుడ్ తీసుకోవడం వల్ల పిల్లలు అనారోగ్యానికి గురి అవుతారని, క్యాన్సర్, ఒబెసిటీ, గుండె జబ్బులు సంక్రమిస్తాయని తెలియజేశారు. ఇంటి వద్దే తయారు చేసిన ఆహారం తీసుకోవాలని, చక్కెర, ఉప్పు, నూనె వాడకం తగ్గించాలని తెలియజేశారు. అనంతరం పోషణ పక్వాడ గోడ పత్రికలను ఆవిష్కరించి ఈ కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వ అధికారులు, అంగన్‌వాడీ టీచర్లు, ఇతరులు పాల్గొన్నారు.

## రాగిగుంట పాఠశాల వార్షికోత్సవం

కేవీబీ పురం, ఏప్రిల్ 13 ప్రభాతవార్త:



మండలంలోని రాగిగుంట మోడల్ ప్రైమరీ స్కూలులో సోమవారం 2025-26 విద్యా సంవత్సరానికి గాను మండల విద్యాశాఖ అధికారి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో లక్ష్మిపతి మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధిలో ఉపాధ్యాయులతో పాటు గ్రామ పెద్దలు, తల్లిదండ్రులు సహకారం కూడా అవసరమని సూచించారు.ఎంఈవో రవికుమార్ విద్యార్థుల ప్రగతిని పరిశీలించి వారి అభివృద్ధిని ప్రశంసిస్తూ విద్యార్థుల అభివృద్ధిలో తల్లిదండ్రుల యొక్క పాత్రను వివరించారు. అదే విధంగా పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు నేతాజీ పాఠశాల వార్షిక నివేదికను సమర్పించారు. రాగిగుంట ఉపాధ్యాయురాలు శాంతి విద్యాభివృద్ధితో పాటు సహ పాఠ్య కార్యక్రమాల్లో కూడా విద్యార్థులు బాగున్నారని ప్రశంసించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ వసంతమ్మ, గ్రామ సర్పంచ్ గౌతమి, ఉపాధ్యాయులు మీన గురునాథం, ఎస్వీఎస్ఎస్ నారాయణ, వెంకటరమణ, మహేష్, సీఆర్పీ దేవసేన, పాఠశాల యాజమాన్య కమిటీ వైస్ చైర్మన్ తస్లిమా, కమిటీ సభ్యులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## భూముల రీ సర్వేపై గ్రామసభలు

కేవీబీ పురం, ఏప్రిల్ 13 ప్రభాతవార్త:



మండలంలోని రాగిగుంట సదాశివపురం, పాతపాళెం, ఎగువ పుత్తూరు, రంగయ్యగుంట గ్రామాల్లో 5వ ఫేస్ కింద సోమవారం రెవెన్యూ అధికారులచే రీ సర్వే గ్రామసభలు నిర్వహించారు. ఈ సందర్భంగా రాగిగుంటలో డిప్యూటీ తహసీల్దార్ ఎగువపుత్తూరులో డిప్యూటీ తహసీల్దార్ వసంత్‌రాజు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు, వీఆర్వోలు మునిభాస్కర్‌లు కలసి రైతులతో గ్రామసభలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సర్వే జరిగేటప్పుడు రైతులు వారి భూముల హక్కు పత్రాలను వారి వద్ద ఉన్న కాగితాలను తీసుకొచ్చి వారి యొక్క భూములను పక్కాగా రెవెన్యూ రికార్డుల్లో రికార్డులు నమోదు కావాలంటే రీ సర్వే గ్రామసభలు జరుగుతాయనిసభలకు రైతులందరూ కూడాజరిగే సిబ్బందికి కచ్చితత్వమైన రికార్డు చూపించి వారి యొక్క భూములను రికార్డుల ద్వారా భద్రపరచుకోవాలని వారు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో తహసీల్దార్ వసంతరాజు, ఆర్ఐ శ్రీనివాసులు, మునిభాస్కర్, రఘు, ఉష తదితరులు పాల్గొన్నారు.

## బాటసారుల దాహార్తి తీర్చడమే ముఖ్య ఉద్దేశం



రేణిగుంట, ఏప్రిల్ 13 ప్రభాతవార్త

బాటసారుల దాహార్తి తీర్చడం కోసం శ్రీకాళహస్తి నియోజకవర్గం ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి ఆదేశాల మేరకు జి పాలెం పంచాయితీలోని పలు ప్రాంతాల్లో సోమవారం మండలంలోనే ప్రప్రథమంగా జిపాలెం టిడిపి ఇన్చార్జి, టిడిపి సీనియర్ నాయకులు రాజశేఖర్ రెడ్డి చలివేంద్రాలను ప్రారంభించారు. ప్రారంభోత్సవం కార్యక్రమంలో అందరికీ చల్లని మజ్జిగ పంపిణీ చేశారు. పంచాయతీలోని జి పాలెం క్రాస్ వద్ద, జి పాలెం బస్టాండ్ వద్ద, పద్మా నగర్ క్రాస్ వద్ద, విమానాశ్రయం వెళ్లే మార్గం వద్ద చలివేంద్రాలు ప్రారంభం అయ్యాయి. కార్యక్రమంలో జి పాలెం కార్యదర్శి సుబ్బారెడ్డి, స్థానిక నేతలు బాబు, మధు, మణి, కరిముల్లా, గజేంద్ర రాజు, పాస్టర్ ముత్తయ్య, మంజుల, జిల్లా ఎస్సీ మహిళ అధ్యక్షురాలు అరుణ, గ్రామస్తులు పాల్గొన్నారు..

# వైద్యుల నిరక్ష్యం..ప్రాణాలతో చెలగాటం!

### న్యాయం చేయాలని కోరుతూ బాధితుడు కలెక్టర్, డిఎంహెచ్ఓకు ఫిర్యాదు

తిరుపతి కలెక్టరేట్ ఏప్రిల్ 13 ప్రభాతవార్త



: తిరుపతి ఎంఆర్ పల్లి పోలీస్ స్టేషన్ సమీపంలోని హరిప్రియ హాస్పిటల్ వైద్యుల నిరక్ష ్యం... బాధితుడు ఆర్ బి ఎస్ రాము ప్రాణాలతో చెలగాడాటంతో పాటు అతనికి జరిగిన అన్యాయం పై సోమవారం జిల్లా కలెక్టరేట్లో జరిగే ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్)లో తిరుపతి జిల్లా కలెక్టర్, డి ఎం హెచ్ ఓ కు ఫిర్యాదు చేశారు. దీనిపై వెంటనే డిఎంహెచ్ఓ స్పందించారు. జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్ ఆదేశాల మేరకు హాస్పిటల్ పై రెండు కమిటీలు వేయనున్నట్లు వెల్లడించారు. అనంతరం బాధితుడు రాము మాట్లాడుతూ తాను మంగళంలో కాపురం ఉంటున్నామని అన్నారు. కడుపు నొప్పి కారణంతో తిరుపతి ఎం ఆర్ పల్లి పోలీస్ స్టేషన్ సమీపంలోని హరిప్రియ హాస్పిటల్లో ఏప్రిల్ 28 2025న చేరడం జరిగిందన్నారు. అన్ని పరీక్షలు నిర్వహించి పిత్తాశయంలో రాయి ఉందని చెప్పి సర్జరీ చేసి జూన్ 18 2025 అన్న డిశ్చార్జ్ చేశారు. ఆపరేషన్ చేసిన తిరిగి యధా ప్రకారం జ్వరం కడుపునొప్పి వాంతులు దురద రావడంతో తిరిగి హరిప్రియ హాస్పిటల్ ఎండి డాక్టర్ ఆదిత్యాను కలవడం జరిగిందన్నారు. మళ్లీ పరీక్షలు నిర్వహించి పిత్తాశయం దగ్గర చీము ఉందని చెప్పారు. కానీ నిజానికి ఆపరేషన్ సమయంలో కామన్ డాక్ట్ కి గాయం కావడంతో టైప్ ఎ బైల్ లీక్ అయింది. ఈ విషయాన్ని దాచిపెట్టి ఆసుపత్రి యాజమాన్యం డాక్టర్ల బృందం మోసం చేయడంతో పాటు నా ప్రాణాలతో చెలగాటం ఆడారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పుడు నా ఆరోగ్య పరిస్థితి దయనీయంగా మారింది. హరిప్రియ హాస్పిటల్ యాజమాన్యం వైద్యుల నిరక్ష ్యల్ల వల్ల దాదాపు 17 లక్షల రూపాయలు ఖర్చు అయింది. అంతేకాకుండా నా ప్రాణానికి ప్రమాదం వచ్చి పడింది. అంతేకాకుండా ఉద్యోగం కూడా పోయింది. కావున నా మీద దయ ఉంచి కలెక్టర్ గారు, డి ఎం హెచ్ ఓ వెంటనే స్పందించి హాస్పిటల్ యాజమాన్యం, నిరక్ష ్యంపై తగు చర్యలు తీసుకొని నాకు జరిగిన ఆర్థిక నష్టంతో పాటు, నా ప్రాణాలతో చెలగాట మాడిన హరిప్రియ హాస్పిటల్ యాజమాన్యం వైద్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో బాధితుడు ఆర్ బి ఎస్ రాముతో పాటు బాధితుడు భార్య జయశ్రీ, అసోసియేషన్ ఫోర్ పీపుల్స్ హ్యూమన్ రైట్స్ కన్వెన్షన్ (ఏ పి హెచ్ ఆర్ సి) చైర్మన్ ఎన్ చంద్రకళ , మహిళా నాయకురాలు లక్ష్మి దేవి పాల్గొన్నారు.

# తిరుపతి డివిజన్

## ప్రతి ఫిర్యాదుదారుడికి ఊరట!

### స్వయంగా సమస్యలు విని స్పందించిన ఎస్పీ

తిరుపతి, ఏప్రిల్ 13 ప్రభాతవార్త:



జిల్లా వ్యాప్తంగా వచ్చిన ఫిర్యాదుదారుల నుండి వినతులను స్వయంగా స్వీకరించి, వారి సమస్యలను విని సానుకూలంగా స్పందించిన తిరుపతి జిల్లా ఎస్పీ లంకెల సుబ్బరాయుడు. తన కార్యాలయంకు వచ్చిన ప్రతి ఫిర్యాదుదారునితో సోమవారం ఉదయం నుండి మధ్యాహ్నం వరకు వ్యక్తిగతంగా మాట్లాడి, వారి సమస్యలను శ్రద్ధగా విని, సానుకూలంగా స్పందించారు.సోమవారం జరిగిన పి.జి.ఆర్.ఎస్ కార్యక్రమంలో ఫిర్యాదుదారుల నుండి ఎస్పీ వినతులు స్వీకరించారు. సమస్యలపై వెంటనే స్పందిస్తూ సంబంధిత అధికారులకు ఆదేశాలిచ్చారు. సుమారు 76 మంది ఫిర్యాదుదారులు హాజరై తమతమ సమస్యలపై వినతులు అందించారు. ఫిర్యాదుదారులకు సత్వరన్యాయం కలిగించాలని అధికారులకు ఆదేశాలిచ్చారు. ప్రతి సమస్యకు పరిష్కారం చూపే దిశగా అవసరమైన మార్గదర్శకాలు అందించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీలు వెంకట్రావు, శ్రీనివాస్ ,డిఎస్పీలు పాల్గొన్నారు.

## తారకరామా స్టేడియం పరిసరాలు పరిశుభ్రంగా ఉంచండి

### -కమిషనర్ మౌర్య

తిరుపతి,ఏప్రిల్ 13ప్రభాతవార్త:



నగరపాలక సంస్థ పరిధిలోని గొల్లవాణిగుంట లోని క్రికెట్ స్టేడియం పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని కమిషనర్ ఎన్.మౌర్య అధికారులను ఆదేశించారు. గొల్లవాణిగుంటలో ఏర్పాటు చేసిన క్రికెట్ స్టేడియం, పరిసరాలను సోమవారం మధ్యాహ్నం ఇంజినీరింగ్, ఆరోగ్య శాఖ విభాగాల అధికారులతో కలిసి కమిషనర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్టేడియం పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని తెలిపారు. క్రికెట్ స్టేడియం ఎదురుగా ఉన్న రోడ్డు డివైడర్ల మధ్యలో మొక్కలు ఏర్పాటు చేసి అందంగా ఏర్పాటు చేయాలని తెలిపారు. కమిషనర్ వెంట మునిసిపల్ ఇంజనీర్ తులసి కుమార్, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, డి.ఈ.రమణ, హార్టికల్చర్ ఆఫీసర్ హరికృష్ణ,శానిటరీ సూపర్ వైజర్ సుమతి, తదితరులు ఉన్నారు.

## బిజెపిచే బిందేశ్వరి ప్రసాద్ మండల్ వర్ధంతి



తిరుపతి,ఏప్రిల్ 13ప్రభాతవార్త:

బిందేశ్వరి ప్రసాద్ మండల్ వర్ధంతి ని సోమవారం తిరుపతిలో ఘనంగా నిర్వహించారు.స్థానిక డి బి ఆర్ రోడ్ లోని ఆయన విగ్రహానికి బిజెపి నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా బిజెపి సీనియర్ నాయకులు కట్టమంచి చంద్రబాబు యాదవ్ గుండాల గోపినాథ్ రెడ్డి లు మాట్లాడుతూ మాజీ పార్లమెంటు సభ్యుడు, సంఘ సంస్కర్త వెనుక బడిన తరగతుల కమీషన్ కు చైర్మన్ గా వ్యవరించి పేద ప్రజల జీవితాల్లో వెలుగుల నింపిన గొప్ప వ్యక్తి బిపి మండల్ అని కొనియాడారు భారతీయ రాజకీయాల్లో తక్కువగా ఉన్న, బలహీన వర్గాల కోసం పాలసీపై తీవ్రమైన చర్చ ప్రారంభమైందన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర బిజెపి ఓబీసీ మోర్చా మాజీ ఉపాధ్యక్షుడు కట్టమంచి చంద్రబాబు యాదవ్, సుబ్రహ్మణ్యం యాదవ్, బిజెపి రాష్ట్ర మాజీ కార్యవర్గ సభ్యుడు గుండాల గోపినాథ్‌రెడ్డి, బిజెపి నాయకులు లోక ప్రభాకర్ నాయుడు, అక్కిపల్లి ఈశ్వర్ యాదవ్ ,, తొండమునాటి సుబ్రహ్మణ్యం రెడ్డి ,సుబ్బు యాదవ్ ,రామ్కుమార్, మెట్టపల్లి బ్రహ్మానందం,పొన్నాల జేజిరెడ్డి, బీసీ సంఘర్షణ సమితి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధి పనులకు నిధులు మంజూరు - ఎమ్మెల్యే

వడమాలపేట, ఏప్రిల్ 13 ప్రభాతవార్త:

వడమాలపేట మండలంలోని పలు గ్రామాల్లో వివిధ అభివృద్ధి పనులకు 13.01 లక్షల రూపాయలు మంజూరు చేయించినట్లు నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ తెలిపారు. ప్రజల ద్వారా సమస్యలు తెలుసు కున్న ఎమ్మెల్యే జడ్పీ నుంచి నిధులు మంజూరు చేయించారు. మండలంలో బాలినాయుడు కండ్రిగ పంచాయతీ భవనం వద్ద టాయిలెట్ నిర్మాణం కోసం 3.20 లక్షల రూపాయలు, పచ్చికాల్వ గ్రామంలో పైపు కల్వర్టు నిర్మాణానికి రెండు లక్షల రూపాయలు, వడమాలపేట ఆది ఆంధ్రవాడలో ఆర్వో ప్లాంటు నిర్మాణానికి 2.81 లక్షల రూపాయలు, పాదిరేడు ఆది ఆంధ్రవాడలో తాగునీటి పైపులైన్ నిర్మాణానికి ఐదు లక్షల రూపాయలు మంజూరైంది. త్వరలో నిర్మాణ పనులు చేపట్టనున్నారు. సమస్యలపై స్పందించి నిధులు మంజూరు చేయించిన ఎమ్మెల్యేకు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలుపుతున్నారు.

## మహిళకు 33 శాతం రిజర్వేషన్

### స్త్రీ శక్తి కార్యక్రమంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ శామ్యూల్

సత్యవేడు, ఏప్రిల్ 13 ప్రభాతవార్త:



నిర్ణయాధికారంలో మహిళల భాగస్వామ్యాన్ని పెంపొందించడానికి మహిళా రిజర్వేషన్ ప్రవేశపెట్టడం సత్యవేడు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ శామ్యూల్ అరవింద్ తెలిపారు. సోమవారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మహిళా సాధికారత, ఎన్ఎస్ఎస్ విభాగం హోన్న, ఓ హరి ప్రసాద్ ఆధ్వర్యంలో స్త్రీ శక్తి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ శామ్యూల్ అరవింద్ మాట్లాడుతూ మహిళా రిజర్వేషన్ బిల్లు లోక్ సభ, రాష్ట్ర అసెంబ్లీలలో మహిళలకు 33 శాతం(మూడింట ఒక వంతు) సీట్లను రిజర్వు చేసే చారిత్రాత్మక చట్టమన్నారు. 15 ఏళ్ళ పాటు అమరలో ఉండే ఈ బిల్లులో ఎస్సీ, ఎస్టీ మహిళలకు కూడా రిజర్వేషన్ వర్తిస్తుందన్నారు. మహిళలకు రిజర్వు చేయబడిన సీట్లు ప్రతి డీలిమిటేషన్ తరువాత రొటేషన్(మార్పు) చేయబడతాయన్నారు. ఈ బిల్లు వల్ల 2029 నాటికి పార్లమెంట్, అసెంబ్లీలో మహిళా ప్రజాప్రతినిధుల సంఖ్య గణనీయంగా పెరిగే అవకాశం ఉన్నట్టు ఆయన వివరించారు. అనంతరం మహిళా రిజర్వేషన్‌క్ మద్దతుగా తీర్మానం చేసి మహిళా సాధికారత ప్రతిభింబించే పాటను విద్యార్థులు పాడారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు రవిశంకర్, వెంకటేశ్వరులు, ఎం.హరిప్రసాద్, మురళీమోహన్, సుధాకర్, ఈశ్వరయ్య, విద్యార్థులు పాల్గొన్నారు.

## స్వాహా చేసిన డ్వాక్రా సంఘాల నిధులను రికవరీ చేయాలి

### - డ్వాక్రా సంఘాలు డిమాండ్

కేవీబీ పురం, ఏప్రిల్ 13 ప్రభాతవార్త:

మండలంలోని వగత్తూరు పంచాయతీ పరిధిలోని డ్వాక్రా సంఘాల నిధులను 40 లక్షలు స్వాహా చేసిన వెలుగు సిబ్బందిని విచారణ జరిపి రికవరీ చేసి బాధ్యులను విధుల నుంచి తొలగించి, క్రిమినల్ కేసులు పెట్టాలని సీపీఎం కార్యదర్శి దాసరి జనార్ధన్, ప్రాంతీయ కార్యదర్శి నాగలాపురం నాగరాజులు డిమాండ్ చేశారు. సోమవారం కేవీబీ పురం మండల అభివృద్ధి కార్యాలయం ఎదుట వగత్తూరు పరిధిలోని డ్వాక్రా మహిళలతో కలసి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2023వ సంవత్సరం నుంచి 10 ఎస్‌హెచ్‌జీలలో బ్యాంకు లింకేజీ రుణాలు, పొదుపు అంతర్గతఅప్పులను ప్రతినెల సభ్యులు వసూలు చేసి బ్యాంకులకు చెల్లించే క్రమంలో సంఘమిత్ర జోక్యం చేసుకుని బ్యాంకులో సిబ్బందినితప్పుదోవ పట్టించి తన ఖాతాకు వేసుకోవడం, తన బంధువుల ఖాతాకు వేసుకోవడం, బ్యాంకు కరస్పాండెంట్ విధులు నిర్వహిస్తున్న సిబ్బంది చేతివాటంతో సంఘమిత్ర మునెమ్మ 40 లక్షలకు పైగాస్వాహా చేసినట్లు పేర్కొన్నారు. సీసీ చంద్రకళ రూ.3,70,000 మరొక్క బదిలీ అయిన సీసఈ వీర జిన్నా 6 లక్షలు స్వాహా చేసనట్లు విచారణలో అధికారులు తేలినా మూడఉ నెలలకుపైగా విచారణ పేరిట కాలయాపన చేస్తున్నారని దళితుల గిరిజనులు కూలీనాలీ చేసి బ్యాంకు అప్పులు పొదుపులు చెల్లిస్తున్న నిధులను అక్రమాలు చేసి సొంతానికి వాడుకోవడం దారుణమన్నారు. కింది స్థాయి సిబ్బంది అక్రమాలకు పాల్పడుతుంటే పై స్థాయి అధికారులు పట్టించుకోకపోవడంపై మండి పడ్డారు. బ్యాంకులో సిబ్బంది కూడా డ్వాక్రా సంఘాల్లో జరుగుతున్న అక్రమాలపై దృష్టి సారించకపోవడం బాధాకరమన్నారు. అనంతరం ఎంపీడీవో మాలతికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో వగత్తూరు మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

## జువ్వలదిన్నె అభివృద్ధిపై వైసిపి కుట్ర



తడ, ఏప్రిల్ 13 ప్రభాతవార్త: మత్స్య కారులకు ఉపాధి అవకాశాలు మెరుగుపరి చేందుకు వారి జీవన విధానాల్లో మార్పులు తీసుకొచ్చేందుకు కూటమి ప్రభుత్వం కోట్ల రూపాయలు వెచ్చించి జువ్వలదిన్నెలో అటామాస్ మారిటైం ఫిష్ యార్డ్, సిస్టమ్స్ డెవలప్మెంట్ సెంటర్ అభివృద్ధి చేస్తుంటే వైసిపి పార్టీ జగన్మోహన్ రెడ్డి అభివృద్ధిని అడ్డుకునేందుకు ప్రయత్నిస్తున్నారని రాష్ట్ర బెస్త కార్పొరేషన్ చైర్మన్ బొమ్మన్ శ్రీధర్ ఆరోపించారు. వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్ అభివృద్ధికి సుమారు 290 కోట్లు వచ్చి అభివృద్ధి పనులు చేశారని ఆర్బర్ నిర్మాణం ద్వారా 25 వేల మత్స్యకార కుటుంబాలకు జీవన ఉపాధి ఏర్పడుతుందని ప్రతి ఏడాది హార్బర్ ద్వారా 41 వేల టన్నులు చేపలు దిగుబడి చేసే అవకాశం ఉందని మత్స్యకారులకు ఎంతటి ఉపయోగం కలిగిన జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్ అభివృద్ధిని జగన్మోహన్‌రెడ్డి అడ్డుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. రాష్ట్రానికి రాష్ట్ర ప్రజలకు మేలు జరిగే ఏ పనినైనా అడ్డంగా అడ్డుకోవడం వైసిపి పార్టీకి అలవాటుగా మారిందని ధ్వజమెత్తారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర బెస్ట్ కార్పొరేషన్ డైరెక్టర్ బొమ్మన్ పళని, ఏం సి డైరెక్టర్ బొమ్మన్ ఏకాంబరం మత్స్యకార నాయకులు పాల్గొన్నారు.

## సూళ్లూరుపేటలో పోషన్ పక్వాడ వారోత్సవాలు



సూళ్లూరుపేట, ఏప్రిల్ 13 ప్రభాతవార్త: పట్టణం రాజీవ్ నగర్‌లో పోషన్ పక్వాడ వారోత్సవాల్లో భాగంగా అంగనవాడి కేంద్రంలో సోమవారం బాలిం తలకు, గర్భవతులకు, 0 నుంచి 6 సంవత్సరాల పిల్లలకు పోషక ఆహారం ప్రయోజనాల గురించి సవివరంగా తెలిపారు. పోషకాహారాన్ని తీసుకోవడం వలన గర్భిణీ స్త్రీలు బలంగా తయారవుడమే కాకు ండా పుట్టే బిడ్డలు కూడా మంచి శక్తితో పుట్టేందుకు వీలవుతుందని తెలిపారు. అలాగే చిన్న వయసు నుంచి పౌష్టిక ఆహారాన్ని తీసుకోవడంతో భవిష్య త్తులో శారీరక దారుఢ్యంతో పాటు మంచి మేధస్సుగల పిల్లలుగా తయారవుతారని తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగనవాడి కార్యకర్త చెంగమ్మ, ఏఎన్ఎం, ఆశ వర్కర్ పాల్గొన్నారు.

## జనగణన-2027 పై శిక్షణ కార్యక్రమం



సూళ్లూరుపేట, ఏప్రిల్ 13 ప్రభాతవార్త: పురపాలక సంఘం నందు సోమవారం జనగణన-2027 నిర్వహణను సమర్థవంతంగా చేపట్టేందుకు సూళ్లూరుపేట స్పెషల్ ఆఫీసర్ కె.దేవేంద్రరెడ్డి సూచనలు మేరకు ఛార్జ్ ఆఫీసర్ మునిసిపల్ కమీషనర్, సూళ్లూరుపేట పురపాలక సంఘం వారి ఆధ్వర్యంలో పురపాలక సంఘ కార్యాలయంలోని కౌన్సిల్ హాల్‌లో ఎన్యూమరేటర్స్, సూపర్వైసర్స్‌కు ఫీల్డ్ ట్రైనర్స్‌చే విస్తృత స్థాయి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఛార్జ్ ఆఫీసర్, మునిసిపల్ కమీషనర్ కె.చిన్నయ్య మాట్లాడుతూ సెల్ఫ్ ఎన్రోల్మెంట్ ఈ నెల 16వ తేది నుండి ప్రారంభం అవుతుందని పట్టణం ప్రజలు సద్వినియోగం చేసుకోవాల్సిందిగా తెలిపారు. శిక్షణ కార్యక్రమం ఎన్యూమరేటర్స్ మరియు సూపర్వైసర్స్‌కి అవసరమైన సాంకేతిక పరిజ్ఞానం, విధానాలు, కార్యాచరణపై సమగ్ర అవగాహన కల్పించేందుకు ఉద్దేశించబడింది. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, శాఖాధికారులు, ఫీల్డ్ సిబ్బంది మరియు నియమిత ఎన్యూమరేటర్స్, సూపర్వైసర్స్ పాల్గొన్నారు. గృహాల వారీగా వివరాల సేకరణ విధానం, మొబైల్/డిజిటల్ అప్లికేషన్ వినియోగం, జనగణన మార్గ దర్శకాలు, డేటా ఎంట్రీ ప్రక్రియ, అలాగే సమాచార సేకరణలో ఖచ్చితత్వం మరియు సమయపాలన ప్రాముఖ్యత వంటి అంశాలపై వివరంగా శిక్షణ అందించబడింది. ఫీల్డ్ స్థాయిలో ఎదురయ్యే సమస్యలను సమర్థంగా పరిష్కరించేందుకు తగిన మార్గదర్శకాలు కూడా అందించారు.

## అక్కంపేటలో పోషన్ పక్వాడ



తడ, ఏప్రిల్ 13 ప్రభాతవార్త : సూళ్లూరుపేట స్త్రీ శిశు సంక్షేమ శాఖ సిడిపిఒ జ్యోతి కిరణ్ ఆదేశాలతో తడ మండలం అక్కంపేట అంగ న్వాడి కేంద్రంలో సూపర్వైజర్ లక్ష్మీ ్మ నారాయణమ్మ ఆధ్వర్యంలో పోషన్ పక్వాడ కార్యక్రమాన్ని నిర్వహిం చారు. వారు మాట్లాడుతూ ఈనెల 8వ తేదీ 23వ తేదీ వరకు 15 రోజులపాటు పౌష్టికాహార పక్షోత్సవాలు నిర్వహిస్తున్నామన్నారు. గర్భవతులకు బాలింతలకు చిన్నపిల్లల తల్లు తీసుకోవాల్సిన ఆహార పదార్థాలు ఆహారపు అలవాట్లు వ్యక్తిగత పరిశుభ్రత గురించి అవగాహన కల్పిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ సిబ్బంది గర్భవతులు బాలింతలు గ్రామస్తులు పాల్గొన్నారు.

## చెరువులు కాలువలకు మరమ్మతులకు తీర్మానం



వాకాడు, ఏప్రిల్ 13 ప్రభాతవార్త: పంచాయతీ ప్రత్యేక అధికారి, ఎంపీడీవో సాయిప్రసాద్ ఆధ్వర్యంలో చెరువులు కాలువలకు మరమ్మతులు చేపట్టేందుకు చెరువు సంఘం అధ్యక్షులు, టిడిపి నాయకులు మోహన్ నాయుడు కలసి తీర్మానం చేయాలని ప్రతిపాదించగా ప్రత్యేక అధికారి సాయిప్రసాద్ అంగీకరిం చారు. మండలంలోని కొండాపురం గ్రామంలోని సోమవారం పంచాయతీ ప్రత్యేక అధికారి సాయి ప్రసాద్ ఆధ్వర్యంలో గ్రామ సభ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సాగునీటి సంఘం అధ్యక్షులు టిడిపి నాయకులతో ఎంపీడీవో, పంచాయతీ ప్రత్యేక అధికారి సాయి ప్రసాద్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు పంచాయతీలో ఉన్నటువంటి అన్నా చెరువు, పెద్ద చెరువు, పంట కాలువలు మరమ్మతులు చేపట్టేందుకు ఇరిగేషన్ శాఖ అధికారులతో అది పాదంలో చేసుకోవాలని సూచించారు. అదేవిధంగా ముట్టెంబాక గ్రామంలోని ప్రత్యేక అధికారి సయ్యద్ మహమ్మద్ రఫీ ఆధ్వర్యంలో గ్రామసభ నిర్వహిం చారు. సాగునీటి సంఘం అధ్యక్షులు ఉచ్చురు ప్రసాద్ రెడ్డి చెరువు మరమ్మతులు చేసేందుకు తీర్మానం చేయగా పంచాయతీ ప్రత్యేక అధికారి అంగీకరించారు. ఈ కార్యక్రమంలో బ్యారేజ్ ఏఈ శ్రీనివాసరావు, సాగు నీటి సంఘం అధ్యక్షులు ప్రసాద్ రెడ్డి, జనార్ధన్, స్థానిక సభ్యులు తదితరులు ఉన్నారు.

## సూళ్లూరుపేటలో వివాహిత ఆత్మహత్య!



సూళ్లూరుపేట, ఏప్రిల్ 13 ప్రభాతవార్త: పట్టణంలోని జేఎన్టీ రోడ్డు సిపిఎం పార్టీ కార్యాలయం సమీపంలో నివసిస్తున్న అల్లూరు సరళ రెడ్డి (59) అనే వివాహిత మత్తుమాత్ర లుమింగి సోమవారం ఆత్మహత్యకు పాల్పడింది. వివరాల్లోకెళ్తే తన గృహం వద్దనే చిన్నపాటి బంకును ఏర్పాటు చేసుకుని జీవనం సాగిస్తున్న అల్లూరు సరళారెడ్డి ఆర్థిక లావాదేవీలతో ఆత్మహత్యకు పాల్పడి నట్లు చెబుతున్నారు. ఇదిలా ఉండగా సరళరెడ్డి ఆత్మహత్యకు కారణాన్ని వివరిస్తూ లేఖ రాసి ఉండడాన్ని పోలీసులు గుర్తించారు. కాగా ఈ లేఖలో ఏముందో పూర్తి వివరాలు తెలియవలసి ఉంది. ఎస్సై అజయ్ కుమార్ సంఘటన స్థలానికి వెళ్లి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## సూళ్లూరుపేటలో 488వ నేత్రదానం



సూళ్లూరుపేట, ఏప్రిల్ 13 ప్రభాతవార్త: సూళ్లూరుపేటలోని ఆచార్య భరద్వాజ సేవా సంస్థకు సోమవారం 488వ నేత్రదానం అందింది. పట్టణంలోని గమళ్ళ వీధికి చెందిన రామగిరి వేణు (77) మృతి చెందడంతో కుటుంబ సభ్యుల అంగీకారంతో ఆయన నేత్రాల నుండి కార్నియాలు సేకరించి చెన్నై శంకర నేత్రాలయకు పంపారు. ఈ కార్యక్రమంలో ఆచార్య భరద్వాజ సేవా సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

# సూళ్ళూరుపేట డివిజన్

## పంటను నాశనంపై తహశీల్దార్‌కి రైతు ఫిర్యాదు



వాకాడు, ఏప్రిల్ 13 ప్రభాతవార్త: మండలంలోని మొలగనూరు పంచాయితీ ముమ్మారెడ్డిపాలెం గ్రామానికి చెందిన తుమ్మతాడి శివశంకర్ సోమవారం వాకాడు మండల తహసీల్దారుకు అర్జీ సమర్పించి తన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా తుమ్మతాడి శివశంకర్ విలేకరులతో మాట్లాడుతూ తాను మాల కులాన్నని, పెళ్లయి ఇద్దరు పిల్లలున్నారని, రోజువారీ పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నానని, గత మూడు సంవత్సరాలుగా మొలగనూరు వద్ద స్వర్ణముఖి నది పద్దున సుమారు 25 సెంట్ల ప్రభుత్వ భూమిలో చిన్న చిన్న పంటలు వేసుకుని జీవనం సాగిస్తున్నానని శివశంకర్ తెలిపారు. తనతో పాటు అగ్రకులాల వారు స్వర్ణముఖి భూములను ఆక్రమించి బోరుబావులు తవ్వి పైపు లైన్లు వేసుకున్నారని, ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు వారిని పట్టించుకోవడం లేదని, నా కుటుంబ పోషణ కోసం సాగు చేస్తున్న ప్రాంతంలో లక్షల విలువైన రాళ్లు, కంచెను నిర్దాక్షిణ్యంగా కూల్చివేశారని ఆయన వాపోయారు. రెవెన్యూ అధికారులు అగ్రకులాల వారికి కొమ్ము కాస్తూ నిరుపేదలకు అన్యాయం చేస్తున్నారని ఆయన ఆరోపించారు. ఈ సమస్యపై ఎమ్మెల్యే, కలెక్టర్ స్పందించి తమకు న్యాయం చేయాలని, తహసీల్దారు సమగ్రంగా విచారించాలని ఆయన కోరారు.

## 24 పంచాయతీల్లో నేడు గ్రామసభలు : ఎంపీడీవో

బాలాయపల్లి, ఏప్రిల్ 13 ప్రభాతవార్త : మండలంలోని 24 గ్రామ పంచాయతీలో ఈనెల 14వ తేదీ గ్రామ సభలో నిర్వహించాలని కార్యదర్శులను ఎంపీడీవో దాసరి నారాయణ ఆదేశించారు. గ్రామ సభలు నిర్వహించి గ్రామాల్లో ఉన్న సమస్యలు తెలుసుకోవాలని తెలిపారు. పాఠశాలలో, గ్రామపంచాయతీ కార్యాలయాలు, సచివాలయాలలో పెట్టాలని తెలిపారు. గ్రామసభల ఫోటోలు, తీర్మానాల వివరాలను ఆన్లైన్లో పొందుపరచాలని సూచించారు. తాగునీటి సమస్య ఉంటే వెంటనే పరిష్కరించాలని చెప్పారు.

## విద్యార్థులకు సైకిల్ పంపిణీ




నాయుడుపేట, ఏప్రిల్ 13 ప్రభాత వార్త : మున్సిపాలిటీ పరిధిలోని ఎల్.ఏ సాగరం ఎస్సీ కాలనీ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలోని ఇద్దరు విద్యార్థులకు 786 సేవా సంఘం ఆధ్వర్యంలో ఆ సంఘం అధ్యక్షులు, పట్టణ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు షేక్ రఫీ ఉచితంగా సైకిళ్ల పంపిణీ చేశారు. పాఠశాల హాజరు మార్కులు ప్రవర్తన ఆధారంగా ఉపాధ్యాయులు ఎంపిక చేసిన విద్యార్థులు దొండపూడి ఏంజెల్, చార్లీ కిరణ్‌లకు సైకిళ్ల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా షేక్ రఫీ మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో చదివి ఉత్తమ ఫలితాలు సాధించాలని సూచించారు. వచ్చే ఏడాది ప్రతి తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించిన ఇద్దరికి మొత్తం 10 మంది విద్యార్థులకు తిరుపతిలోని బ్లూ ల్యాండ్ వాటర్ పార్క్ విహారయాత్రకు తన సొంత నిధులతో పంపిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు జ్ఞాన ప్రసన్న, ఉపాధ్యాయులు పాలేటి చంద్రయ్య, స్కూల్ పేరెంట్ కమిటీ చైర్మన్ సుబ్రహ్మణ్యం, వైస్ చైర్మన్ నజియా, 786 సేవా సంఘం సభ్యులు షరీఫ్, మహమ్మద్, రాంకీ, విజయమ్మ, తదితరులు పాల్గొన్నారు.

## టీడీపీ నేత ప్రసాద్‌కు ఘన నివాళులు

నాయుడుపేట, ఏప్రిల్ 13 ప్రభాతవార్త: సూళ్లూరుపేట నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ బీసీ సెల్ అధ్యక్షుడు నెలవల ప్రసాద్ యాదవ్‌కు మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం ఘన నివాళులు అర్పించారు. నెలవల ప్రసాద్ యాదవ్ ఆదివారం కన్నుమూసిన సమాచారం తెలుసుకున్న మాజీ ఎంపీ సుబ్రహ్మణ్యం స్థానిక నాయకులతో కలిసి పెళ్ళకూరు మండలం కానూరు గ్రామంలోని ప్రసాద్ యాదవ్ నివాసానికి చేరుకుని ఆయన పార్థీవ దేహానికి తెలుగుదేశం పార్టీ జెండా కప్పి,పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. అలాగే మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు సంచి కృష్ణయ్య టీడీపీ నాయకులు గూడూరు సుధీర్ రెడ్డి, అవధానం సుధీర్, కె గోపాలకృష్ణ, వేంపల్లి వెంకటేశ్వర్లు యాదవ్, పలువురు తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు ప్రసాద్ యాదవ్ పార్థివదేహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

## టిడిపిలో క్షత్రియుల అసంతృప్తి జ్వాలలు

రైల్వేకోడూరు రూరల్, ఏప్రిల్ 13 ప్రభాతవార్త: రైల్వేకోడూరు తెలుగుదేశం పార్టీ కార్యకలాపాల్లో క్షత్రియులకు ఏ పదవి దక్కలేదని అసంతృప్తితో పూర్తిస్థాయిలో నియోజకవర్గంలో చర్చ జరుగుతుంది. ఇటీవల కాలంలో కూటమి ప్రభుత్వం ఎన్నికలలో పోటీ చేయగా కూటమి ప్రభుత్వం బలపరిచిన జనసేన అభ్యర్థి గెలుపు కోసం గ్రామీణ ప్రాంతాల్లోని క్షత్రియులు పూర్తిగా కూటమి ప్రభుత్వానికి మద్దతు తెలపడంతో ఎట్టకేలకు కూటమి అభ్యర్థి గెలుపు ఖాయమైంది. అందులో వైసిపి పై క్షత్రియులు పూర్తిగా పార్టీకి వ్యతిరేకంగా పనిచేయడంతో వైసిపి అభ్యర్థి ఓటమి చవి చూశారు. నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో కూటమి ప్రభుత్వానికి జై కొట్టిన టిడిపి క్షత్రియులు ఇప్పుడు ఎటు పోవాలో అర్థం కాని స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు. కోడూరు, చిట్వేలి, ఓబులవారిపల్లి మండలాలలో అత్యధికంగా కూటమి ప్రభుత్వానికి క్షత్రియులు సంపూర్ణ మద్దతు తెలిపి అభ్యర్థిని గెలిపించుకున్న తరుణంలో క్షత్రియులకు ఏదైనా మంచి పదవి వస్తాదనే ఉద్దేశంతో జోరుగా పనిచేసిన క్షత్రియులు ప్రస్తుతం అసంతృప్తి జ్వాలలతో రగిలిపోతున్నారు.

ప్రతి క్షత్రియుడు టిడిపి జెండాను భుజాన వేసుకొని పార్టీకి నిరంతరం శ్రమించిన క్షత్రియుల గోడు పట్టించుకునే వారే లేరని నియోజకవర్గంలో జోరుగా ప్రచారం సాగుతుంది. ఏ పార్టీ గెలిచినా రైల్వేకోడూరులో మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి పూర్తిగా క్షత్రియులకే కేటాయించడం ఆనవాయితీగా ఉన్న సందర్భంలో కూటమి ప్రభుత్వం రావడం క్షత్రియులకు ఏ పదవి లేకపోవడం ఆశ్చర్యానికి క్షత్రియులు గురవుతున్నారు.

నియోజకవర్గంలో క్షత్రియులు ఎప్పటికీ టిడిపికే మద్దతు పలికిన సందర్భంలో కూటమి ప్రభుత్వం ద్వారా క్షత్రియులకు మొండి చెయ్యి మిగిలిందని బహిరంగంగా చర్చించుకుంటున్నారు. రైల్వేకోడూరు నియోజకవర్గంలో మాజీ ఓబులవారిపల్లి మండల అధ్యక్షుడు, చిట్వేలి మండలం సీ.ఎం. రాచపల్లి కి చెందిన మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ ఒకరు అదే విధంగా సూరపరాజుపల్లికి చెందిన ఒక మాజీ సర్పంచి క్షత్రియులో చక్రం తిప్పే నాయకులు కూడా పూర్తిస్థాయిలో టిడిపి క్షత్రియులకు పదవి బదులు మొండి చేయి చూపించిందని ఇది ఎంతవరకు సబబు అని రానున్న స్థానిక సంస్థల ఎన్నికలలో క్షత్రియుల తడాఖా చూపిస్తామని కూడా కొన్ని సంకేతాలు రైల్వే కోడూరు మండలంలో చర్చలు జరుగుతున్నాయి. ఇప్పటికైనా టిడిపి అధిష్టానం క్షత్రియులపై చక్కటి ఆదరణ చూపించకపోతే రానున్న ఎన్నికల్లో అనుకున్నది సాధిస్తామని క్షత్రియుల మనోభావాలు.

## పన్ను వసూళ్ల లక్ష్యాన్ని అధిగమించిన ఎంఎంసి : ఉయ్యాల



నాయుడుపేట, ఏప్రిల్ 13 ప్రభాతవార్త: 2025-26 ఆర్థిక సంవత్సరంలో నాయుడుపేట అగ్రికల్చర్ మార్కెట్ కమిటీ నూరు శాతం పన్ను వసూళ్ల లక్ష్యాన్ని అధిగమించినట్లు ఏఎంసీ చైర్మన్, జనసేన పార్టీ సూళ్లూరుపేట నియోజకవర్గ ఇన్చార్జి ఉయ్యాల ప్రవీణ్ తెలిపారు. సోమవారం స్థానిక ఏఎంసీ కార్యాలయంలో జరిగిన సాధారణ సమా వేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏఎంసీ చైర్మన్ ఉయ్యాల ప్రవీణ్ మాట్లాడుతూ 2025-26 ఆర్థిక సంవత్సరంలో నాయుడుపేట ఏఎంసి 380.00 లక్షల రూపాయల పన్ను వసూలు చేయాల్సి ఉండగా 393.73 లక్షల రూపాయల పన్నులను వసూలు చేసి లక్ష్యాన్ని అధిగమించినట్లు ఆయన తెలియజేశారు. పన్నుల వసూలు లక్ష్యాన్ని అధిగమించడంలో సహకరించిన ఏఎంసీ సిబ్బందికి, డైరెక్టర్లకు, రైతులకు,రైస్ మిల్లర్లకు, మార్కెట్ లైసెన్స్ హోల్డర్లకు, ధాన్యం వ్యాపారులకు ఈ సందర్భంగా ఆయన అభినందనలు తెలియజేశారు. నాయుడుపేట అగ్రికల్చర్ మార్కెట్ కమిటీ అభివృద్ధికి సహకరిస్తున్న ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ వైస్ చైర్మన్ కిలారి గోపాలకృష్ణ, డైరెక్టర్లు గోను బాబు, కాటూరు కోటేశ్వరరావు, రాయపు కస్తూరి అమ్మ, కామిరెడ్డి కేశవరెడ్డి, సిహెచ్ వేణయ్య, బైనా సుబ్రహ్మణ్యంరెడ్డి, తుపాకుల కన్నెమ్మ, సంచి కృష్ణయ్య, పాలూరు భాస్కర్, వ్యవసాయశాఖ ఏడి నాగార్జున సాగర్, గ్రేడ్ 1 కార్యదర్శి జివస్ ప్రసాద్, సహాయ కార్యదర్శి వి.వెంకటేశ్వర్లు, ఏఎంసీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## తిరుపతిలో రాష్ట్ర భవన నిర్మాణంలో తనిఖీలు

### కార్మికుల బోర్డు చైర్మన్ ఆకస్మిక తనిఖీలు



కలెక్టరేట్ ఏప్రిల్ 13 ప్రభాతవార్త : తిరుపతిలో సోమవారం రాష్ట్ర భవన నిర్మాణ కార్మికుల బోర్డ్ చైర్మన్ వలపల మల్లికార్జున రావు బాబ్జి ఆకస్మికంగా తనిఖీలు చేశారు. ఈ తనిఖీల్లో భాగంగా తిరుపతిలోని వసుంధర, ఆర్కే, నక్షత్ర కన్స్ట్రక్షన్స్ తదితర ఐదు యాజమాన్యాల ఆధ్వర్యంలో జరుగుతున్న భవన నిర్మాణ పనులను తనిఖీలు చేశారు. భవన కార్మికులకు యాజమాన్యం అందిస్తున్న సేవలను కార్మికుల నుండి అడిగి తెలుసుకున్నారు. అయితే ఏ ఒక్క కార్మికులకు కూడా కాంట్రాక్టు యజమాన్యాలు కార్మికుల భద్రత గురించి పట్టించుకోలేదన్న విషయాన్ని గుర్తించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ సీఎం చంద్రబాబు నాయుడు భవన కార్మికులను దృష్టిలో ఉంచుకొని అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టారన్నారు. ఇందులో భాగంగా ప్రతి భవన కార్మికుడికి వారి పనిలో నైపుణ్యతను ఇవ్వడంతో పాటు వారి కుటుంబాలను ఆర్థికంగా సామాజికంగా ఎదుగుదలకు సీఎం చేస్తున్న కృషిని తెలియజేశారు. భవన కార్మికులకు పెండ్లి ఖర్చులకు గాను 20 వేల రూపాయలు, ఆడబిడ్డ ప్రసూతి ఖర్చులకు గాని 30,000, మట్టి ఖర్చులకు గాను 20,000, డెత్ జరిగితే 80000 ఇస్తున్న విషయాన్ని తెలియజేశారు. అంతేకాకుండా ఎన్టీఆర్ స్కీం కింద రెండు లక్షల 50 వేల రూపాయలు ఇవ్వడం జరుగు తుందని, అంతకుమించి ఖర్చు అయితే సీఎం రిలీఫ్ ఫండ్ కింద కూడా వారిని ఆర్థికంగా ఆదుకోవడం జరుగుతుందని స్పష్టం చేశారు. వీటన్నిటికీ ముందుగా ప్రతి కార్మికుడు రిజిస్టర్ చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఆ దిశగా ప్రతి కార్మికుడు రిజిస్టర్ చేసుకొని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ తనిఖీల్లో భవన కార్మికుల డిప్యూటీ కమిషనర్ ఎం సురేష్ కుమార్, అసిస్టెంట్ కమిషనర్ లాలప్ప, అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ సర్కిల్ 1 ఎం ప్రవీణ్ కుమార్, అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ సర్కిల్ 2 జి రంగనాథ్, సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు

## చెరువు కట్టలను తొలగించి దర్జాగా ఆక్రమణ



తొట్టంబేడు ఏప్రిల్ 13 ప్రభాతవార్త: తొట్టంబేడు మండలంలో ప్రభుత్వ ఆస్తుల్ని కాపాడటంలో అధికారుల డొల్లతనం స్పష్టంగా కనబడుతుంది. మండలంలోని చెరువును చెరబట్టి రూపు రేఖలు మార్చేస్తున్నా రెవెన్యూ అధికారులు కానీ సంబంధిత ఇరిగేషన్ శాఖాధికారులు కానీ పట్టించుకోవటం లేదు. దాంతో ఆక్రమణదారులు దర్జాగా ఆక్రమించుకుంటున్నారు. మట్టి స్మగ్లర్లు విచ్చల విడిగా మట్టిని తరలిస్తూ పబ్బం గడుపుకుంటున్నారు.దాంతో మండలంలో ప్రకృతి వనరుల పరిస్థితి దయనీయంగా మారింది. తొట్టంబేడు మండలం కల్లిపూడి గ్రామంలో చెరువు కట్టను తొలగించి దర్జాగా పొలం పనులు చేసుకుంటున్నారని గ్రామస్తులు వాపోతున్నారు. వివరాలు ఇలా ఉన్నాయి. కల్లిపూడి గ్రామ రెవెన్యూ సర్వే నెంబర్ 50 విస్తీర్ణం 5 ఎకరాల ఎర్రచెరువు భూమి ఆక్రమణకు గురైంది.ఈ గ్రామంలో రైతులు పలుమార్లురెవెన్యూ అధికారులకు విన్నవించగా వారు సర్వే నిర్వహించి ఆక్రమణ స్థలంలో ప్రభుత్వ బోర్డు ఏర్పాటు చేశారు.ఆక్రమణదారుడు ఇవేవి తనకు పటనట్టుగా దర్జాగా ఏవరతై నాకేంటి నాదగ్గర పాస్‌పుస్తకాలు ఉన్నాయి.మీరు ఎవరితో చెప్పుకుంటారో చెప్పుకోండి అని తనపొలం పనులు చేసుకోంటున్నారు.అసలు చెరువులకు పాస్‌పుస్తకాలు ఎలా ఇచ్చారని నిలదీస్తున్నారు.ఆక్రమణదారులు గత ప్రభుత్వ అండదండలతో దర్జాగా 3 ఎకరాలు పాస్‌పుస్తకాలను ప్రభుత్వలెక్కలో నమోదు చేయించుకుని గ్రామంలోని గ్రామస్తులకు అంత చూపిస్తూ ఇది తనదేనని తన పనులు చేసుకుంటున్నారు. విచారణలో భూమి పై పరిశీలించగా సర్వే నెంబర్ 50 ఎర్రగుంటచెరువు అడంగలల్ నందు కొంత మంది పేర్లు నమోదు కాబడిఉందని వారు ఎర్రగుంట చెరువు నందు సాగు చేసుకోనుచున్నారని అయితే నీటి వనరులై చెరువులు, గుంటలు, కాలువ భూములను అక్రమించుకోంటున్నారు. ఇదంతాచేసినది సామాన్య వ్యక్తి కాదు ఆ ఊరి మాజీ సర్పంచ్ కావడం విశేషం.ఆయన అక్కడ ఆదిందే ఆట పాడిందే పాట అన్న చందా సాగుతుందని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు.దీనిపై ఇప్పటికైన సంబంధిత అధికారులు దృష్టి సారించాలన్నారు.

## 16నుండి ఈట్ స్ట్రీట్‌లో... దుకాణాలు తెరవాలి : కమిషనర్



తిరుపతి,ఏప్రిల్ 13ప్రభాతవార్త: తిరుపతి నగరంలో నగరపాలక ఆధ్వర్యంలో ఈట్ స్ట్రీట్‌లో దుకాణాలు చేజిక్కించుకున్న వ్యాపారులు ఈనెల 16నుండి దుకాణాలు నిర్వహించాలని నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య తెలిపారు. ఈట్ స్ట్రీట్ లో దుకాణాలు పొందిన వారికి సోమవారం సాయంత్రం కమిషనర్ తాళాలు అందించి దుకాణాల నిర్వహణ నియమాలను వివరించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఈట్ స్ట్రీట్ నందు దుకాణాలు పొందిన అందరూ ప్రభుత్వ నియమ నిబంధనలు అనుసరించి వ్యాపారాలు నిర్వహించాలని తెలిపారు. మీకు కేటాయించిన ఆహార పదార్థాలను మాత్రమే విక్రయించాలని తెలిపారు. దుకాణ దారులు నాణ్యమైన ఆహారాన్ని ప్రజలకు అందించాలని తెలిపారు. నిల్వ ఉంచిన ఆహార పదార్థాలను వినియోగించరాదని, అధిక ధరలకు విక్రయించరాదని సూచించారు. ఆహార పదార్థాలతో పాటు, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని తెలిపారు. తడి, పొడి చెత్త బుట్టలను వినియోగించాలని తెలిపారు. ప్లాస్టిక్ కవర్లు, సింగిల్ యూజ్ ప్లాస్టిక్ ను వినియోగించరాదని తెలిపారు. 24గంటలు సిసి కెమెరాల నిఘా ఉంటుందని తెలిపారు. నిబంధనలు అతిక్రమించిన వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమం లో అదనపు కమిషనర్ శారదా దేవి, డిప్యూటీ కమిషనర్ అమరయ్య, మునిసిపల్ ఇంజనీర్ తులసి కుమార్, రెవిన్యూ అధికారి సేతు మాధవ్, తదితరులు పాల్గొన్నారు.


**CHANGE OF NAME**

✦ I, **DURGESAM TEJOVATHY** (Old Name), W/o DURGESAM MUNIKRISHANAIAH, R/at D.No.1-79, Kuntrapakam V&P, Tirupati Dist. A.P., have changed my name to **DURGESAM TEJOVATHI.** Henceforth, I shall be known as **DURGESAM TEJOVATHI** (New Name).

✦ I, **MADERI SUSHMA** (Old Name), W/o VAJRALA MURALI MOHAN, R/at D.No. 20-3-60/40, Yerramitta, Tirupati Dist. A.P, have changed my surname to **VAJRALA SUSHMA.** Henceforth, I shall be known as **VAJRALA SUSHMA** (New Name).


## భూములు ఆక్రమించిన సుబ్బారెడ్డిపై చర్యలు: సిపిఎం



తిరుపతి హెల్త్, ఏప్రిల్ 13 ప్రభాత వార్త : తిరుపతి రూరల్ మండలం గాంధీపురం గ్రామ పంచాయతీలో సర్వేనెంబర్ 13లో ఒక ఎకరా తొమ్మిది సెంట్లు చెందిన భూమి 32 మంది గాంధీ పురం వాసులు కొన్న భూమిని ఆక్రమించుకున్న రామ సుబ్బారెడ్డిపై కేసు పెట్టి అరెస్టు చేయాలని కోరుతూ నేడు హతి రాంజీ మఠం ఆఫీస్ వద్ద సిపిఎం ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. అక్రమంగా నిర్మించిన గోడను కూల్చే వరకు పోరాటం కొనసాగుతుందన్నారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి వంద వాసి నాగరాజు, సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కందారపు మురళి మాట్లాడుతూ కొచ్చి శేషగిరిరావుకి, హతి రాంజీ మఠంకు మధ్య భూ వివాదం నడుస్తుందన్నారు. ఈ భూమిని 2014లో 32 మంది కొనుక్కున్నారని అన్నారు. అయితే 2023వ సంవత్సరంలో రామ సుబ్బారెడ్డి అనే వ్యక్తి ఈ భూమి నాది అని దౌర్జన్యంగా ఆ భూములకు ప్రవేశించి కాంపౌండ్ నిర్మించారని తెలిపారు. రామ సుబ్బారెడ్డి పై చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కి, రెవిన్యూకి ఫిర్యాదు చేసిన పట్టించుకోలేదన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నేతలు జి.బాలసుబ్రమణ్యం, పి సాయి లక్ష్మి, పి.ముని రాజా, ఎం.నరేంద్ర, బాధితులు మహేష్. ఎలుమలై, రమేష్, నరసింహ, రామ, ధరణి, వరమని, శంకర, మురగ, హరి, చంద్ర తదితరులు పాల్గొన్నారు.

## 15న బ్రహ్మశ్రీ డాక్టర్‌చే భగవన్నామ వైభవం



తిరుపతి హెల్త్, ఏప్రిల్ 13 ప్రభాతవార్త: తిరుపతి ఫిలిం సొసైటీ, మూల తిరుపతి దేవస్థానములు, హిందూ ధర్మ ప్రచార పరిషత్ వారి సహకారంతో ఏప్రిల్ 15న శారద జ్ఞానపుత్ర, ప్రవచనా చక్రవర్తి, సనాతన ధర్మ ప్రవచన శిరోమణి, బ్రహ్మశ్రీ డాక్టర్ చాగంటి కోటేశ్వరరావుచే భగవన్నామ వైభవం అనే అంశంపై ప్రవచనం ఏర్పాటు చేయడం జరిగిందని తిరుపతి ఫిలిం సొసైటీ చైర్మన్ ఎం.వేణుగోపాల్ రెడ్డి చెప్పారు. సోమవారం తిరుపతి ప్రెస్ క్లబ్ నందు జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ కార్యక్రమం తిరుపతి మహతి ఆడిటోరియం నందు బుధవారం సాయంత్రం ఐదు గంటలకు జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో చైర్మన్ ఎం వేణుగోపాల్ రెడ్డి, కార్యదర్శి సి ఆర్ కె శేషగిరిరావు, అధ్యక్షులు వైఎస్ బాబు, ఎడిటర్ షేక్ గుల్జార్ గౌస్, అనసూయ, కె జీకే ఫౌండేషన్ కే గిరిధర్ కుమార్, ఉపాధ్యక్షురాలు రాజ్యలక్ష్మి, యు. ప్రసాద్ రావు, తదితరులు పాల్గొన్నారు.




# ఒలంపియాడ్‌లో సత్తా చాటిన శ్రీ చైతన్య విద్యార్థులు

## జాతీయ స్థాయిలో పతక వర్షం

తిరుపతి విద్య, ఏప్రిల్ 13 ప్రభాతవార్త



తిరుపతి పట్టణంలోని శ్రీచైతన్య టెక్నో పాఠశాల (జి.ఎస్. మాడ బ్రాంచ్) విద్యార్థులు జాతీయ స్థాయిలో నిర్వహించిన ఒలంపియాడ్ లెవెల్2 పరీక్షల్లో అద్భుత ప్రతిభ కనబరిచి పాఠశాలకు మరింత కీర్తి ప్రతిష్టలు తీసుకువచ్చారు. కఠినమైన పోటీ మధ్య తమ ప్రతిభను చాటుతూ గోల్డ్ మెడల్స్, మెరిట్ సర్టిఫికెట్లు సాధించడం విశేషంగా నిలిచింది.విద్యార్థుల నిరంతర సాధన, క్రమశిక్షణ, గురువుల సమగ్ర మార్గదర్శకత్వం వల్లే ఈ విజయాలు సాధ్యమయ్యాయని ఏ.జి.ఎం సురేష్ తెలిపారు. ప్రతి విద్యార్థిలో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసే దిశగా పాఠశాల ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తోందని ఆయన వివరించారు.ఈ విజయోత్సవ కార్యక్రమానికి జిల్లా అర్బన్ ఎం.ఈ.ఓ కె. బాలాజి ముఖ్య అతిథిగా హాజరై విజేతలను అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యార్థులు క్రమశిక్షణ, వినయ విధేయతలతో పాటు లక్ష్యసాధనపై దృష్టి పెట్టినప్పుడే ఉన్నత శిఖరాలను అధిరోహించగలరని పేర్కొన్నారు. ఒలంపియాడ్ వంటి జాతీయ స్థాయి పరీక్షలు విద్యార్థుల ఆలోచనా శక్తిని, విశ్లేషణాత్మక దృక్పథాన్ని పెంపొందిస్తాయని తెలిపారు.అనంతరం విజేతలకు అతిథుల చేతుల మీదుగా ల్యాప్‌టాప్‌లు, ట్యాబ్‌లు, గోల్డ్ మెడల్స్, మెరిట్ సర్టిఫికెట్లు , ఇతర ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు, తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ సురేష్, కోఆర్డినేటర్ బాలాజి, డీన్ నరేంద్ర బాబు, సి ఇంచార్జ్ దీప, ప్రైమరీ ఇంచార్జ్ అర్చనతో పాటు పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు. విద్యార్థుల విజయానికి తోడ్పడిన ప్రతి ఒక్కరికి ఈ సందర్భంగా నిర్వాహకులు కృతజ్ఞతలు తెలిపారు.

# తిరుపతి డివిజన్

## మహిళా శక్తి దిశగా విద్యార్థినుల అడుగులు

### ఎస్వీ పాలిటెక్నిక్‌లో చైతన్య కార్యక్రమం

తిరుపతి విద్య, ఏప్రిల్ 13 ప్రభాతవార్త



తిరుపతిలోని ఎస్వీ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో విద్యార్థినులలో చైతన్యం పెంపొందించేందుకు నారీ శక్తి వందన్ అభినియమ్‌పై ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మహిళా సాధికారతకు బలమైన దిశగా ఈ కార్యక్రమం విద్యార్థినుల్లో కొత్త ఆలోచనలకు నాంది పలికింది.వికసిత్ భారతికి అవాజ్ కార్యక్రమంలో భాగంగా ప్రిన్సిపాల్ డాక్టర్ వై. ద్వారకానాథ్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో ఫార్మసీ విభాగాధిపతి హరీష్ బాబు, సివిల్ ఇంజినీరింగ్ విభాగాధిపతి సుజాత పాల్గొని విద్యార్థినులకు చట్టం ప్రాముఖ్యతను వివరించారు.మహిళలకు సమాన హక్కులు, అవకాశాలు కల్పించడమే నారీ శక్తి వందన్ అభినియమ్ ముఖ్య ఉద్దేశమని, సమాజంలో మహిళలు అన్ని రంగాల్లో ముందుకు రావాలంటే చట్టాలపై అవగాహన అవసరమని వారు సూచించారు. విద్యార్థినులు తమ హక్కులను తెలుసుకొని ధైర్యంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమం ద్వారా మహిళల్లో ఆత్మవిశ్వాసం పెంపొందించడమే లక్ష్యమని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో కళాశాల సిబ్బంది, విద్యార్థినులు ఉత్సాహంగా పాల్గొన్నారు

## ఎన్నికలు పూర్తి.. సేవల్లో మార్పు ఎప్పుడు?

### రవాణా శాఖపై ప్రజల అసంతృప్తి మళ్లీ ముందుకు

తిరుపతి రవాణ, ఏప్రిల్ 13 ప్రభాత వార్త



విజయవాడలో జరిగిన రాష్ట్ర రవాణా శాఖ సాంకేతిక అధికారుల సంఘం ఎన్నికల్లో కొత్త నాయకత్వం ఏర్పడినప్పటికీ, వాహనదారులకు అందుతున్న సేవల నాణ్యతపై ప్రశ్నలు మళ్లీ తలెత్తుతున్నాయి. ఎన్నికలు సజావుగా పూర్తైనా, ప్రజలకు ఎదురవుతున్న సమస్యలు మాత్రం అలాగే కొనసాగుతున్నాయని విమర్శలు వినిపిస్తున్నాయి.పుత్తూరు మోటార్ వాహనాల తనిఖీ అధికారి చంద్రశేఖర్ రాష్ట్ర అసోసియేట్ ప్రెసిడెంట్‌గా, వెంకట రమణా నాయక్ జోనల్ ప్రెసిడెంట్‌గా,అతికా నాజ్ జోనల్ సెక్రటరీగా,స్వర్ణలత జిల్లా ప్రతినిధిగా ఏకగ్రీవంగా ఎన్నుకోబడ్డారు. అయితే, ఈ కొత్త బాధ్యతలతో పాటు ప్రజల నమ్మకాన్ని గెలుచుకునేలా మార్పులు తీసుకురావాలనే డిమాండ్ బలపడుతోంది.వాహనదారులు ఎదుర్కొంటున్న ఆలస్యం, కార్యాలయాల్లో నిరక్ష్యం, పారదర్శకత లోపం వంటి సమస్యలు ఇంకా పరిష్కారం కాకపోవడంపై అసంతృప్తి వ్యక్తమవుతోంది.పదవులు మారుతున్నాయి.. కానీ సేవలు మారుతున్నాయా? అన్న ప్రశ్న ఇప్పుడు ప్రధానంగా వినిపిస్తోంది.ఈ నేపథ్యంలో జిల్లా రవాణా శాఖ అధికారి నూతనంగా ఎన్నికైన ప్రతినిధులను అభినందిస్తూ, ప్రజలకు సేవలందించడంలో బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. అయితే మాటలకే పరిమితం కాకుండా, ప్రాక్టికల్‌గా మార్పులు తీసుకురావాలని వాహనదారులు కోరుతున్నారు. పదవులుకాదు..పనితీరు ముఖ్యం అన్న భావనతో ప్రజలు ఇప్పుడు కొత్త నాయకత్వాన్ని గమనిస్తున్నారు.

## గీతామందిరంలో 36వ వార్షికోత్సవ వేడుకలు

పుత్తూరు రూరల్, ఏప్రిల్ 13 ప్రభాతవార్త:

పుత్తూరు పట్టణంలోని శ్రీ కామాక్షి సమేత స్వామి ఆలయ ప్రాంగణంలో ఉన్న గీతా మందిరంలో ఈనెల 18వ తేదీ శనివారం నుంచి 22 తేదీ బుధవారం వరకు 36వ సంవత్సరం వార్షికోత్సవ వేడుకలు నిర్వహించనున్నట్లు శ్రీ గీతాసేవాసమాజం వారు తెలిపారు. ఈ కార్యక్రమాలు 18వ తేదీ శనివారం ఉదయం స్వామివారికి అభిషేకాలు, అలంకరణలు, సాయంత్రం పూజ, శ్రీ పవిత్రానందన్ సరస్వతి స్వామివారిచే జ్యోతి ప్రజ్వలన ఆధ్యాత్మిక ప్రవచనాలు, 19వ తేదీ ఆదివారం ఉదయం అభిషేకాలు, అలంకరణలు, గీతా హోమం శ్రీ వేదాంతం శ్రీనివాస భట్టాచార్యులచే ప్రవచనాలు, సాయంత్రం పూజశ్రీ పవిత్రానంద సరస్వతి స్వామివారిచే ఆధ్యాత్మిక ప్రవచనాలు, 20వ తేదీ సోమవారం ఉదయం అఖండ గీతా పారాయణం, మధ్యాహ్నం ఆలయ ఆవరణలో భక్తులకు 21వ తేదీ మంగళవారం ఉదయం అభిషేకాలు, అలంకరణలు, రచనలు, సాయంత్రం మొగల్ సాయి అక్బర్ బాదుషా వారిచే ఆధ్యాత్మిక ప్రవచనాలు, 22న బుధవారం ఉదయం స్వామివారికి అభిషేకాలు, అలంకరణలు, సాయంత్రం మొగల్‌సాయి అక్బర్ బాదుషా వారిచే ఆధ్యాత్మిక ప్రవచనాలు ఉంటాయని వివరించారు.

## వృద్ధాప్యంలో నిద్రలేమి సహజం

పుత్తూరు రూరల్, ఏప్రిల్ 13 ప్రభాతవార్త:



వృద్ధాప్యం వచ్చే కొద్దీ నిద్రలేమి ఎక్కువ అవుతుంది అది సహజం అన్నారు. ప్రముఖ గుండె వైద్యులు డాక్టర్ ఉబేదుల్లా సోమవారం పుత్తూరు భాస్కర్‌రాజు స్మృతి భవనంలో విశ్రాంత ఉద్యోగుల సంఘం, అమర ఆస్పత్రి సంయుక్తంగా వైద్య శిబిరం ప్రారంభిస్తూ శరీర తత్వాన్ని బట్టి అవసరమైనప్పుడు నీరు తాగాలన్నారు. ఈ శిబిరంలో దాదాపు 150 మంది విశ్రాంత ఉద్యోగులు షుగర్, రక్తపోటు, ఈసీజీ పరీక్షలు ఉచితంగా చేసుకోగా వారికి వైద్యులు సలహాలు సూచనలు ఇచ్చారు. పురుషోత్తంశెట్టి ధ్యానం చేయించగా ఆత్మజ్ఞానంపై వీడియో ప్రదర్శనను శ్రీనివాసరావు నంద్యాల వారు ప్రదర్శించారు. గానలహరి పాటల కార్యక్రమాన్ని భక్తవత్సలం రాజు నిర్వహించగా గాయకులు చారుమతి, మల్లికారాణి మాలినీదేవి, జయశ్రీ, భక్తవత్సలం, జయచంద్ర, భక్తశీలన్ పాల్గొని వారి మధుర గాత్రాలతో సభను అలరింపచేశారు. ఈ సమావేశంలో సంఘంఅభివృద్ధిని కాంక్షిస్తూ ముంతాజ్‌బేగం, భక్తవత్సలం రాజు, సుధాకర్‌పిళ్లై ఒక్కొక్కరు 5 వేలు చొప్పున అధ్యక్షులు గుణశేఖర్‌రెడ్డికి అందజేశారు. నూతనసభ్యులను గుణశేఖర్ రెడ్డి ఆహ్వానించి సత్కరించారు. కార్యక్రమంలో కుప్పయ్య, రామలింగం, వెంకట కృష్ణయ్య నాయుడు, రామకృష్ణమరాజు, వెంకటకృష్ణ, వెంకటరామయ్య, వేలు నారాయణస్వామి, రాజగోపాల్, రామచంద్రరాజు,రామమూర్తిరాజు,సిద్ధయ్య,అరుణాచలం, మాలినీదేవి, సీతమ్మ, పలువురు పాల్గొన్నారు.

## ఫీజు కోసం పరుగు.. చదువు ఎక్కడ ?

### పీజీ విద్యార్థుల మనసులో మౌన పోరాటం

తిరుపతి విద్య, ఏప్రిల్ 13 ప్రభాత వార్త



పరీక్షలు దగ్గరపడుతున్నాయి.. కానీ నా చేతిలో పుస్తకం కంటే ఫీజు ఆలోచనే ఎక్కువగా ఉంది.. ఇదే ఎస్వీయూ పరిధిలో చదువుతున్న ఓ పీజీ విద్యార్థి మనసులో మాట.ఈనెల 25 నుంచి పరీక్షలు ప్రారంభం కానుండగా, ఫీజు గడువు దగ్గరపడటం విద్యార్థుల్లో ఆందోళనను మరింత పెంచింది. ఇంట్లో పరిస్థితులు సరిగా లేక, తల్లిదండ్రులపై భారం వేయలేక, స్నేహితుల వద్ద అప్పు అడగాలా.. లేక పరీక్షే వదిలేయాలా.. అనే దారుణ స్థితిలో పలువురు విద్యార్థులు ఉన్నారు.రోజంతా క్లాస్‌లో కూర్చున్నా.. మనసు మాత్రం డబ్బుల దగ్గరే ఉంది అంటున్న మరో విద్యార్థి. చదవాలి, ర్యాంక్ రావాలి అన్న ఆశ ఉన్నా, ఫీజు ఒత్తిడి ఆ ఆశలను మింగేస్తోందని వారు చెబుతున్నారు.ఈ పరిస్థితుల్లో ఏఐఎస్ఎఫ్ నాయకులు ముందుకొచ్చి అధికారులను కలిసి గడువు పెంచాలని కోరారు. చివరికి అధికారులు మరో రెండు రోజుల గడువు ఇస్తామని హామీ ఇవ్వడంతో కొంత ఊరట లభించినా, విద్యార్థుల మనసుల్లో మిగిలిన ఆందోళన మాత్రం అలాగే ఉంది.గడువు పెంచడం కాదు.. మాకు కొంచెం శ్వాస తీసుకునే అవకాశం కావాలి అని విద్యార్థుల మౌన విజ్ఞప్తి.ఈ సంఘటన మరోసారి విద్యార్థుల ఆర్థిక సమస్యలు, విద్యా వ్యవస్థలో ఉన్న ఒత్తిడిని స్పష్టంగా బయటపెడుతోంది.ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ యూనివర్సిటీ అధ్యక్ష, కార్యదర్శులు రవియాదవ్, వెంకటేష్, జిల్లా కార్యదర్శి ప్రవీణ్, రాష్ట్ర సమితి సభ్యులు చిన్న తదితరులు పాల్గొన్నారు.

## హరిపురం కాలనీలో 33కెవి విద్యుత్ లైన్‌పై ఉద్రిక్తత

### -దేవాలయం మీదగా లైన్‌కు వ్యతిరేకంగా ప్రజల ఆందోళన
### -అధికారులు జాగ్రత్త తీసుకోవాలని విజ్ఞప్తి

తిరుపతిరూరల్, ఎప్రిల్13 ప్రభాతవార్త:



తిరుపతిరూరల్ మండలం పేరూరు గ్రామ పంచాయతీ పరిధిలోని హరిపురం కాలనీలో విద్యుత్ శాఖ ప్రతిపాదించిన 33కెవి విద్యుత్ లైన్‌పై స్థానిక ప్రజల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. ఈమేరకు సోమవారం మాజీ సర్పంచ్ దామినేటి కేశవులు ఏఇ నీలకంఠయ్యను కలిసి వినతిపత్రం అందజేసారు. కాలనీలోని శ్రీరాముల ఆలయం మీదుగా లైన్‌ను తీసుకెళ్లేందుకు అధికారులు ప్రయత్నిస్తున్నారని...ఇది ప్రాణాపాయానికి దారితీసే చర్య అని కాలనీ వాసులు ఆరోపిస్తున్నారు. హైటెన్షన్ విద్యుత్ లైన్ అత్యంత శక్తివంతమైనదని...ఐదు అడుగుల పరిధిలోనే షాక్ ప్రమాదం ఉండే అవకాశం ఉందని చెబుతున్నారు. ముఖ్యంగా వర్షాకాలంలో పరిస్థితి మరింత ప్రమాదకరంగా మారి, కాలనీ ప్రజల ప్రాణాలకు ముప్పు ఏర్పడే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రాములవారి గుడి ప్రాంతంలో విద్యుత్ లైన్ వేయడం వల్ల భక్తులు, స్థానిక ప్రజలు ఎప్పటికప్పుడు ప్రమాదానికి గురయ్యే పరిస్థితి ఉంటుందని కాలనీ వాసులు పేర్కొంటున్నారు. అందువల్ల ప్రస్తుత ప్రణాళికలో ఉన్న మార్గం కాకుండా ఇప్పటికే ఉన్న మార్గంలోనే లైన్‌ను కొనసాగించాలని...అవసరమైతే పెద్ద విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేసి, భద్రతా ప్రమాణాలు పాటించాలని కోరుతున్నారు.

**ప్రజల అడ్డంకితో పనులు నిలిపివేత** ఈ అంశంపై ఇప్పటికే విద్యుత్ అధికారులకు సమాచారం అందజేసినట్లు స్థానికులు తెలిపారు. అయితే పనులు కొనసాగుతుండటంతో ప్రజలు సంఘటితంగా అడ్డుకోవడంతో ప్రస్తుతం పనులు తాత్కాలికంగా నిలిపివేయబడ్డాయి.

**అందరి సహకారం కోరుతూ పిలుపు** కాలనీ ప్రజల ప్రయోజనాల దృష్ట్యా ఈ సమస్యపై అందరూ ఒకటిగా నిలిచి సహకరించాలని స్థానిక నాయకులు పిలుపునిచ్చారు. ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకుని అధికారులు తగిన నిర్ణయం తీసుకోవాలని కోరుతున్నారు. ప్రజల అభ్యంతరాను పరిగణలోకి తీసుకోకుండా రాములవారి గుడివైపే లైన్ ఏర్పాటు చేయడానికి ప్రయత్నిస్తే....మరింత పెద్దఎత్తున ప్రజలతో కలిసి అడ్డుకుంటామని హెచ్చరించ్చారు.

## పోషకాలు కలిగిన ఆహారం తీసుకోవాలి

పుత్తూరు రూరల్, ఏప్రిల్ 13 ప్రభాతవార్త:

పుత్తూరు బలిజ స్ట్రీట్‌లోని అంగన్‌వాడీలో పురుషుల భాగస్వామ్యం, తల్లిపాలను ప్రోత్సహించడం, గర్భ పరీక్షలకు గర్భిణీలతో పాటు భర్తలు వెళ్ళడం గురించి చర్చించారని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శ్రీదేవి తెలిపారు. మహిళలు గర్భం దాల్చినప్పటి నుంచి పిల్లలకు రెండేళ్ళ వయస్సు వరకు మెదడు 80 శాతం అభివృద్ధి జరుగుతుందని, ఈ సమయం అత్యంత కీలకమని, పోషకాలు కలిగిన ఆహారం తీసుకోవాలని అన్నారు. టాటా ట్రస్టు సంతోషి, ఆశ వర్కర్లు, పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## అంబేద్కర్ ఆలోచనలతో విద్యార్థుల్లో నూతన స్ఫూర్తి

### ఎస్వీ జూనియర్ కళాశాలలో జయంతి వేడుకలు

తిరుపతి విద్య, ఏప్రిల్ 13 ప్రభాత వార్త



తిరుపతిలోని ఎస్వీ జూనియర్ కళాశాలలో డాక్టర్ బాబా సాహెబ్ భీమ్‌రావ్ అంబేద్కర్ జయంతిని ఘనంగా నిర్వహిస్తూ, ఆయన ఆలోచనలు విద్యార్థుల్లో కొత్త దిశను చూపించాయి. ప్రిన్సిపాల్ ప్రకాష్ బాబు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో అంబేద్కర్ సిద్ధాంతాలు, సమానత్వ భావనపై విద్యార్థులకు అవగాహన కల్పిం చారు.జిల్లా ఇంటర్మీడియట్ ప్రాంతీయ పర్యవేక్షణ అధికారి జి. రాజశేఖర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన స్పష్టంగా మాట్లాడుతూ,అంబేద్కర్ కేవలం రాజ్యాంగ నిర్మాత మాత్రమే కాదు.. సామాజిక న్యాయం కోసం జీవితాంతం పోరాడిన మహోన్నత సంస్కరణవాది. ఆయన చూపించిన మార్గం నేటి యువతకు దిశానిర్దేశం చేయాలి. సమాన హక్కులు, సమాన అవకాశాలు ప్రతి ఒక్కరికీ అందేలా కృషి చేయడం మన బాధ్యత అని ,విద్యార్థులు అంబేద్కర్ ఆలోచనలను కేవలం పుస్తకాలకే పరిమితం చేయకుండా జీవితంలో అమలు చేస్తేనే నిజమైన మార్పు సాధ్యమవుతుంది. విద్య ద్వారా సమాజంలో అసమానతలను తొలగించి సమానత్వాన్ని నెలకొల్పాలి అని పిలుపునిచ్చారు.విద్యార్థులు అంబేద్కర్ జీవితం, ఆయన దార్శనికత నుంచి స్ఫూర్తి పొందుతూ సమాజంలో మార్పుకు కృషి చేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొని అంబేద్కర్‌కు ఘన నివాళులు అర్పించారు.

## రేపు విజయపురంలో సామాజిక తనిఖీ ప్రజా వేదిక సమావేశం

విజయపురం, ఏప్రిల్ 13 ప్రభాతవార్త:

రేపు బుధవారం ఉదయం మండలపరిషత్ కార్యాలయ ఆవరణలో ఉపాధిహామీ పథకంలో భాగంగా సామాజిక తనిఖీ ప్రజా వేదిక సమావేశం ఉదయం 10 గంటలకు సామాజిక తనిఖీలో భాగంగా మార్చి 27 నుంచి మార్చి 29 వరకు గ్రామాల్లో విచారణ నిర్వహించారు. ఉపాధి సిబ్బంది, ఉపాధి కూలీలు, పారిశుధ్య కార్మికులు, గృహ నిర్మాణ కార్మికులు హాజరు కావాలని సూచించారు.

## బాల్య వివాహాలపై కళాజాత

విజయపురం, ఏప్రిల్ 13 ప్రభాతవార్త:



మండలంలోని ఆలపాక కండ్రిగ హరిజనవాడలో బాల్య వివాహాలపై సోమవారం కళాజాత కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీవో ఇందిరప్రియదర్శిని మాట్లాడుతూ కార్వేటినగరానికి చెందిన కళాజాత బృందం సాంస్కృతిక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. బాల్య వివాహాల వలన అనర్థాలు, కౌమారదశలో కలిగే మార్పులు గురించి వివరించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు లక్ష్మి, శ్యామల, అంగన్‌వాడీ కార్యకర్త శాంతి, ఎలిజిబిత్ లలిత, రాణి తదితరులు పాల్గొన్నారు.

## అవకాశం ఇస్తే.. మేమూ ముందుంటాం

### నారీ శక్తి కార్యక్రమంలో విద్యార్థినుల మనసులో మాట

తిరుపతి విద్య, ఏప్రిల్ 13 ప్రభాతవార్త



మేము చదవాలనుకుంటున్నాం.. ఎదగాలనుకుంటున్నాం.. కానీ ప్రతి అడుగులోనూ అడ్డంకులే ఎదురవుతున్నాయి..ఇది తిరుపతిలోని ఎస్ పి డబ్ల్యు పాలిటెక్నిక్‌లో చదువుతున్న ఓ విద్యార్థిని మనసులో మాట.నారీ శక్తి కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థినులు తమ ఆశలు, ఆందోళనలు వ్యక్తం చేశారు. వేదికపై మహిళా సాధికారత, సమాన హక్కుల గురించి మాట్లాడుతున్నప్పుడు, తమ జీవితాల్లో ఎదురవుతున్న వాస్తవ పరిస్థితులు గుర్తుకొచ్చి భావోద్వేగానికి లోనయ్యామని వారు చెబుతున్నారు.చదువు పూర్తయ్యాక మంచి ఉద్యోగం చేయాలి అనుకుంటున్నాం.. కానీ ఇంటి పరిస్థితులు, సమాజపు అంచనాలు, భద్రతా భయాలు మమ్మల్ని వెనక్కి లాగుతున్నాయి అని మరో విద్యార్థిని తన బాధను పంచుకుంది.కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం. పద్మావతమ్మ మాట్లాడుతూ మహిళలకు సమాన అవకాశాలు అవసరమని, నిర్ణయాల్లో వారి పాత్ర పెరగాలని చెప్పిన మాటలు తమకు కొత్త ఆశను ఇచ్చాయని విద్యార్థినులు తెలిపారు.మా కోసం మాట్లాడేవాళ్లు ఉన్నారనే నమ్మకం కలిగింది అని వారు పేర్కొన్నారు.అయితే, అవగాహన కార్యక్రమాలతో పాటు నిజ జీవితంలో కూడా మార్పు రావాలని, తమ కలలను సాకారం చేసుకునే వాతావరణం కల్పించాలని విద్యార్థినులు కోరుతున్నారు.నారీ శక్తి అంటే కేవలం మాటలు కాదు.. మాకు దారి చూపే అవకాశం కావాలి ఇదే ఈ కార్యక్రమం తర్వాత విద్యార్థినుల హృదయాల్లో మిగిలిన భావం.ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థినులు పాల్గొన్నారు.

## తిరుచానూరు పంచాయతీ పార్కింగ్ వేలం

తిరుచానూరు, ఏప్రిల్ 13 ప్రభాతవార్త



పంచాయతీ పార్కింగ్ వేలం అత్యంత పటిష్ట బందోబస్తుతో నిర్వహించారు తిరుచానూరు అంటే మొదటగా అమ్మవారి గుర్తొచ్చినప్పటికీ రాజకీయంగా అత్యంత కీలకమైన మేజర్ పంచాయతీలలో ఒకటి ఈ పంచాయతీలో పార్కింగ్ వేలం ప్రతి సంవత్సరం మార్చి నెలలో జరుగును కానీ ఈ సంవత్సరం ఏప్రిల్ లో నిర్వహించారు.పార్కింగ్ కు గాను గవర్నమెంట్ ప్రభుత్వం నిర్ణయించిన వేలం ధరావత్తు 3 కోట్ల 15 లక్షలు కాగా సీల్డ్ టెండర్లు రెండు మూడు కోట్ల 15 లక్షల 9000 మరియు మూడు కోట్ల 15 లక్షల 9999వేశారు మరియు ఓపెన్ ఆక్షన్ లో తిరుపతి పీకే లే అవుట్ కు చెందిన దక్షిణాది కిరణ్ రెడ్డి మూడు కోట్ల 15 లక్షల 40000 కు తిరుచానూరు పార్కింగ్ టెండర్ను తగ్గించుకున్నారు.ఇదిలా ఉండగా గతం కంటే 35 లక్షలు తక్కువగా వేలంపాటపోవడం అత్యంత పటిష్టమైన పోలీసు భద్రత పెట్టి కూటమి నాయకులలో కొంతమందిని వేలం పాటకు రానివ్వకుండా చేసి తక్కువ ధరావత్తుకే వేలం పాటను దక్కించుకున్నారని ప్రజలు వాపోతున్నారు.ఏది ఏమైనప్పటికీ గత పది సంవత్సరములు కాలం లో ఇంత నాటకీయ పరిస్థితులలో పార్కింగ్ వేలం నిర్వహించడం అంతట

## స్త్రీలకు విద్య, ఆర్థిక స్వేచ్ఛ కావాలి

పాకాల, ఏప్రిల్ 13 ప్రభాతవార్త

స్త్రీలకు విద్య ఆర్థిక స్వేచ్ఛ ఉంటే మరింత అభివృద్ధి చెందుతారని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రధానాచార్యులు డాక్టర్ డి. సుజాత అన్నారు. సోమవారం కళాశాలలో మహిళా విభాగం ఆధ్వర్యంలో స్త్రీ శక్తి కార్యక్రమం నిర్వహించారు. పార్లమెంటులో మహిళా రిజర్వేషన్ల అమలు కోసం చట్ట సవరణను ఆమోదించనున్న సందర్భంగా ఆ చట్టం గురించి అవగాహన కల్పించాలని లక్ష్యంతో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. చట్టసభల్లో మహిళలకు రిజర్వేషన్లు రావడం వలన మహిళల సమస్యలపై పోరాడే అవకాశం కలుగుతుందన్నారు. విద్యార్థులకు వక్తృత్వ పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. మహిళా విభాగం సమన్వయకర్త డాక్టర్ కే రమణమ్మ విద్య ద్వారానే మహిళలకు హక్కుల పట్ల అవగాహన ఆత్మ గౌరవం, పెంపొందుతాయన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్వీ రమేష్ కుమార్, చిట్టి కళావతి, మాధవి, నాగమణి, మాశిలామణి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## అతుకుబడి పట్టా సమస్యలను పరిష్కరించండి

రైల్వేకోడూరు రూరల్, ఏప్రిల్ 13 ప్రభాతవార్త



రైల్వేకోడూరు మండలంలోని అతుకుబడి పట్టా సమస్యలను పరిష్కరించాలంటూ సోమవారం తాసిల్దారు అమర్నాథ్‌కు జనసేన పార్టీ నాయకులు బత్తిన గంగయ్య యాదవ్ వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా గంగయ్య యాదవ్ మాట్లాడుతూ మండలంలోని రైతులు అతుకుబడి పట్టా వలన రైతు కుటుంబాలు బాగ పరిష్కారాలు చేసుకోలేక, రైతులు క్రయ విక్రయాలు జరుపుకోలేక, ఆడబిడ్డల పెళ్లిళ్లకు,చదువులకు విక్రయించుకోలేక, బ్యాంకుల నుండి రుణాలు పొందలేక, ప్రైవేట్ రుణాలు చెల్లించలేక, రైతులకు ప్రభుత్వం నుంచి వచ్చే సబ్సిడీ పథకాలకు దరఖాస్తు చేసుకోలేని పరిస్థితిలో రైతులు ఇబ్బందులు పడుతున్నారని, అలాగే రైతు వారి పట్టా పాస్ పుస్తకాలు ఆన్లైన్ నందు నమోదు చేసుకోలేక అనేక సంవత్సరాలుగా మండలంలోని రైతులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని అధికారులు దయవుంచి అతుకుబడి పట్టా సమస్యలను త్వరితగతిన పరిష్కరించవలసిందిగా ఆయన తాసిల్దారును కోరారు. అతుకుబడి పట్టా విషయంలో రైతులు అయోమయంలో ఉన్నారని అతుకుబడి పట్టా అంటే ఏమిటి,అతుకుబడి పట్టాగా రెవెన్యూ రికార్డులలో ఎందుకు చేర్చవలసి వచ్చింది రికార్డుల నుంచి తొలగించుటకు ఎందుకు జాప్యం జరుగుతుందో అర్థం కాని పరిస్థితులలో రైతులు ఉన్నారని అన్నారు. తాసిల్దారు అమర్నాథ్ మాట్లాడుతూ మండలంలో దాదాపు 17వేల ఎకరాల భూములు అతుకుబడి పట్టా కింద ఉన్నాయని త్వరలో ఈ సమస్యను ఉన్నతాధికారులకు తెలియజేసి పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని అన్నారు.

# రైతులకు అందుబాటులో

## వ్యవసాయ సర్వీసు దరఖాస్తుల సమాచారం
## -ఎస్పీడీసీఎల్ సిఎండి శివశంకర్ లోతేటి

తిరుపతి, ఏప్రిల్ 13 ప్రభాతవార్త:



ఎస్పీడీసీఎల్ పరిధిలో వ్యవసాయ విద్యుత్ సర్వీసుల కోసం దరఖాస్తుదారుల సీనియారిటీ లిస్టును రైతులకు అందుబాటులో ఉంచుతున్నామని ఆ సంస్థ సిఎండి శివశంకర్ లోతేటి తెలిపారు.ఎస్పీడీసీఎల్ కార్పొరేట్ కార్యాలయంలో సోమవారం ఉదయం డయల్ యువర్ సిఎండి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు వినియోగదారులు మాట్లాడుతూ వ్యవసాయ విద్యుత్ సర్వీసులను మంజూరు చేయడంలో ఆలస్యాన్ని సీఎండి దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా సీఎండి శివశంకర్ లోతేటి మాట్లాడుతూ వ్యవసాయ విద్యుత్ సర్వీసుల మంజూరుకు సంబంధించిన సమాచారాన్ని సంబంధిత సెక్షన్ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రైతులకు ఫోన్ చేసి స్పష్టంగా తెలియజేయడంతోపాటు ఆయా సెక్షన్ల వ్యవసాయ విద్యుత్ సర్వీసు దరఖాస్తుల సీనియారిటీ లిస్టును నోటీసు బోర్డులో ప్రదర్శించాలని ఆదేశించామన్నారు, సీనియారిటీ ఆధారంగా సర్వీసులను మంజూరు చేస్తున్నామని తెలిపారు. ఈ అంశంలో నిబంధనలను అతిక్రమిస్తే సంబంధిత అధికారులు, సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కాగా సోమవారం నిర్వహించిన డయల్ యువర్ ఏపీఎస్పీడీసీఎల్ సిఎండి కార్యక్రమం ద్వారా 54 మంది వినియోగదారులు విద్యుత్ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు.

ఈ కార్యక్రమం ద్వారా నమోదయ్యే సమస్యలను పరిష్కరించేందుకు సంబంధిత అధికారులు, సిబ్బంది ప్రాధాన్యతనివ్వాలని ఆదేశించారు. ఈ కార్యక్రమం ద్వారానే కాకుండా వినియోగదారులు విద్యుత్ శాఖ టోల్ ఫ్రీ నంబర్లు: 1912 లేదా 1800 425 155333కు కాల్ చేయడం లేదా వాట్సాప్ నంబరు: 91333 31912కు చాట్ చేయడం ద్వారా విద్యుత్ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చి, పరిష్కరించుకోవచ్చని తెలియజేశారు.

# తిరుపతి డివిజన్

## ఎస్‌పిఎంవివిలో ప్రొఫెసర్ ధనవేల్ ప్రసంగం



యూనివర్సిటీ(తిరుపతి),ఏప్రిల్ 13(ప్రభాతవార్త: పద్మావతి మహిళా విశ్వవిద్యాలయ ఆంగ్ల శాఖ ఆధ్వర్యంలో, ఐఐటి మద్రాస్, హ్యూమానిటీస్ సోషల్ సైన్సెస్ విభాగానికి చెందిన ప్రొఫెసర్ ఎస్. పి. ధనవేల్ ప్రసంగం ఏర్పాటు చేయబడింది. సమకాలీన ప్రపంచ సమస్యలను ఎదుర్కొనే విషయంలో మానవీయ శామానవీయ శాఈ కార్యక్రమంలో ఆంగ్ల విభాగ అధ్యాపకులు, పరిశోధకులు, విద్యార్థినులు చురుకుగా పాల్గొని, ఈ సమకాలీన అంశంపై జరిగిన చర్చ నుండి విలువైన అవగాహనను పొందారు.

## పల్లం పాఠశాలలో వ్యక్తిగత సాధికారిత సదస్సు



ఏర్పేడు,ఏప్రిల్ 13 ప్రభాతవార్త: ఏర్పేడు మండలం లోని పల్లం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం విద్యార్థుల్లో మానసిక దృఢత్వం, ఆత్మవిశ్వాసం పెంపొందించేందుకు ప్రత్యేక సదస్సును నిర్వహించారు,. ఈ సదస్సును చిందేపల్లిలోని పేరెన్నిక గన్న దాక్షాయణి పార్వతి సమేత సిద్దేశ్వర స్వామి ఆలయ ధర్మకర్త గంగల పూడి గిరిధర్ సారధ్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో చైతన్యం నింపి సత్ఫలితాలు సాధించాలన్నది లక్ష్యంగా వివరించారు.ఈ సదస్సుకు ప్రముఖ మోటివేషన్ స్పీకర్ రవిరాజు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరికి జీవితం అంటే లక్ష్యం స్పష్టంగా నిర్దేశించుకొని ప్రణాళికలు ఆచరించి సత్ఫలితాలు సాధించాలని పిలుపు నిచ్చారు. గంగల పూడి గిరిధర్ రెడ్డి పాఠశాలలో 475 మందికి అవసరమైన స్టడీ మెటీరియల్‌ను అందజేసారు. ఈ కార్యక్రమాల్లో గంగల పూడి గిరిధర్‌రెడ్డి,ఆయన తనయుడు గంగల పూడిఅజయ్ కుమార్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఆనంద్, నిర్వహణ సమితి సభ్యులు ఉపాధ్యాయులు,తల్లి దండ్రులు పాల్గొన్నారు.

## పౌష్టికాహారంతోనే ఆరోగ్యం



శ్రీకాళహస్తి రూరల్, ఏప్రిల్ 13 ప్రభాతవార్త: శ్రీకాళహస్తి మండలంలోని ఉరంధూరు అంగన్వాడి కేంద్రం లో సోమవారం పోషన్ పక్వాడ కార్యక్రమాన్ని అంగన్వాడి గ్రేడ్ వన్ సూపర్వైజర్లు భాగ్యలక్ష్మీ, హరితల పర్యవేక్షణలో నిర్వహించారు, గర్భిణీలకు బాలింతలకు పౌష్టికాహారాన్ని అందజేశారు, కుటుంబ బాధ్యతలపై, జీరో నుంచి చిన్నారులకు మెదడు వికాసంపై మరిన్ని అంశాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. గ్రేట్ వన్ సూపర్వైజర్లు భాగ్యలక్ష్మీ, హరిత, మాట్లాడుతూ.. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా వేసవిలో చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు ఆరోగ్య భాగ్యం కల్పించేందుకు పోషణ పక్వాడా పక్షోత్సవాలను నిర్వహిస్తున్నామన్నారు. ఈనెల 9న ప్రారంభమైన ఈ కార్యక్రమాలు 23 వరకు కొనసాగుతాయి. ప్రధానంగా తల్లి లేదా తండ్రి ఎవరో ఒకరు కనీసం అక్షరాస్యులుగా తీర్చిదిద్దేందుకు ఈ వారోత్సవాల్లో ప్రత్యేక చర్యలు తీసుకుంటారు. వయోజన విద్యాకేంద్రంలో చదువురాని వారిని చేర్పించి అక్షరాస్యు లుగా చేయడానికి ప్రణాళికను సిద్ధం చేస్తున్నారు ఈ కార్యక్రమంలో అంగన్వాడి ఉపాధ్యాయులు దిల్షాద్ శాంతి, మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.

## జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోండి



శ్రీకాళహస్తి ఏప్రిల్ 13 ప్రభాతవార్త: శ్రీకాళహస్తిలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి తెలుగుదేశం పార్టీ నాయ కులతో ఈ నెల 15వన నిర్వహిం చనున్న జాబ్ మేళా గోడపత్రికలను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ జయంతిని పురస్కరిం చుకొని శ్రీకాళహస్తి పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఉన్న డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి కూటమి నాయకులు ఘన నివాళులు అర్పించనున్నమని తెలియజేశారు. శ్రీకాళహస్తిలోని అంబేద్కర్ విగ్రహానికి పురపాలక సంఘం నిధులతో మరింత హంగులతో నూతనంగా నిర్మింప చేసామని తెలియజేశారు. తన తండ్రి మాజీ మంత్రివర్యులు బొజ్జల గోపాలకృష్ణారెడ్డి జయంతిని పురస్కరించుకొని ఈనెల 15వ తేదీన అనేక సేవా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలియజేశారు.శ్రీ కాళహస్తిని ప్రభుత్వ ఆసుపత్రి నందు అపోలో ఆస్పత్రికి చెందిన డాక్టర్లచే మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నామని, దీనిని ప్రజల సద్వినియోగం చేసుకోవాల్సిందిగా కోరారు.ఉదయం తొమ్మిది గంటల శ్రీకాళహస్తిలోని స్కిట్ కళాశాల నందు మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నామని, నిరుద్యోగ యువతీ యువకులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని నిరుద్యోగ యువతీ యువకులు ఉద్యోగాలు పొందవలసిందిగా ఆయన నిరుద్యోగ యువతీ యువకులకు విజ్ఞప్తి చేశారు.

## కూటమి అయినా న్యాయం చేయండి

### -రోడ్డుపై బైఠాయించిన బాధితులు



శ్రీకాళహస్తి, ఏప్రిల్ 13 ప్రభాతవార్త: గత కొంత కాలంగా తమ భూములకు సంబందించి న్యాయం జరగటం లేదంటూ బాధితులు రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. సోమ వారం శ్రీకాళహస్తి మండల రెవెన్యూ కార్యా లయం వద్ద తమ ఆందోళన చేపట్టారు.గత ప్రభుత్వ హాయంలో తమకు తీరని అన్యాయం చేసారని కూటమి ప్రభుత్వంలో అయినా న్యాయం జరుగుతుందనుకుంటే ఏడాదిన్నరగా రెవెన్యూ అధికారులు తమ మొరను పట్టించుకోవటం లేదన్నారు. శ్రీకాళహస్తిలోని ఎమ్మార్వో కార్యాలయం నందు తమకు న్యాయం జరగటం లేదంటూ,తమకు న్యాయం చేయాలని ఎమ్మార్వో కార్యాలయం రోడ్డుపై బైఠాయించి తమకు న్యాయం చేయండి మహాప్రభో అంటూ అధికారులను కోరుకున్న తొట్టంబేడు మండలంలోని చిన్న సింగమల గ్రామానికి చెందిన మల్లంసునంద,ఆమె తండ్రి ఆనంద్‌లు ఆందోళనకు దిగారు. సమాచారం అందుకున్న టూ టౌన్ పోలీసులు రంగప్రవేశం చేసి బాధితులను ఓదార్చి వారికి న్యాయం చేస్తానంటూ ఎమ్మార్వో అధికారుల వద్దకు తీసుకుని వెళ్లారు.. వివరాలు ఇలా ఉన్నాయి. ఆనంద్ మాట్లాడుతూ.. శ్రీకాళహస్తి మండలంలోని గుంటకిందపల్లి వద్ద కొంత సాగుభూమి ఉందని, దానిని గత ప్రభుత్వంలో వైకాపా నాయకులు, తమ భూమి నందు తమను రాకుండా చేశారని, తమకు న్యాయం చేయమని ఇప్పటికీ అనేక పర్యాయములు ఎమ్మార్వో, కలెక్టర్ కార్యాలయం నందు ప్రజాదర్బార్లో వినతిపత్రం అందజేసినా అధికారులు తమకు తెలియకుండానే తమను సంప్రదించకుండానే కలెక్టర్ కార్యాలయానికి ఆ భూమి తమది కాదంటూ పలుమార్లు నివేదికలు సమర్పించారని, తమకు న్యాయం చేయమని, శ్రీకాళహస్తి ఎమ్మార్వో కార్యాలయంకు వెళ్లి అధికారులను ఆశ్రయించిగా వారు తమపై దౌర్జన్యం చేశారని ప్రజలపై దౌర్జన్యం చేస్తున్న ఇలాంటి ఎమ్మార్వో కార్యాలయం అధికారులపై తగువిధమైన చర్యలు తీసుకొని తమకు తమభూమిని ఇప్పించి న్యాయం చేయాలంటూ వారు కోరారు.

## మా పొలాలకు వెళ్లేందుకు సౌకర్యం కల్పించండి

తిరుపతి హెల్త్, ఏప్రిల్ 13 ప్రభాతవార్త: మా పొలాలకు వెళ్లేందుకు సౌకర్యాలు కల్పించండని, దుర్గసముద్రం గ్రామంలోని జిల్లా పరిషత్ హైస్కూల్ పక్కనున్న భూమిని అదే గ్రామానికి చెందిన కొందరు వ్యక్తులు ఆక్రమించి కాంపౌండ్ నిర్మాణంతో రైతులు పొలాలు వెళ్లే దారి లేకుండా చేసారని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేసారు. సోమవారం తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా దుర్గసముద్రంకు చెందిన ఏ.శంకర ఆనందరెడ్డి మాట్లాడుతూ తిరుపతి రూరల్ మండలం, దుర్గసముద్రంలోని సర్వేనెంబర్ 135/1లో 7.98 ఎకరాల భూమి ప్రభుత్వ రికార్డుల్లో అనాదీనంగా ఉన్నప్పటికీ సదరు భూమిని అదే గ్రామానికి చెందిన 11 మంది తప్పుడు పత్రాలు సృష్టించి ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవడం జరిగిందన్నారు. ఈ భూమిలో కాంపౌండ్ వాల్ నిర్మించి చుట్టు ప్రక్కల ఉన్న రైతులకు వారి పొలాలకు పోయే దారులను నిర్బంధించడమే కాక స్కూల్ విద్యార్థులకు కూడా అసౌకర్యాన్ని కలిగిస్తున్నారని వాపోయారు. 2026 జనవరి వరకు అనాధీనంగా ఉన్న ఈ భూమి తెలుగుదేశం పార్టీ ప్రభుత్వం ఏర్పాటు చేశాక సదరు భూమి తెలుగుదేశం పార్టీ కార్యకర్తల పేరిట ఆన్‌లైన్‌లో ఎక్కించడం జరిగిందని తెలిపారు. 2024 రెండు రోజుల క్రితం ప్రస్తావించడంతో ఆయనపై నిందారోపణలకు పాల్పడడం విడ్డూరమన్నారు. అదే గ్రామానికి చెందిన దళితుడు చిరంజీవికి 11 సెంట్లు పట్టాభూమి ఉందని, ఈ భూమిని ఆన్‌లైన్‌లో ఎక్కించాలని ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్న ఆన్‌లైన్‌లో ఎక్కించక ఆలసత్యం చేస్తున్న అధికారులు భూ ఆక్రమణ దారులకు సదురు భూమి సత్వరం ఆన్‌లైన్‌లో ఎక్కించడం ఏమిటని ప్రశ్నించారు. అంతేకాక దుర్గసముద్రంకు చెందిన సర్వేనెంబర్ 70/8లో 11 సెంట్లు, 70/12లో మరో 6 సెంట్లు భూమిని కూడా ఆన్‌లైన్‌లో నమోదు చేసేందుకు ప్రయత్నం సాగుతోందని ఆరోపించారు. ప్రస్తుతం స్కూల్‌కు పక్కనున్న భూమి ఆక్రమణతో స్కూల్ చుట్టూ ఉన్న చెట్లను సైతం కూల్చివేసి కాంపౌండ్ నిర్మించడంతో అటు ప్రక్కనున్న పొలాలకు సైతం దారి లేకుండా చేయడం దుర్మార్గమన్నారు. ఈ సమావేశంలో మాజీ సర్పంచ్ ఎం.ప్రసాద్ రెడ్డి, మాజీ ఉప సర్పంచ్ ఎం.చిరంజీవి, జ్యోతినాథ్ రెడ్డి, జయకుమార్ యాదవ్, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

## ఫిజియోథెరపీ కళాశాల ఆధ్వర్యంలో అతిథి ఉపన్యాసం



తిరుపతి హెల్త్, ఏప్రిల్ 13 ప్రభాతవార్త: శ్రీ వెంకటేశ్వర వైద్య విజ్ఞాన సంస్థ (స్విమ్స్) ఫిజియోథెరపి కళాశాల ఆధ్వర్యంలో ఆర్థిక సహాయం కోసం ఆవిష్కరణ సాధికారత పరిశోధన ప్రతిపాదన అనే అంశంపై అతిథి ఉపన్యాసం ను సోమవారం ఉదయం 11.00 గంటలకు స్విమ్స్ ఓ.పి.డి.బ్లాక్ శ్రీ పద్మావతి ఆడిటోరియం నందు నిర్వహించినట్లు స్విమ్స్ మెడికల్ సూపరింటెండెంట్ డా. రామ్ తెలియజేశారు. స్విమ్స్ సంచాలకులు, ఉపకులపతి డా. ఆర్.వి. కుమార్, పీహెచ్‌డీ, ఎఫ్.సీ.ఆర్.ఎం.బీ.ఎమ్. (ఎయిమ్స్), అసిస్టెంట్ ప్రొఫెసర్ మరియు కన్సల్టెంట్ (న్యూరో నర్సింగ్), నర్సింగ్ విభాగం, నిమ్హాన్స్, బెంగళూరు నుంచి ముఖ్య అతిథిగా విచ్చేసిన డా. గోపిచంద్రన్, కాలేజి ఆఫ్ ఫిజియోథెరఫి ప్రిన్సిపల్ డా. కె.మాధవి సంయుక్తంగా జ్యోతిని వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. స్విమ్స్ సంచాలకులు మరియు ఉపకులపతి డా. ఆర్.వి.కుమార్ మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాల వల్ల విద్యార్థులలో సృజనాత్మకత పెంపొందించడం, ఎప్పటికప్పుడు కొత్త మెలుకవలు తెలసు కోవడానికి ఉపయోగకరంగా ఉంటుదన్నారు. ముఖ్య అతిథి డా. గోపిచంద్రన్ ఆర్థిక సహాయం కోసం ఆవిష్కరణ సాధికారత పరిశోధన ప్రతిపాదన అనే అంశంపై వివరిస్తూ స్థానిక వనరులను ఉపయోగించి నవకల్పనలకు సాధికారత కల్పించడం ద్వారా గ్రామీణ, పట్టణ స్టార్టప్‌ల అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. ఆవిష్కర్తలకు మెంటార్ షిప్, పెట్టుబడి, సాంకేతిక మద్దతు అందించడం ద్వారా కనీసం 510 వాణిజ్యపరమైన ఉత్పత్తులు అభివృద్ధి అవుతాయన్నారు.ఈ ప్రయత్నం గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలను పెంచి, ఆత్మనిర్భర్ భారత్ లక్ష్యాన్ని సాధించడంలో తోడ్పడుతుంది పలు అంశాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన ద్వారా విద్యార్థులకు వివరించారు. ఫిజియోథెరపి ప్రిన్సిపాల్ డా. మాధవి మాట్లాడుతూ విద్యార్థులలో ఆలోచన ఇప్పటికే ఉన్నదాని కంటే భిన్నంగా ఉండేందుకు ఇలాంటి ప్రాజెక్టులు ఉపయోగకరంగా వుంటాయన్నారు. స్విమ్స్ సంచాలకులు మరియు ఉపకులపతి డా.ఆర్.వి.కుమార్ ముఖ్య అతిథిగా విచ్చేసిన డా గోపిచంద్రన్‌ని శాలువతో సన్మానించి, మెమోంటోను బహుకరించారు. డా కె.సెంథిల్ కుమార్ కోఆర్డినేటర్‌గా వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో ఫిజియోథెరపి కళాశాల అధ్యాపకులు డా విశ్వనాథ్, డా.శ్రీకుమారి, డా. శాంతి, డా. గోవర్ధన్, డా కవిత, డా.సురేష్ కుమార్, డా.జి.కామేశ్వరి, డా.ఎస్.రాఘవకృష్ణ, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా హాస్టల్ డే 2026 వేడుకలు



యూనివర్సిటీ(తిరుపతి),ఏప్రిల్ 13(ప్రభాతవార్త: తిరుపతి పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం తమ హాస్టల్ డే 2026ను ఇందిరా ప్రియదర్శిని ఆడిటోరియంలో ఉత్సాహంగా, సాంస్కృతిక వైభవంతో జరుపుకుంది. ఈ కార్యక్రమానికి వైస్‌ఛాన్సలర్ ప్రొఫెసర్ ఉమా వెన్నం ముఖ్య అతిథిగా విచ్చేసి, విద్యార్థులలో క్రమశిక్షణ, స్వాతంత్రం మరియు జీవితకాల స్నేహాలను పెంపొందించడంలో హాస్టల్ జీవితం యొక్క ప్రాముఖ్యతను నొక్కి చెప్పారు. గౌరవ అతిథిగా విచ్చేసిన రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఆర్. ఉష, ఈ కార్యక్రమాన్ని నిర్వహించడంలో హాస్టల్ యాజమాన్యం, విద్యార్థులు చేసిన కృషిని అభినందిస్తూ, క్లుప్తమైనప్పటికీ ప్రభావవంతమైన ప్రసంగం చేశారు. ఈ కార్యక్రమ ముఖ్య నిర్వాహకురాలు వార్డెన్ ప్రొఫెసర్ జి. సావిత్రి, అతిథులకు లాంఛనంగా స్వాగతం పలికి, సభను ఉద్దేశించి ప్రసంగించారు. చైర్‌పర్సన్ పాముల తనూజ (ఎల్.ఎల్.ఎం), జనరల్ సెక్రటరీ పెరుమాళ్ హంసవేణి (ఎంబీఏ), మరియు జాయింట్ సెక్రటరీ సీపాన రాధ (బి.ఫార్మసీ) నేతృత్వంలోని హాస్టల్ యూనియన్ ఈ కార్యక్రమాన్ని సమర్థవంతంగా సమన్వయం చేసింది. ఈ కార్యక్రమాన్ని సజావుగా నిర్వహించడంలో డిప్యూటీ వార్డెన్లు, అసిస్టెంట్‌వార్డెన్లు కూడా తమ సహకారాన్ని అందించారు.

## ప్రజా సమస్యల పరిష్కారానికే ప్రాధాన్యత : ఎంఆర్‌ఓ



శ్రీకాళహస్తి,ఏప్రిల్ 13 ప్రభాతవార్త: శ్రీకాళహస్తి మండలంలో ప్రజా సమస్యల పరిష్కారానికే ప్రాధాన్యత ఇస్తామని కొత్తగా బాధ్యతలు చేపట్టిన తహశీల్దార్ టిడి సుబ్రమణ్యం అన్నారు. గతంలో ఇక్కడ పని చేసిన ఆయనకు శ్రీకాళహస్తి మండలంలోని ప్రతి సమస్యపై అవగాహన ఉంది. అంతేకాక ఓ వైపు మండలం మరో వైపు శ్రీకాళహస్తి మున్సిపాలిటిలోని సమస్యలపై అవగాహన, శ్రీకాళహస్తిని పట్టి పీడిస్తున్న రాజీవ్‌నగర్ సమస్యలపై కూడా ఆయనకు పూర్తిగా సమాచారం తెలుసు. ఇప్పటికే 20నెలలుగా శ్రీకాళహస్తి శాసనసభ్యుడు సుధీర్‌రెడ్డి రాజీవ్‌నగర్ ఆక్రమణ దారుల భరతం పడతామని చెబుతున్నారు. ఇటీవల ఇద్దరు ఎంఆర్‌ఓలు బాధ్యతలు తీసుకొని సర్వేల మీద సర్వేలు జరిపారు కానీ రాజీవ్‌నగర్ కథ తేల్చలేదు. ఈ నేపధ్యంలో సోమవారం బాధ్యతలు స్వీకరించిన తహశీల్దార్ సుబ్రమణ్యం రెవెన్యూ సమస్యలకు సంబంధించి కార్యాలయంలో సంప్రదించి తన దృష్టికి తెస్తే తప్పక పరిష్కరిస్తామన్నారు. గ్రీవెన్స్ డేలో వచ్చే సమస్యలు,అలాగే ప్రజా దర్బార్‌ను విజయవంతంగా సాగించుటకు అక్కడ వచ్చిన సమస్యలను పరిష్కరించుటకు ప్రాధాన్యత ఇస్తామన్నారు.

## పాట్నా జడ్జిచే రాహుకేతుదోష నివారణ పూజలు



శ్రీకాళహస్తి,ఏప్రిల్ 13 ప్రభాతవార్త: శ్రీకాళహస్తీశ్వరా లయంలో సోమవారం పాట్నా హైకోర్టు జడ్జి అనుపమ చక్రవర్తి కుటుంబసభ్యులతో రాగా వారికి జ్యూడిషియల్ అధకారులు, ఆలయ ప్రోటోకాల్‌ఎఇఓ మోహన్,ఎపిఆర్‌ఓ రవిలు వేదపండితులతో ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. పూజల తరువాత స్వామి అమ్మవార్ల అంతరాలయ దర్శనం మృత్యుంజయస్వామి ఆలయం వద్ద వేదపండితులతో ప్రత్యేకాశీర్వచనాలు స్వామి అమ్మవార్ల చిత్రపటాలను అందించారు.

## శివయ్య సేవలో కావలి ఎంఎల్‌సి



శ్రీకాళహస్తి,ఏప్రిల్ 13 ప్రభాతవార్త: శ్రీకాళహస్తీశ్వరుని సేవలో సోమవారం కావలి ఎంఎల్‌సి కుటుంబసభ్యులో పాల్గొన్నారు.ఎంఎల్‌సి గ్రీష్మ కుటుంబ సభ్యులతో రాగా ప్రోటోకాల్‌మేరకు ఎపిఆర్‌ఓ రవి సారధ్యంలో దక్షిణ గోపురం వద్ద ఘనస్వాగతం పలికారు. స్వామి అమ్మవార్ల అంతరాలయ దర్శనం చేసుకున్నవారికి మృత్యుంజయ స్వామి ఆలయం వద్ద వేదపండితులతో ప్రత్యేకాశీర్వ చనాలు అందించారు. స్వామి అమ్మవార్ల తీర్థ ప్రసాదాలను రవి అందించారు.

## ఏర్పేడు తహశీల్దార్‌గా రాజశేఖర్



ఏర్పేడు,ఏప్రిల్ 13 ప్రభాతవార్త: ఏర్పేడు తహశీల్దార్‌గా రాజశేఖర్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేస్తున్న తహశీల్దార్‌ను కల్టెరేట్‌కు బదిలి చేసారు. గతంలో పని చేసిన తహశీల్దార్ భార్గవి హయాంలో మండలంలో భూ సమస్యలు పెచ్చుపెరిగాయి. అంతేకాకండా వివాదాలు, విమర్శలు, ఆరోపణలు చోటు చేసుకున్నాయి. వారు మారాలని ప్రజా సమస్యలపై దృష్టి సారించాలని శాసనసభ్యుడు సుధీర్‌రెడ్డి పలుమార్లు సూచించారు.కానీ పట్టించుకోలేదు. తీరు మారలేదు.దాంతో బదిలి చేయక తప్పలేదు.కొత్తగా బాధ్యతలు స్వీకరించిన రాజశేఖర్ సత్యవేడు నుంచి ఇక్కడకు వచ్చారు. బాధ్యతలు స్వీకరించిన ఆయన మిడియాతో మాట్లాడుతూ శ్రీకాళహస్తి నియోజకవర్గం ఓ ఆధ్యాత్మిక దివ్యక్షేత్రం అన్నారు. ఇందులో భాగమైన ఏర్పేడులో కూడా మహిమాన్విత ఆధ్యాత్మిక క్షేత్రం గుడిమల్లం,మరో వైపు బత్తినయ్య కోనలు ఉన్నాయన్నారు. అక్కడకు నిత్యం భక్తులు వేలాది మంది వస్తుంటారని వివరించారు.అంతేకాక ఏర్పేడు మండలం పరిశ్రమలకు నిలయం. అలాగే విద్యాహబ్‌గా ఉందన్నారు. ఈ మండలంలో 43 పంచాయతీలు పెద్ద మండలం అన్నారు.ఇక్కడ భూ సమస్యలు అధికంగా ఉన్నట్లు తన దృష్టికి వచ్చిందన్నారు. మండలంలో భూసమస్యలు సత్వరం పరిష్కరించుటకుప్రణాళికా బద్ధంగా పని చేస్తామన్నారు. ఇకభూ ఆక్రమణలకు సంబంధించి పరిశీలించి సాధ్యమైనంత వరకు తన పరిధిలో పరిష్కరించగల్గిన సమస్యలు యుద్ధ ప్రాతిపదికపై పరిష్కరిస్తామన్నారు. అయితే సమస్య స్పష్టంగా ఉండాలని వాస్తవికత ఉన్న వాటికి ప్రాధాన్యతతో పరిష్కరిస్తామని రాజశేఖర్ వివరించారు.పేదల సమస్యలను జాప్యం లేకుండా పరిష్కరిస్తామన్నారు.

## చదువు సంస్కారాన్ని, క్రమశిక్షణను అందిస్తాయి! : చెవిరెడ్డి



శ్రీకాళహస్తి,ఏప్రిల్ 13 ప్రభాతవార్త : చదువు సంస్కారాన్ని అందిస్తుందని క్రమశిక్షణ ఔన్నత్యాన్ని అందిస్తాయని ఆక్స్‌ఫర్డ్ పబ్లిక్ స్కూల్ కరస్పాండెంట్ చెవిరెడ్డి మధుసూధనరెడ్డి అన్నారు. పాఠశాలలో గ్రాడ్యుయేషన్ డేను సోమవారం చక్కగా నిర్వహించారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో తల్లిదండ్రుల నుద్దేశించి మధుసూధనరెడ్డి మాట్లాడారు.పాఠశాలలో 1,5,6 తరగతుల విద్యార్థుకు 'గ్రాడ్యుయేషన్ దే'కు సంబంధించి అవగాహన కార్యక్రమాలను ఏర్పాటు చేసారు.ఈ సందర్భంగా తల్లిదండ్రులనుద్దేశించి కరస్పాండెంట్ మాట్లాడుతూ తమ పాఠశాలలో క్రమశిక్షణకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. పాఠశాలలో ఉన్నంత సేపు తాము విద్యార్థులను చదువు తప్ప వేరే వ్యాపకాలపై దృష్టి లేకుండా చేస్తామన్నారు. అయితే ఇంటి వచ్చిన తరువాత బిడ్డలనుత ల్లిదండ్రులు కొంత సమయం కేటాయించాలని వారి చదువులకు సంబంధించి విచారించాలన్నారు. తల్లిదండ్రులు పెల్ ఫోన్లు పట్టుకుంటే బిడ్డలు కకూడా అలఅఆగే తయారౌతారన్నారు.అలా కాకుండా వారి చదువుకు సంబంధించి కొంత సమయం కేటాయించి చదివించాలన్నారు.అలాగే సామాజికాంశాలకు సంబంధించి అవగాహన కల్పించాలని పిలుపు నిచ్చారు.నేడు గ్రాడ్యుయేషన్ డే అవగాహనకు తల్లిదండ్రులు హాజరు కావటం తనకు ఎంతో సంతోషంగా ఉందన్నారు.విద్యార్థులు తమ ప్రతిభను వివిధ సాంస్కృతిక కార్యక్రమాలను ప్రదర్శించి ఆకట్టుకోవటం వారిలోని క్రమశిక్షణకు తల్లిదండ్రుల శ్రద్దలకు నిదర్శనం అన్నారు.ఈ సందర్భంగా మధుసూధనరెడ్డి పాఠశాల ఉపాధ్యాయుల చొరవను అభినందించారు.

## టిడ్కో లబ్దిదారులతో దేశం నాయకులు



శ్రీకాళహస్తి,ఏప్రిల్ 13 ప్రభాతవార్త: శ్రీకాళహస్తి పట్టణంలోని టిడ్కో లబ్దిదారుల కలలు సాకారం అయ్యే రోజు దగ్గరగా ఉందని కుమారస్వామితిప్ప ఆలయజీర్ణోద్ధారణ కమిటి చైర్మెన్ నెమళ్ళూరు బుజ్జి అన్నారు. ఈ నెల 15న శ్రీకాళహస్తి నియోజకవర్గ మాజీ శాసనసభ్యుడు బొజ్జల గోపాలకృష్ణారెడ్డి జన్మదిన సందర్భంగా టిడ్కో ఇళ్ళను అందించుటకు సిద్ధం చేస్తున్నారు.ఈ నేపధ్యంలో సోమవారం బుజ్జి సారధ్యంలో 22వ వార్డు లబ్దిదారులు సచివాలయలో సమావేశం ఏ ర్పాటు చేసారు. ఇళ్ళు పొందే ప్రతి ఒక్కరు కుటుంబసమేతంగా హాజరుకావాలని కోరారు. ఈ సమావేశంలో నెమళ్ళూరు బుజ్జితోపాటు పూల శేఖర్, శేషు, అనూష,సుధాకర్, బాలయ్య,శివ,సులేమాన్ తదితరులు పాల్గొన్నారు.

## ఆరోపణలతోనే ఆమెను బదిలి చేయించాం: రావిళ్ళ

తొట్టంబేడు,ఏప్రిల్ 13 ప్రభాతవార్త: తొట్టంబేడు మండలం రెవెన్యూ కార్యాలయంలో కొందరు అధికారులపై ప్రజల నుంచి పలు ఆరోపణలు రావటంతో పరిపాలనలో పారదర్శకత కోసం బదిలి చేయించక తప్పలేదని తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు రావిళ్ళ మునిరాజానాయుడు సోమవారం స్పష్టం చేసారు.కూటమి ప్రభుత్వం బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి పేద ప్రజల సమస్యలకు ప్రాధాన్యత ఇస్తారని అయితే రెవెన్యూ కార్యాలయంలో ఇద్దరు రెవెన్యూ ఇన్స్పెక్టర్లపై తరచూ తమకు ఫిర్యాదులు,ఆరోపణలు అందాయన్నారు.అందుకే శాసనసభ్యుని దృష్టికి తీసుకెళ్ళి వారిని బదిలి డెప్యూటేషన్ మీద పంపక తప్పలేదన్నారు. ఎంఎల్ ఆలోచనలకు అనుగుణంగా పరిపాలనలో పారదర్శకత ముఖ్యం అని రావిళ్ళ మునిరాజానాయుడు అన్నారు.ప్రభుత్వం పేద ప్రజలకు అండగా ఉండమంటే వారిని ఇబ్బంది పెట్టే అధికారులు అవసరమా? అని మునిరాజానాయుడు ప్రశ్నించారు.

## పేదోడ పై పగ!

పులిచెర్ల, ఏప్రిల్ 13 ప్రభాతవార్త: పేదోడుపై పగ పెంచుకొని, కక్ష కట్టి పింఛన్ రద్దు చేసి, అధికార ధిక్కరణ చేసిన అధికారి ఉదాంతం. చిత్తూరు జిల్లా.. పులిచెర్ల మండలం రాయవారిపల్లి పంచాయతీ పుచ్చులవారిపల్లెకు చెందిన మునిరత్నంకు గత ఆరు సంవత్సరాలగా ప్రభుత్వ పెన్షన్ వస్తున్నది. మునిరత్నంకు. దళితుడు కావడం చర్మకారు వృత్తి కోటాలో ప్రభుత్వం పింఛన్ మంజూరు చేసింది. గత ఆరు సంవత్సరాలుగా ప్రతినెల పింఛన్ అందుకుంటున్న మునిరత్నంను. పులిచెర్ల ఎంపీడీవో రాజశేఖర్ బాబు పింఛన్ రద్దు చేస్తూ నోటీసులు జారీ చేశారు. మునిరత్నం చర్మకారుడు కాదని. ప్రస్తుతం ఆ వృత్తిలో లేరని, అందుకు పింఛన్ రద్దు చేస్తున్నామంటూ నోటీసు పంపారు. పింఛన్ రద్దు చేయడంతో మునిరత్నం మనస్థాపానికి గురయ్యారు. విషయాన్ని ఎంపీడీవోను మునిరత్నం అడిగితే. నువ్వు చర్మకారుడు కాదు నీకు అందుకే రద్దు చేస్తున్నాం చెప్పడం జరిగిందని మునిరత్నం తెలిపారు. మండల అభివృద్ధి అధికారి అయినా ఎంపీడీవోకు పింఛన్ మంజూరు చేసే అధికారం కానీ రద్దు చేసే అధికారం కానీ లేదు. కేవలం పింఛన్ ఫిర్యాదు పై విచారణ చేపట్టి నివేదికను పై అధికారులకు పంపాలి అంతే అయితే పులిచెర్ల ఎంపీడీవో లేని అధికారాన్ని కల్పించుకుని, పింఛన్ రద్దు చేయడం విశేషం. ఈ విషయం అటు మండల అధికారులు ఇటు పంచాయతీ కార్యదర్శులకు తెలిసి ఆశ్చర్యపోతున్నారు. పై అధికారి కాబట్టి ఏమీ చెప్పలేకపోతున్నారు. ఇకనైనా ఉన్నత అధికారులు స్పందించి. పేదోడి పింఛన్ మంజూరు చేసే విధంగా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. కొసమెరుపు ఏమిటంటే ఎంపీడీవో మునిరత్నంకు పింఛన్ రద్దు చేస్తూ 2026 మార్చి 31వ తేదీ నోటీసు రెడీ చేశారు. అయితే మునిరత్నంకు ఏప్రిల్ 8వ తేదీ వాట్స్‌అప్లో నోటీసు పంపడం జరిగింది.

## నాంది సహకారంతో చలివేంద్రం : సిఐ



చంద్రగిరి, ఏప్రిల్ 13 ప్రభాతవార్త: చంద్రగిరి పోలీస్ స్టేషన్ వద్ద నాంది స్వచ్ఛంద సేవా సంస్థ వ్యవస్థాపకుడు పసల ప్రసాద్ సహకారంతో సోమవారం చలివేంద్రం ఏర్పాటు చేయడం అభినందనీయమని సిఐ సురేష్‌కుమార్ అన్నారు. పోలీస్ స్టేషన్‌కు వివిధ సమస్యలపై వచ్చే ప్రజల కోసం వేసవి తీవ్రత దృష్ట్యా నాంది స ంస్థ ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని సిఐ ప్రారంభించారు. అనంతరం ఆయన నాంది ప్రసాద్‌ను అభినందించారు. ఈ కార్యక్రమంలో నాంది వైస్ చైర్మన్ ఉదయ్‌కుమార్, సభ్యులు వెంకటయ్య, డాక్టర్ కిరణ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

## మహిళా సాధికారత బలోపేతానికి నారీ శక్తి వందన్



చంద్రగిరి, ఏప్రిల్ 13 ప్రభాతవార్త: కేంద్ర ప్రభుత్వం మహిళా సాధికారత బలోపేతానికి చట్ట సభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించే చారిత్రాత్మక చట్టం "నారీ శక్తి వందన్" అమలుకు చర్యలు చేపట్టడం శుభపరిణామమని చంద్రగిరి (అగరాల వద్ద గల) ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ జి.ఉషాదేవి అన్నారు. ఉన్నత విద్యాశాఖ కమీషనర్ ఆదేశాల మేరకు సోమవారం పాలిటెక్నిక్ కళాశాలలో శ్రీశక్తి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పార్లమెంట్, అసెంబ్లీలలో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించే 106వ రాజ్యాంగ సవరణ చట్టం-2023 ద్వారా 1/3 వంతు సీట్లు మహిళలకు కేటాయించనున్నట్లు తెలిపారు. ఈ చట్టం 2026-2029 మధ్య కాలంలో నియోజకవర్గాల పునర్విభజన అనంతరం ఈ చట్టాన్ని అమలు చేయడానికి కేంద్రం చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ఈ చట్టం దేశా వ్యాప్తంగా చట్టసభల్లో ప్రాతినిధ్యం వహించనున్న 70 కోట్ల మంది మహిళలకు నిర్ణయాధికార భాగస్వామ్యాన్ని కల్పిస్తుందన్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా మహిళలు కేవలం విద్య, పోషణ వంటి అంశాలకే పరిమితం కాకుండా సాయుధ బలగాలలో, ఫైటర్ జెట్లను నడపడం లోనూ విశేషంగా రాణిస్తున్నట్లు తెలిపారు.

## లాభాల కోసం విద్యార్థుల ప్రాణాలతో ఆట !

### ఎండల్లో క్లాసులు కొనసాగిస్తున్న కార్పొరేట్ కాలేజీలపై మండిపాటు



తిరుపతి విద్య,ఏప్రిల్ 13 ప్రభాతవార్త: తిరుపతిలో మండుతున్న ఎండలను పట్టించుకోకుండా కొన్ని ప్రైవేట్, కార్పొరేట్ జూనియర్ కాలేజీలు విద్యార్థులను ఉదయం 8 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు తరగతుల్లో బంధించడం తీవ్ర విమర్శలకు దారి తీస్తోంది. విద్యార్థుల ఆరోగ్యం, భద్రతలను పక్కన పెట్టి కేవలం ఫలితాలు, ర్యాంకుల పేరుతో ఒత్తిడి పెంచుతున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. పలుమార్లు ఫిర్యాదులు చేసినా చర్యలు తీసుకోకపోవడం అధికార యంత్రాంగం నిర్లక్ష్యానికి నిదర్శనమని మండిపడ్డారు. వెంటనే ప్రత్యేక తనిఖీ బృందాలు ఏర్పాటు చేసి, నిబంధనలు ఉల్లంఘిస్తున్న కాలేజీలపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బిడివిఎస్ అధ్యక్షుడు కొండ యుగంధర్, మాల విద్యార్థి సంఘం నాయకుడు సుకుమార్, విద్యార్థి నాయకులు నరేష్, ముఖేష్, కృష్ణ, విష్ణు తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక డ్రైవ్

### - మందేసి వాహనం నడిపితే కఠిన చర్యలు



తిరుపతి,ఏప్రిల్ 13ప్రభాతవార్త: తిరుపతి జిల్లాలో పోలీసులు మందుకొట్టి వాహనాలు నడిపే వారిపై కఠిన చర్యలు తీసుకుంటున్నారు. 21 మందిపై కేసులు నమోదు చేసి జరిమానా వసూలుచేశారు. రోడ్డు ప్రమాదాల నివారణకు తిరుపతి ట్రాఫిక్ పోలీసుల కఠిన చర్యలు తీసుకుంటున్నారు. మందుసేవించి వాహనాలు నడిపిన వారినుండి న్యాయస్థానంలో 2.10 లక్షల జరిమానా వసూలు చేశారు. ట్రాఫిక్ ఉల్లంఘనలపై కఠిన చర్యలు - 35 మందిపై కేసులు నమోదు చేశారు.